ఆదివారం
11•8•2019
కరీంనగర్
• వెల. రూ.8.00
• సంపుటి 9 • సంచిక 47
• పేజీలు: 14 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






పంచాయతీరాజ్‌ను
బలోపేతం చేయాలి
పరిషత్ సభ్యుల విధులు
త్వరలోనే ఖరారు
ఎవరి పాత్ర ఎంతో నిర్ధారిస్తాం
సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

# జిల్లాస్థాయి గ్రీన్ కమిటీలు

## కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు: సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కొత్త పంచాయతీరాజ్ చట్టం వెలుగులో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. గ్రామపంచాయతీ నుంచి జిల్లాపరిషత్తుల వరకు ఎవరు ఏ విధులు నిర్వర్తించాలనే విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా, మండల పరిషత్తులు ఇప్పటిమాదిరిగా ఏ పనీ లేకుండా ఉత్సవ విగ్రహాలుగా ఉండబోవని, అధికార వికేంద్రీకరణ ద్వారా వాటికి విధులు, నిధులు, బాధ్యతలు, అధికారాలు అప్పగిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు ఆదేశాలు జారీచేశారు. గ్రామాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలవడానికి ముందే స్థానికసంస్థలకు అప్పగించే విధులు, నిధులు, బాధ్యతల విషయాల్లో స్పష్టత ఇస్తామని వెల్లడించారు. గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనం పెంచే కార్యక్రమాన్ని

మిగతా 2వ పేజీలో



శనివారం శ్రీశైలం 10 గేట్ల ద్వారా సాగర్‌కు విడుదలవుతున్న నీళ్లు

# సాగర్‌కు పులకింత

## శ్రీశైలం పదిగేట్ల నుంచి కృష్ణమ్మ పరవళ్లు.. నాగార్జునసాగర్‌కు ఐదు లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో

**హైదరాబాద్/మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:**

**సాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా నేడు నీటి విడుదల**

- సాగర్‌కు గంటగంటకూ పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- శ్రీశైలం ప్రాజెక్టుకు పోటెత్తిన పర్యాటకులు
- 35 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

చాలాకాలం తర్వాత కృష్ణమ్మ తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నది. ఆగస్టు నెలలోనే శ్రీశైలం దాటి జలాలు నాగార్జునసాగర్‌కు పోటెత్తడం రెండు తెలుగు రాష్ట్రాల్లో జల సంబురాన్ని నింపింది. కృష్ణమ్మ పరవళ్లు చూస్తుంటే ఈసారి నాగార్జునసాగర్ వద్ద అపురూప జలదృశ్యం కొన్నిరోజుల వ్యవధిలోనే సాక్షాత్కారం కానున్నట్టు స్పష్టమవుతున్నది. శనివారం రాత్రి సాగర్ జలాశయానికి 5.34 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదలచేయాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్ణయించాయి. సాగర్ నుంచి కాల్వల ద్వారా నీటి విడుదలను తెలంగాణ, ఏపీ మంత్రులు జగదీశ్ రెడ్డి, అనిల్‌కుమార్ ప్రారంభిస్తారు. ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టికి వరద ఉధృతి పెరుగుతుండటంతో ముందస్తు అంచనాలతో శ్రీశైలం నుంచి ఏకంగా పది గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా భారీ ఎత్తున నీటిని నదిలోకి విడుదలచేస్తున్నారు. అటు తుంగభద్రకు కూడా వరద పెరుగుతుండటంతో టీబీ డ్యాం నుంచి అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. శ్రీశైలం జలాశయానికి ఆదివారం రాత్రి మరింత ఇన్‌ఫ్లో తోడు కానున్నది. ఆల్మట్టికి ఆదివారం ఆరు లక్షల క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో పెరుగుతుందని కేంద్ర జలసంఘం ముందస్తు సమాచారమిచ్చినప్పటికీ, ఆ స్థాయి ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రమే మొదలైంది. సాయంత్రం ఆరు గంటలకు ఆల్మట్టికి ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండగా.. అవుట్‌ఫ్లో 5.30 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. నారాయణపుర వద్ద ఇన్‌ఫ్లో ఏకంగా 6.30 లక్షలు కాగా అవుట్‌ఫ్లో 6.25 లక్షలుగా నమోదైంది. ఉజ్జయిని నుంచి కూడా భీమా ద్వారా ప్రధాన కృష్ణాలోకి 95వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తున్నది. జూరాల జలాశయానికి శనివారం రాత్రి 6.03 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. తుంగభద్ర ప్రస్తుతం ఉరకలెత్తుతున్నది. శనివారం రాత్రి టీబీ డ్యాంలోని 28 గేట్లు ఎత్తి 80,000 క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆదివారం మధ్యాహ్నం ఆర్డీఎస్ ఆనకట్టకు వరద చేరుకొనే అవకాశమున్నది.

**మల్లన్నసాక్షిగా నురగలు**

శనివారం రాత్రి పది గంటల సమయానికి శ్రీశైలం ఇన్‌ఫ్లో 4.86 లక్షల క్యూసెక్కులకు పైగా

మిగతా 3వ పేజీలో

**నాగార్జునసాగర్ ఎగువ ప్రాజెక్టుల అవుట్‌ఫ్లోలు ఇలా..**

| | |
|---|---|
| ఆల్మట్టి | 5,30,000 క్యూసెక్కులు |
| నారాయణపుర | 6,25,200 క్యూసెక్కులు |
| జూరాల | 5,63,151 క్యూసెక్కులు |
| శ్రీశైలం | 5,66,977 క్యూసెక్కులు |

# లక్ష్మి, పార్వతి, సరస్వతి బరాజ్‌లు

## కాళేశ్వరం ప్రాజెక్టులకు దేవతల పేర్లు

## ఖరారుచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన కీలకమైన నిర్మాణాలు.. బరాజ్‌లు, పంపుహౌస్‌లకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. దేవతామూర్తుల పేర్లను ఖరారు చేశారు. లక్ష్మి, సరస్వతి, పార్వతి, గాయత్రి తదితర పేర్లు పెట్టారు. మేడిగడ్డ బరాజ్‌కు లక్ష్మీ బరాజ్ అని, కన్నెపల్లి పంపుహౌస్‌కు లక్ష్మీ పంపుహౌస్‌గా, అన్నారం బరాజ్‌కు సరస్వతి బరాజ్‌గా, సిరిపురం (అన్నారం) పంపుహౌస్‌కు సరస్వతి పంపుహౌస్‌గా నామకరణం చేశారు. సుందిల్ల బరాజ్‌కు పార్వతి బరాజ్‌గా, గోలివాడ (సుందిల్ల)కు పార్వతి పంపుహౌస్‌గా పేరు పెట్టారు. నంది మేడారం రిజర్వాయర్, పంపుహౌస్‌కు నంది రిజర్వాయర్, పంపుహౌస్‌గా, లక్ష్మీపురం (రామడుగు) పంపుహౌస్‌కు గాయత్రి పంపుహౌస్‌గా పేర్లు ఖరారుచేశారు.



5

# మళ్లీ సోనియా

పార్టీ పగ్గాలు అప్పగించిన సీడబ్ల్యూసీ
కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎంపిక
కొత్త ప్రెసిడెంట్ ఎంపిక పెండింగ్

# కొత్త పార్లమెంట్ నిర్మాణ యోచన

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడి

5

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్‌డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 328.00 | రంగారెడ్డి | 328.00 |
| మెదక్ | 328.00 | కరీంనగర్ | 331.00 |
| వరంగల్ | 331.00 | చిల్లర ధర | 3.90 |

# మత రాజకీయం మంచిదికాదు

**'నాతో ఉంటే దేశభక్తుడివి.. లేకుంటే దేశద్రోహివి' అనే ధోరణి పెరుగుతున్నది**

జాతిపితనే గౌరవించుకోలేని జాతి ఎటుపోతున్నది?

తెలంగాణది పరమత సహనం, కలిసిమెలిసి ఉండే గొప్పగుణం

టీవీఎస్ రాష్ట్ర మహాసభల్లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

2




శనివారం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన టీవీఎస్ రాష్ట్ర మహాసభలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నీరా చందోక్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



# సాధారణ స్థితికి జమ్ము

తెరుచుకున్నవిద్యాసంస్థలు
ఐదు జిల్లాల్లో ఆంక్షలు ఎత్తివేత
రెండు జిల్లాల్లో కర్ఫ్యూ సడలింపు

III





శనివారం తన పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి



తన పుట్టినరోజు సందర్భంగా సీఎం కేసీఆర్ నుంచి ఆశీర్వాదం పొందుతున్న టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు

## 15న జాతీయ ఉద్యాన, వ్యవసాయ, నర్సరీ మేళా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ ఉద్యాన, వ్యవసాయ, నర్సరీ ప్రదర్శనకు భాగ్యనగరం మరోసారి వేదిక కానున్నది. ఈ నెల 15న నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజా ప్రాంగణంలో తెలంగాణ ఉద్యానవనశాఖ సహకారంతో ఈవెంట్ ఆర్గనైజేషన్ సంస్థ, టీఈవో ఆధ్వర్యంలో 7వ జాతీయమేళా-2019 జరుగనున్నది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పేరెన్నికగన్న కంపెనీలు, నర్సరీలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అంకుర కేంద్రాల ఆధ్వర్యంలో 100కుపైగా స్టాళ్లు కొలువు తీరనున్నాయి. నగరసేద్యానికి ఆదరణ పెరుగుతున్న తరుణంలో ఇంటి ఆవరణ, డాబా, బాల్కనీ, బహుళ అంతస్తుల భవనాలపై ఆకుకూరలు, పండ్లు, పూలమొక్కలు పెంచుకోవడానికి అనువైన విత్తనాలు, నారు, సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉంచుతామని ఈవెంట్ ఆర్గనైజేషన్ చైర్మన్ ఖలీద్ అహ్మద్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ మినిస్టర్‌రోడ్డులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ జాతీయ ప్రదర్శనను వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ప్రారంభిస్తారని చెప్పారు. హైడ్రోఫోనిక్, టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, పలు రకాల మొక్కలు, ఎగ్జాటిక్, బోన్సాయ్, కాక్టస్, సక్కులెంట్, అడేనియం, ఇండోర్, అవుట్‌డోర్, హైక్వాలిటీ ఫ్రూట్స్, ఫ్లవర్స్, ఔషధమొక్కలు, ఆక్సిజన్‌శుద్ధి మొక్కల ప్రదర్శన, విక్రయాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఈవెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జయద్ అహ్మద్, ప్రముఖ సేంద్రియ రైతు వేలాది పురుషోత్తమరావు పాల్గొన్నారు.

## మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి 23 వరకు గడువు

### నోటిఫికేషన్ జారీచేసిన ఉన్నత విద్యామండలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో యాజమాన్య (మేనేజ్‌మెంట్) కోటా, 15 శాతం ఎన్నారై కోటా సీట్ల భర్తీకి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈ నెల 23 వరకు గడువు విధించింది. భర్తీ చేసుకున్న సీట్ల అనుమతి కోసం ఉన్నత విద్యామండలికి జాబితాలు పంపడానికి కూడా అదేరోజు చివరి తేదీగా నిర్ణయించింది. రూ.1,000 ఆలస్య రుసుంతో ఈ నెల 30 వరకు గడువు విధించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు తమ అధికారిక వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌ను అప్‌లోడ్ చేశారు. http://www.tsche.ac.in/college-uploads వెబ్‌పోర్టల్ ద్వారా కాలేజీలవారీగా భర్తీ చేసుకున్న బీ సీట్ల వివరాలు అప్‌లోడ్ చేసి, బీ కోటా అడ్మిషన్ల హార్డ్‌కాపీల దాఖలుకు 31 వరకు గడువిచ్చారు. దశలవారీగా అప్‌లోడ్ చేసినవారి సీట్లను రాటిఫికేషన్‌చేసే ప్రసక్తే ఉండబోదని విద్యామండలి అధికారులు స్పష్టంచేశారు.



# జిల్లాస్థాయి గ్రీన్ కమిటీలు


మొదటిపేజీ తరువాయి...


పర్యవేక్షించేందుకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి గ్రీన్‌కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామాలు బాగుపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, పట్టుబట్టి పనిచేస్తే గ్రామాల్లో తప్పక మార్పు వస్తుందనే నమ్మకం ఉన్నదని సీఎం చెప్పారు. పల్లెల రూపురేఖలు మార్చడంకోసం ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చిందని, ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యతలు స్పష్టంగా నిర్వచించామని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వం స్థానికసంస్థలకు అధికారాలను బదిలీచేయాలని నిర్ణయం తీసుకున్నదని, సహాయమంత్రి హోదా కలిగిన జెడ్పీ చైర్‌పర్సన్ కూడా ప్రస్తుతం ఏ పనీ లేకుండా ఉండటం సమంజసం కాదని సీఎం పేర్కొన్నారు. ప్రజలతో ఎన్నికైన ఎంపీపీలు, జెడ్పీటీసీలది కూడా ఇదే కథగా ఉన్నదన్నారు. భవిష్యత్తులో ఇలా జరుగటానికి వీల్లేదని, స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా పాలనలో భాగస్వామ్యం కావాలని చెప్తూ.. విద్య, వైద్యం, పచ్చదనం, పారిశుద్ధ్యం.. ఇలా ఏ విషయంలో ఎవరిపాత్ర ఎంత అనేది నిర్ధారిస్తామని సీఎం కేసీఆర్ వివరించారు. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తులు ఏంచేయాలనే విషయాలపై పూర్తి స్పష్టత ఇస్తామని చెప్పారు. త్వరలోనే కేంద్ర ఆర్థికసంఘం నిధులు కూడా వస్తాయని, దానికి సమానంగా రాష్ట్రవాటా కేటాయిస్తామని, ఈ నిధులను స్థానికసంస్థలకు విడుదలచేస్తామని తెలిపారు. నిధుల విడుదల తర్వాతే గ్రామాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



పంచాయతీరాజ్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం ప్రగతిభవన్‌లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

### విస్తృత అధ్యయనం తర్వాత తుదిరూపం

గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తులు ఏ విధులు నిర్వర్తించాలనే అంశాలపై విస్తృత అధ్యయనం చేస్తామని ప్రకటించారు. ఏయే అంశాల్లో వారి బాధ్యతలు ఎంతవరకు ఉంటాయి? ఎలాంటి అధికారాలు ఉంటాయి? తదితర విషయాలపై సమగ్ర చర్చ, పూర్తిస్థాయి అధ్యయనం జరుపాలని సీఎం కేసీఆర్.. మంత్రి దయాకర్‌రావును ఆదేశించారు. పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసిన అనుభవం కలిగిన నాయకులు, అధికారులు, విషయనిపుణులతో విస్తృతంగా చర్చించి, ముసాయిదా రూపొందించాలని కోరారు. ముసాయిదాపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో చర్చిస్తామని, మంత్రివర్గ సమావేశంలో, ఆ తర్వాత అసెంబ్లీలో కూడా విస్తృతంగా చర్చిస్తామని వెల్లడించారు. ఆయా సందర్భాల్లో వచ్చిన సూచనలు, సలహాలను కూడా తీసుకుని ప్రభుత్వం విధులు, నిధులు, బాధ్యతలు, అధికారాలపై స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తుందని తెలిపారు. ఇదంతా జరిగి, మున్సిపల్ ఎన్నికలు కూడా ముగిసిన తర్వాత గ్రామాలు, పట్టణాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుచేస్తామని ప్రకటించారు.

### ఖాళీలన్నీ భర్తీచేయాలి

పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లాపరిషత్ సీఈవో వరకు అన్ని ఖాళీలను భర్తీచేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈవోపీఆర్డీ పోస్టులను ఇకపై మండల పంచాయతీ అధికారులుగా పరిగణిస్తామన్నారు. గ్రామ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, సీఈవోలు... ఇలా అన్ని విభాగాల్లో అవసరమైనవారికి పదోన్నతులు కల్పిస్తూ ఖాళీపోస్టులను భర్తీచేయాలని సీఎం ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల ఎంపికకు నేరుగా నియామకాలు జరుపాలని చెప్పారు. సమావేశంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూప్రసాద్, సీఎంవో కార్యదర్శులు స్మితాసబర్వాల్, భూపాల్‌రెడ్డి, ఓఎస్డీ ప్రియాంకవర్గీస్, ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, తేరా చిన్నపరెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, మాజీమంత్రి బస్వరాజు సారయ్య, గట్టు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పంద్రాగస్టు పతాకావిష్కర్తలు వీరే..

- మంత్రులు, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్సీలకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 15న నిర్వహించే పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కంచే అతిథుల జాబితాను ఖరారుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో మంత్రులు, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్సీలకు జెండాను ఎగురవేసే అవకాశం కల్పించింది. హోంమంత్రి మహమూద్ అలీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జెండా ఎగురవేయనున్నారు.


| జిల్లా | ముఖ్య అతిథి |
|---|---|
| ఆదిలాబాద్ | జనార్దన్ రాథోడ్, జెడ్పీ చైర్మన్ |
| భద్రాద్రి కొత్తగూడెం | మహమూద్ అలీ, హోంశాఖ మంత్రి |
| జగిత్యాల | కొప్పుల ఈశ్వర్, సంక్షేమశాఖ మంత్రి |
| జయశంకర్ భూపాలపల్లి | జక్కు శ్రీహర్షిణి, జెడ్పీ చైర్‌పర్సన్ |
| జనగామ | పాగాల సంపత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ |
| జోగుళాంబ గద్వాల | సరిత, జెడ్పీ చైర్‌పర్సన్ |
| కామారెడ్డి | దఫెదార్ శోభ, జెడ్పీ చైర్‌పర్సన్ |
| ఖమ్మం | తలసాని శ్రీనివాస్‌యాదవ్, పశుసంవర్ధకశాఖ మంత్రి |
| కరీంనగర్ | ఈటల రాజేందర్, ఆరోగ్యశాఖ మంత్రి |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | కోవ లక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ |
| మహబూబ్‌నగర్ | వీ శ్రీనివాస్‌గౌడ్, ఎక్సైజ్‌శాఖ మంత్రి |
| మహబూబాబాద్ | ఆంగోతు బిందు, జెడ్పీ చైర్‌పర్సన్ |
| మంచిర్యాల | నల్లాల భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ |
| మెదక్ | ర్యాకల హేమలత, జెడ్పీ చైర్‌పర్సన్ |
| మేడ్చల్ మల్కాజ్‌గిరి | సీహెచ్ మల్లారెడ్డి, కార్మికశాఖ మంత్రి |
| ములుగు | బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ |
| నాగర్‌కర్నూల్ | పెద్దపల్లి పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ |
| నల్లగొండ | నేతి విద్యాసాగర్, మండలి డిప్యూటీ చైర్మన్ |
| నారాయణపేట | వనజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ |
| నిర్మల్ | ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి |
| నిజామాబాద్ | వేముల ప్రశాంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి |
| పెద్దపల్లి | పుట్ట మధు, జెడ్పీ చైర్మన్ |
| రాజన్న సిరిసిల్ల | న్యాలకొండ అరుణ, జెడ్పీ చైర్‌పర్సన్ |
| రంగారెడ్డి | పద్మారావుగౌడ్, డిప్యూటీ స్పీకర్ |
| సంగారెడ్డి | పీ మంజుశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ |
| సిద్దిపేట | పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ |
| సూర్యాపేట | జీ జగదీశ్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి |
| వికారాబాద్ | పట్నం సునీత, జెడ్పీ చైర్‌పర్సన్ |
| వనపర్తి | సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి |
| వరంగల్ అర్బన్ | ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి |
| వరంగల్ రూరల్ | పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ |
| యాదాద్రి భువనగిరి | ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ |

## ఆట బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్న 'ఆట బాలోత్సవం' పోస్టర్‌ను విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ ఉత్సవంలో ఏ రాష్ట్రానికి చెందినవారైనా కేజీ నుంచి పీజీ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని నిర్వాహకుడు బెక్కంటి శ్రీనివాస్ తెలిపారు. అందరికీ ఉచితప్రవేశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 13 వరకు ప్రతిపాదనలు పంపించాలని, పూర్తి వివరాలకోసం ataindia.ga వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. బెక్కంటి శ్రీనివాస్ చారిటుబుల్ ట్రస్ట్, ఉత్తమ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు

- జాతీయ నర్సింగ్ సదస్సులో మంత్రి ఈటల రాజేందర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేసీఆర్ కిట్ పథకం అమల్లోకి తెచ్చిన తర్వాత ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరిగాయని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. సిజేరియన్లు తగ్గుముఖం పట్టి సహజ ప్రసవాలు పెరుగడంలో నర్సింగ్ సేవలు అమూల్యమైనవన్నారు. నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఇన్నోవేటివ్ అలయన్స్ ఫర్ పబ్లిక్ హెల్త్ సంయుక్తంగా శనివారం కిమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించిన జాతీయ నర్సింగ్ సదస్సులో ఆయన ప్రసంగించారు. గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు మిషన్ భగీరథ ద్వారా అందుతుండటంతో వ్యాధులు తగ్గుముఖం పట్టాయన్నారు. శాస్త్ర, సాంకేతికతను వినియోగించుకొని ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నామని తెలిపారు. కిమ్స్ హాస్పిటల్ ఎండీ అండ్ సీఈవో బీ భాస్కర్‌రావు, ఏవోవో వ్యవస్థాపకుడు లక్ష్మణ్ రుడావత్, వెల్‌టెక్ ఫౌండేషన్ చైర్మన్ వీరాచారి, ఓయూ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాలత, కిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ సుశీల, నర్సింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టబద్ధపాలనే కీలకం

- సర్దార్ పటేల్ స్మారక ప్రసంగంలో సీజేఐ రంజన్ గొగోయ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజాస్వామ్య దేశాలకు చట్టబద్ధపాలనే కీలకమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. చట్టపాలన తప్పనిసరిగా ప్రభుత్వ విధానంతో ముడిపడి ఉండాల్సిన అవసరం లేదని, అంతిమంగా న్యాయసమీక్ష ముఖ్యపాత్ర పోషిస్తున్నదని అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో సర్దార్ పటేల్ 33వ స్మారకోపన్యాసం చేశారు. చట్టపరమైన సమానత్వం, ప్రజాస్వేచ్ఛ, పాలనలే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం అని రంజన్ గొగోయ్ పేర్కొన్నారు. దేశమాత సేవలో జీవితాన్ని అంకితం చేసేందుకు ఐపీఎస్‌ను ఎంచుకొన్నందుకు ప్రొబేషనరీలను ఆయన అభినందించారు. స్వతంత్ర భారతదేశం బలమైన రాజ్యాంగ చట్రంలో ఉండేందుకు సర్దార్ పటేల్ సివిల్ సర్వీసెస్‌ను మలిచిన తీరు ప్రశంసనీయమన్నారు.

# మత రాజకీయం మంచిదికాదు

- 'నాతో ఉంటే దేశభక్తుడివి.. లేకుంటే దేశద్రోహివి' అనే ధోరణి పెరుగుతున్నది
- టీవీఎస్ మహాసభల్లో కేటీఆర్




శనివారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ వికాస సమితి మూడవ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో వికాస సమితి అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'నాతో ఉంటే దేశభక్తుడివి.. లేకుంటే నీవు దేశద్రోహివి' అనే ధోరణి దేశంలో పెరిగిపోతున్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో మతం, రాజకీయం, జాతీయవాదం పరస్పరం విడదీయలేనంతగా పెనవేసుకుపోయాయని, మతాన్ని రాజకీయాన్ని మిళితం చేయడంవల్ల రాబోయే ప్రమాదాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. సెక్యులర్ దేశం అంటే మతాన్ని రద్దు చేయడంగానీ.. మరో మతాన్ని ముద్దు పెట్టుకోవడంకానీ కాదని స్పష్టంచేశారు. జాతిపిత మహాత్మాగాంధీని చంపిన గాడ్సేను దేశభక్తుడిలా పొగుడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మహాత్ముడినే గౌరవించుకోలేని జాతి ఎటుపోతున్నదని ప్రశ్నించారు. తెలుగువర్సిటీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన తెలంగాణ వికాససమితి (టీవీఎస్) మూడో రాష్ట్ర మహాసభల్లో కేటీఆర్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

### పరమత సహనం, కలిసిమెలిసి ఉండే గొప్పగుణం

తెలంగాణలో గొప్ప సంస్కృతి ఉన్నది.. పరమత సహనం.. కలిసిమెలిసి ఉండే గుణం.. ఇతరులను గౌరవించే గొప్పగుణం ఉన్నది. భద్రాచలంలో సీతారాముల కల్యాణం జరిగినప్పుడు ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి తలంబ్రాలు తీసుకొనిపోతారు. ఇది ఇప్పటి సంప్రదాయం కాదు. కులీకుతుబ్‌షా ప్రభుత్వం కూడా భద్రాద్రి రాముడి కల్యాణానికి తలంబ్రాలు పంపించి పరమతంపట్ల గౌరవాన్ని చాటిన గొప్పనేల తెలంగాణ. తెలంగాణవ్యాప్తంగా మతభేదం లేకుండా వావివరుసలతో ఆప్యాయంగా, ప్రేమతో పిలుచుకుంటారు.

### ఉర్దూకు మతానికి సంబంధంలేదు

తెలంగాణలో ఉర్దూ రెండో అధికార భాష. మతానికి భాష ఉంటుంది కానీ భాషకు మతం ఉండదని జయశంకర్‌సార్ అనేకమార్లు చెప్పేవారు. చాలామంది ఉర్దూ అనగానే ఇది మన భాషకాదు.. ముస్లింలకు మాత్రమే సంబంధించిన భాష అనే తప్పుడు అభిప్రాయంతో ఉన్నారు. కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జయశంకర్‌సార్ స్వచ్ఛమైన ఉర్దూ మాట్లాడేవారు. పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి, ముఖ్యమంత్రి కేసీఆర్ అనర్గళంగా మాట్లాడుతారు.

### నాతో ఉంటే నీవు దేశభక్తుడివి..!

నేను అమెరికాలో చదువుకున్నా. ఉద్యోగం చేశా. నేను అక్కడ ఉన్నప్పుడు జార్జ్ డబ్ల్యూ బుష్ అమెరికా అధ్యక్షుడిగా ఉండేవారు. సెప్టెంబర్ 11 దాడుల అనంతరం ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ మీద యుద్ధాన్ని ప్రకటించారు. అప్పుడు ఆయన.. 'అయితే నాతో ఉన్నావు.. నాతో లేవంటే.. నాకు వ్యతిరేకంగా ఉన్నట్లే లెక్క కడుతా' అనేమాట అన్నారు. ఈరోజు మనదేశ రాజకీయ పరిస్థితి ఇదేవిధంగా ఉన్నది. 'నాతో ఉంటే నీవు దేశభక్తుడివి.. లేకుంటే నీవు దేశద్రోహివి' అనే పరిస్థితి మన దేశంలో కూడా దాదాపుగా ఉన్నది. చర్చకు, తర్కానికి, విభిన్న అభిప్రాయాలకు, వైరుధ్యాలకు, మిత్రవైరుధ్యాలకు కూడా విలువలేని పరిస్థితి మనదేశంలో వస్తున్నది.

### వారికి ఆ సమస్య అలాగే ఉండాలి

నేను మున్సిపల్‌శాఖ మంత్రిగా ఉన్నప్పుడు.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పెరుగుతున్నది.. ట్రాఫిక్‌జాములవుతున్నాయి.. గంటలు గంటలు రోడ్లమీద ఇరుక్కుపోతున్నామని చాలామంది మిత్రులు నాతో చెప్పేవారు. ఆ సమస్య పరిష్కారానికి ప్రయత్నించాం. మసీదులు, దేవాలయాలు రోడ్లమధ్యనే ఉంటాయి. ఆయా మతపెద్దలతో మాట్లాడుదామని అనుకున్నా. ముందుగా రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడాలని అధికారులు సూచించారు. దీంతో అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్న పార్టీల నాయకులతో మాట్లాడాను. ఫోన్‌లో మాట్లాడినప్పుడు అందరూ వాటిని తొలిగించడానికి ఒప్పుకొన్నారు. అయితే ముందుగా మీ పార్లమెంట్ నియోజకవర్గంలో మొదలుపెడుదామన్నాను. కానీ వారు అభ్యంతరంపెట్టారు. ఫలానా పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మొదలుపెట్టాలని సూచించారు. దీంతో వారికి వాటిని తొలిగించాలనే ఉద్దేశం లేదని.. వారికి ఆ సమస్య అలాగే ఉండటమే మంచిదని అర్థమైంది.

### జయశంకర్ స్ఫూర్తితో పనిచేద్దాం

తెలంగాణ వికాససమితి చాలామంది బుద్ధిజీవులు, మేధావులు, రచయితలు, ఉపాధ్యాయులు, కళాకారులు అందరూ ఆరేండ్ల క్రితం ఒక దగ్గరికివచ్చి తెలంగాణ ఒక స్థిరమైన, సఫలమైన రాష్ట్రంగా ముందుకుపోవాలంటే మా పాత్ర ముగియలేదని, కలసికట్టుగా ఉంటూ అవసరమైతే సందర్భానుసారం లోటుపాట్లను ఎత్తిచూపుతామనే ఉద్దేశంతో, మంచి జరిగినప్పుడు ప్రశంసిస్తామనే ఉదాత్తమైన ఆశయంతో ఏర్పడ్డ సంస్థ. ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో తెలంగాణ శక్తుల ఐక్యత కోసం పనిచేద్దాం.

### సెక్యులర్ అంటే మతం రద్దు కాదు

సెక్యులర్ దేశం అంటే మతాన్ని రద్దుచేయడం కాదు.. మతాన్ని రద్దుచేయమని చెప్పలేదు.. అదే సమయంలో ఒక మతాన్ని ముద్దుచేయమని కూడా ఎక్కడా చెప్పలేదు. సెక్యులర్ స్టేట్ అంటే పరస్పరం ఒకరి విశ్వాసాలను ఒకరు గౌరవిస్తూ.. ఒకరి మతసంప్రదాయాలు, విశ్వాసాలు, వాటన్నింటిని గౌరవిస్తూనే పరస్పరం సహనంతో మనుగడ సాగించడం.

### వర్తమాన పరిణామాలను గమనించాలి

'ఏ ఉద్దేశంతో తెలంగాణ సాధించుకున్నామో.. ఆ ఉద్దేశం సఫలమైందా.. కాలేదా..? నీళ్లు, నిధులు, నియామకాలు.. మేం అన్ని గొప్పగా చేస్తున్నామనేమాట నేను చెపుతా. కొన్ని లోటుపాట్లు ఉండొచ్చు. వాటిని ఎత్తిచూపండి. అన్ని వర్గాలను ఏకకాలంలో సంతృప్తిపరచకపోవచ్చు. పేదప్రజలు గౌరవించుకునే గొప్ప సంప్రదాయానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. వికాససమితి ప్రజల్లో జరుగుతున్న చర్చను, వర్తమాన పరిణామాలను గమనించాలి. ఏ ఉద్దేశంతో, ఏ నినాదం ప్రాతిపదికన రాష్ట్రం ఏర్పడిందో.. రాష్ట్రఏర్పాటుకు నడుంబిగించి పనిచేశామో.. అటువైపు మళ్లీ ప్రజల ఆలోచనను తీసుకెళ్లాలి' అని కేటీఆర్ అన్నారు.

### ప్రశ్నించే స్వేచ్ఛను కాపాడాలి: చందోక్

మహాసభలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నీరా చందోక్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. ప్రశ్నించే స్వేచ్ఛను కాపాడాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. తెలంగాణ అనేక విషయాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని కొనియాడారు. దేశంలో సమాఖ్య విలువలకు తూట్లు పొడుస్తున్నారని, ప్రాంతీయ ఆకాంక్షలు పట్టించుకోవడంలేదని టీవీఎస్ అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, అంబేద్కర్ వర్సిటీ మాజీ వీసీ సీతారామారావు, మాడభూషి శ్రీధర్, నమస్తే తెలంగాణ డిప్యూటీ ఎడిటర్ పీ వేణుగోపాలస్వామి, ఉన్నతవిద్యామండలి సభ్యుడు ఓ నర్సింహారెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు కే సుధీర్‌రెడ్డి, తెలంగాణ వికాససమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు హెచ్ రవీందర్, కవ్వా లక్ష్మారెడ్డి, డాక్టర్ జయంతి, జీ వెంకటేశ్వర్లు, భిక్షపతినాయక్ పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం..

తెలంగాణ వికాససమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేశపతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రోజు శ్రీనివాస్, కోఆర్డినేటర్‌గా నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జయంతి, జీ వెంకటేశ్వర్లు, హెచ్ రవీందర్, ఎం భిక్షపతినాయక్, పీ రాజు, పీ వెంకన్న, ఎం విజయానంద్, కార్యదర్శులుగా యశ్‌పాల్, కే రంగాచారి, పీ ప్రకాశ్‌రావు, గోవర్దన్, శేష్‌బాబా, ఉప్పాల సుధాకర్, రాచర్ల వెంకన్న ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా ఏ సుధాకర్‌రెడ్డి, కే లక్ష్మణ్‌రావు, ఆర్ గోపాలకృష్ణ, డాక్టర్ రవీందర్‌రెడ్డి, వీ బీకోజీ, సిహెచ్ శ్రీనివాస్, భాస్కర్‌రావు, గద్వాల రమేశ్, జీ రమేశ్, ఏ విద్యావతి, డాక్టర్ త్రివేణి, ఆశారూప, ఎం అజీజ్, సునీల్‌కుమార్ , సురేందర్‌రెడ్డి, రవిప్రకాశ్, రుబెస్టివేన్‌సన్, మంథని శ్రీదేవి, బీ సత్యనారాయణ, బీ రవీందర్‌రావు, వీ పురుషోత్తంరావు ఎన్నికయ్యారు. అడ్వయిజరీబోర్డు సభ్యులుగా ప్రొఫెసర్ టీ పాపిరెడ్డి, ప్రొఫెసర్ కే సీతారామారావు, పీ వేణుగోపాలస్వామి, ప్రొఫెసర్ వినయ్‌బాబు, డాక్టర్ ఏ శ్రీధర్, ప్రొఫెసర్ లింబాద్రి, కే సుధీర్‌రెడ్డి, కావ్వా లక్ష్మారెడ్డి, ప్రకాశ్‌రావు, కారం రవీందర్‌రెడ్డి, ఏ విరాహత్‌అలీ, ఎన్ సిధారెడ్డి, టీజీవో నేత సత్యనారాయణ వ్యవహరించనున్నారు.

### ఎటుపోతున్నాం..?

పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో భోపాల్ నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి సాధ్వి ప్రజ్ఞాసింగ్‌ఠాకూర్ మాట్లాడుతూ నాథూరాం గాడ్సే గొప్పదేశభక్తుడన్నారు. భారతీయులు ఎవరికైనా కోపం వస్తది. నాకు కూడా కోపం వచ్చింది.. తీవ్రంగా ఖండిస్తూ చాలా తప్పుడుమాట మాట్లాడారని సోషల్‌మీడియాలో స్పందించాను. జాతిపిత మహాత్మాగాంధీని చంపినవారిని దేశభక్తుడని అనడం.. భవిష్యత్‌తరాలకు ఏం సందేశం ఇస్తున్నామంటూ బాధతో ట్వీట్‌చేశాను. ఆమె వ్యాఖ్యలను ఖండించిన ట్వీట్ కింద వచ్చిన సమాధానాలు చూసి నాకు ఇంకా బాధనిపించింది. చాలామంది ఆమెను సమర్థిస్తూ మాట్లాడితే.. ఎటుపోతున్నది దేశం.. ఎక్కడున్నాం.. జాతిపిత మహాత్మాగాంధీనే గౌరవించుకోలేని జాతి ఎటుపోతున్నది అంటే ఏంచెప్పాలి..? మతం వ్యక్తిగతమైనది. లౌకికరాజ్య వ్యవస్థతో దీనికి సంబంధంలేదు. మతం, రాజకీయం, జాతీయవాదం పరస్పరం విడదీయలేనంతగా పెనవేసుకుపోయాయి. మతాన్ని, రాజకీయాన్ని కలిపిచేస్తున్న ఒక ప్రయత్నాన్ని.. దానివల్ల భవిష్యత్‌లో రాబోయే ప్రమాదాలపై ప్రజలను జాగరూకులను చేయాలి. ప్రతికూలశక్తులకు, అనుకూలశక్తులకు జరిగే సంఘర్షణ, పర్యవసానమే చరిత్ర అని కేసీఆర్ చెప్తుంటారు. భవిష్యత్‌లో మతం అనేది ఒకరినొకరు గౌరవించుకునేస్థాయి నుంచి ఒక ఉన్మాదస్థాయికి ప్రబలితే, మతోన్మాదమే కేంద్రంగా మారితే.. మన పిల్లలకు, వారిపిల్లలకు.. మనం ఎంతగొప్పగా పూజించుకున్నామో..గౌరవించుకున్నామో ఆ పరిస్థితి రేపటిరోజు ఉండకపోవచ్చనే బాధతో మాత్రమేచెప్తున్నా.


### ముహూర్తం

సూర్యోదయం: 6.02 గంటలకు

సూర్యాస్తమయం: 6.41 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం ఏకాదశి ఉదయం 10.55 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: మూల, అమృతఘడియలు: సాయంత్రం 5.56 నుంచి రాత్రి 7.32 వరకు, రాహుకాలం: సాయంత్రం 5.06 నుంచి 6.41 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 5.00 నుంచి 5.50 వరకు, వర్జ్యం: ఉదయం 7.40 నుంచి 9.18 వరకు.

### లోకం పోకడ




వరద సహాయ చర్యల్లో భాగంగా దిగిన ఆ సెల్ఫీ ఫొటోల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా చేపడుతామని తెలియజేస్తున్నా!



శనివారం జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు నీటి అందాలను వీక్షించేందుకు తరలివచ్చిన పర్యాటకులు



శనివారం విద్యుత్‌వెలుగుల మధ్య తుంగభద్ర ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

# కొనసాగుతున్న గోదావరి ఉధృతి

- పేరూరు నుంచి దిగువకు 11.65 లక్షల క్యూసెక్కులు
- మేడిగడ్డ బరాజ్ వద్ద నిలకడగా గోదావరి
- అన్నారం బరాజ్‌లో పది గేట్లు ఎత్తివేత


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ కాళేశ్వరం/మహదేవపూర్/ ధర్మారం:** గోదావరి నదిలో గత వారంరోజులుగా కొనసాగుతున్న వరద ఉధృతి శనివారం కూడా తగ్గలేదు. ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు దగ్గర ఏకంగా 11.65 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దిగువకు పోతున్నది. శుక్రవారంతో పోలిస్తే భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం 8 గంటలకు 43.6 అడుగుల స్థాయిలో గోదావరి ప్రవహిస్తుండగా.. సాయంత్రం ఐదు గంటలకు 39.6 అడుగులకు చేరుకొన్నది. ఆంధ్రప్రదేశ్‌లోని ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో 14.05 లక్షల క్యూసెక్కులకుపైగా నమోదవుతుండగా అధికారులు బరాజ్ నుంచి 13.97 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. ఈ నీటిసంవత్సరంలో ఇప్పటివరకు 963 టీఎంసీల గోదావరిజలాలు సముద్రంలో కలిశాయి. కడెం జలాశయానికి శనివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 5వేల క్యూసెక్కులకుపైగా వరద వస్తుండగా అధికారులు 5,354 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎల్లంపల్లి జలాశయానికి శనివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 5500 క్యూసెక్కులకుపైగా నమోదవుతుండగా దాదాపు అంతేస్థాయిలో అధికారులు దిగువకు వదులుతున్నారు. మరోవైపు దిగువ మానేరు జలాశయం నుంచి 204 క్యూసెక్కుల జలాలను విడుదలచేస్తున్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టులో నిలకడగా వరదప్రవాహం

మహారాష్ట్రలో ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో మండలంలోని కాళేశ్వరం, మేడిగడ్డ బరాజ్‌లోకి గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతున్నది. కాళేశ్వరంలో శనివారం ఉదయం 2.30లక్షల క్యూసెక్కులుగా ఉన్న ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతూ సాయంత్రం వరకు పుష్కర్‌ఘాట్ వద్ద 2.90లక్షల క్యూసెక్కులుగా ప్రవహిస్తున్నది. అంతర్రాష్ట్ర వంతెన వద్ద నీటిప్రవాహం పరవళ్లు తొక్కుతున్నది. అన్నారం బరాజ్ లో 10 గేట్లు తెరచి నీటిని కిందికి వదులుతున్నారు. సరస్వతి బరాజ్‌లో 7.58 టీఎంసీల నీటినిల్వతోపాటు 45 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నదని అధికారులు వెల్లడించారు.

### మేడిగడ్డ బరాజ్ 65 గేట్ల ఎత్తివేత

మేడిగడ్డ బరాజ్‌లో నీటిప్రవాహం నిలకడగా కొనసాగుతున్నది. గత రెండురోజులుగా ఒకే రీతిగా నీటిప్రవాహం కొనసాగుతుండటంతో శనివారం 65 గేట్లను ఎత్తి దాదాపు 2.15 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు తరలించారు. బరాజ్‌లో 93.50 మీటర్ల ఎత్తులో 2.839 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని అధికారులు తెలిపారు.



పెద్దపల్లి జిల్లా కాళేశ్వరం ఏడో ప్యాకేజీలోని నంది మేడారం పంప్‌హౌస్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

### లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌కు నంది రిజర్వాయర్ నీళ్లు

ఎనిమిదో ప్యాకేజీలోని రామడుగు మండలం లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌లో బాహుబలి మోటర్ల వెట్‌రన్ కోసం నంది మేడారం రిజర్వాయర్ నుంచి నీటి విడుదల కొనసాగుతున్నది. ఈ నెల 5, 9వ తేదీల్లో విడతలవారీగా జలాలను పంపిన అధికారులు, తాజాగా శనివారం కూడా నీటిని విడుదలచేశారు. ముందుగా అక్కడి భూగర్భ పంప్‌హౌస్‌లోని సర్జ్‌పూల్‌ను క్రమంగా నింపుతూ, లెవల్స్‌వారీగా పరీక్షలు చేస్తున్నారు. శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల దాకా 1,020 క్యూసెక్కుల చొప్పున నీటిని నంది మేడారం రిజర్వాయర్ నాలుగు గేట్లను ఎత్తి ఏడవ ప్యాకేజీ జంట సొరంగాల ద్వారా వదలగా, నీరు దిగ్విజయంగా లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌కు చేరింది. పంప్‌హౌస్‌కు నీటిని విడుదలచేస్తున్న క్రమంలో నందిమేడారం రిజర్వాయర్‌లో నీటిమట్టం పడిపోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆరో ప్యాకేజీలోని నంది పంప్‌హౌస్‌లోని 2, 3 మోటర్లను అధికారులు ఆన్ చేసి, రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వర కు 3వ మోటర్‌ను నడిపించారు. అలాగే శనివారం సాయంత్రం మళ్లీ 2, 3 మోటర్లను ఆన్ చేసి 1,020 క్యూసెక్కుల నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు.



నందిమేడారం పంప్‌హౌస్‌లోని 2, 3 మోటర్లు ఆన్‌కావడంతో డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికి దుంకుతున్న జలాలు

# 28 ఏండ్లలో ఐదోసారి

- ఆగస్టులో ఆనందం
- శ్రీశైలం జలాశయానికి రికార్డుస్థాయి వరద
- ఒక నెలలో 500 టీఎంసీలు వచ్చింది నాలుగోసారి
- కేవలం పదిరోజుల్లోనే దాదాపు 220 టీఎంసీలు
- 2006-07లో గరిష్ఠంగా 1064.26 టీఎంసీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



శనివారం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న నీరు

కొన్ని దశాబ్దాలుగా తరచూ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కృష్ణాబేసిన్‌లో ఈ ఏడాది జల సంబురం నెలకొన్నది. ఈ నీటి సంవత్సరంలో మొదటి రెండు నెలలపాటు తీవ్ర నిరాశకు గురిచేసిన కృష్ణమ్మ.. ఇప్పుడు అనూహ్యంగా అంచనాలకు మించి జలకళను తీసుకొచ్చింది. కృష్ణాబేసిన్ చరిత్రను పరిశీలిస్తే.. ప్రధానంగా ఆగస్టు మాసం ప్రాజెక్టులకు కీలకంగా మారుతున్నది. గత 28 ఏండ్ల రికార్డులను పరిశీలిస్తే.. ఆగస్టు నెలలో 500 టీఎంసీలకు పైగా వరద వచ్చిన సందర్భాలు కేవలం నాలుగు పర్యాయాలే. ప్రస్తుతం నడుస్తున్న ఆగస్టు మాసం కూడా ఈ రికార్డుల సరసన చేరనున్నది. ఈ నెల ఒకటోతేదీ నుంచి శ్రీశైలం వైపు పరుగులు తీసిన కృష్ణాజలాలు.. పదిరోజుల్లోనే శ్రీశైలం జలాశయాన్ని దాదాపు నింపాయి. దీంతోపాటు నాగార్జునసాగర్ ఆయకట్టులోనూ ఆశలు చిగురింపజేశాయి. కృష్ణా బేసిన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నీటి అవసరాలు 1300 టీఎంసీలు. ఇందులో తెలంగాణకు 550 టీఎంసీలు.. ఏపీ అవసరాలు 750 టీఎంసీల వరకు ఉన్నాయి. కానీ బేసిన్‌లో దిగువన తెలుగు రాష్ట్రాల పరిధిలోకి ఆ స్థాయి ఇన్‌ఫ్లో రాక చాలా సంవత్సరాలైంది. 1992-93 సంవత్సరం నుంచి రికార్డులను చూస్తే.. ఐదేండ్లు మాత్రమే ఎక్కువ వరద వచ్చిన సందర్భాలున్నాయి. రెండుమూడేండ్లపాటు 1000-1250 టీఎంసీల వరకు వచ్చాయి. 2011 నుంచి పరిస్థితి ఘోరంగా తయారైంది. 2013-14లో 800 టీఎంసీలకు పైగా జలాలు వచ్చాయే తప్ప మిగిలిన ఏడాదుల్లో అవసరాల్లో సగం కూడా వరదరాని పరిస్థితి. ముఖ్యంగా ఆగస్టు- అక్టోబర్ మధ్యకాలంలోనే 80 శాతానికిపైగా ఇన్‌ఫ్లోలు వచ్చాయి. అన్ని సందర్భాల్లోనూ ఆగస్టులో వచ్చిన వరదే ఆ ఏడాదికి కీలకంగా మారుతున్నది. 2006-07 ఆగస్టు నెలలో 1064.26 టీఎంసీల వరద రాగా.. ఆ ఏడాది మొత్తం వచ్చిన వరదలో అది దాదాపు 61 శాతంగా ఉండటం విశేషం. 2005-06 లోనూ 977.36 టీఎంసీల వరద వస్తే.. మొత్తం వరదలో అది 54 శాతం ఉన్నది. అంతకుముందు 1997-98లో 719 టీఎంసీలు, 2007-08లో 505 టీఎంసీలు రాగా.. మిగిలిన సంవత్సరాల్లో 300 టీఎంసీలు, ఆలోపు వరద వచ్చింది. తాజా నీటి సంవత్సరంలో మొదటి రెండు నెలలు శ్రీశైలం జలాశయం పరిస్థితి దయనీయంగా మారింది. ఎండీడీఎల్ దిగువన నీటిమట్టం ఉండటంతోపాటు 60 రోజులపాటు వరద వచ్చే పరిస్థితులు లేక ఆందోళన తలెత్తింది. జూన్‌లో చుక్క వరద శ్రీశైలానికి రాలేదు. జూలై ముగిసే సమయానికి 2.3 టీఎంసీల మేర ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. ఆగస్టు ఒకటి నుంచి మొదలైన కృష్ణా జలాల పరవళ్లు అంతకంతకూ పెరుగుతూ శనివారం సాయంత్రానికి ఏకంగా 4.50 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో చేరడం విశేషం. కేవలం పది రోజుల వ్యవధిలోనే జలాశయానికి దాదాపు 220 టీఎంసీల వరకు జలాలు వచ్చి చేరడం ఒక రికార్డు. ఈ క్రమంలో వరదస్థాయిని చూస్తే మిగిలిన 20 రోజుల వ్యవధిలో కనీసంగా 400-500 టీఎంసీల వరకు వరద వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని అధికారులు చెప్తున్నారు.

### వివిధ ప్రాజెక్టులలో శనివారం నీటి మట్టాల వివరాలు...

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1697.51 | 129.72 | 90.86 | 6,03,889 | 5,30,000 |
| నారాయణపుర | 1615.00 | 1606.36 | 37.64 | 26.61 | 6,30,000 | 6,25,200 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 47,109 | 95,935 |
| జూరాల | 1045.00 | 1038.29 | 9.66 | 5.90 | 6,03,521 | 5,63,151 |
| తుంగభద్ర | 1633.00 | 1628.28 | 100.86 | 83.72 | 2,12,625 | 80,000 |
| శ్రీశైలం | 885.00 | 883.10 | 215.81 | 202.04 | 4,86,858 | 5,66,977 |
| నాగార్జునసాగర్ | 590.00 | 527.60 | 312.05 | 163.50 | 5,34,079 | 36,654 |
| సింగూరు | 1717.93 | 1670.52 | 29.91 | 0.47 | 20 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.34 | 17.80 | 0.14 | - | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1061.50 | 90.31 | 15.29 | 14,790 | 372 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.90 | 24.07 | 3.53 | - | 204 |
| మిడ్‌మానేరు | 1043.31 | 993.54 | 25.873 | 3.53 | 235 | 83 |
| కడెం | 700.00 | 695.55 | 7.60 | 6.50 | 5,298 | 5,354 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.81 | 20.18 | 19.54 | 5,568 | 5,568 |

### నేడు సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా రైతులకు సాగునీరు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఆదివారం ఉదయం సాగర్‌లో తెలంగాణ విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, ఏపీ జల వనరులశాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ సంయుక్తంగా కుడి, ఎడమ కాల్వల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం ఎస్సెల్బీసీ-ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా మంత్రి జగదీశ్‌రెడ్డి నీటిని విడుదలచేస్తారు.

ఉచిత శిక్షణ SC,ST,BC,EBC (OC)
గ్రూప్-1,2,3, SI, PC
TET-1,2+SGT
NEW BATCH 16th 18th
Intensive Coaching
VIJETHA STUDY CIRCLE
DSNR Opp.BusDepot: 99084 70999, 99084 80999
KPHB Above bank of India: 9848590605

# సాగర్‌కు పులకింత



శనివారం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న యువతులు

మొదటిపేజీ తరువాయి...

ఉండగా.. పది గేట్లను ఎత్తి కేవలం స్పిల్‌వే ద్వారానే 5.65 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతోపాటు కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 42 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి-800 క్యూసెక్కులు, మల్యాల్-హంద్రీనీవా కాల్వ-2,363 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు-28 వేల క్యూసెక్కులు.. మొత్తంగా 4.75 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నారు. నురగలు కక్కుతూ ఎగిసిపడుతున్న కృష్ణమ్మనుచూసేందుకు సందర్శకులు శ్రీశైలానికి తరలివస్తున్నారు. కాగా నాగార్జునసాగర్‌కు గంట గంటకూ పెరుగుతున్న ఇన్‌ఫ్లోతో జలాశయంలో జలాలు తొణికిసలాడుతున్నాయి. శనివారం రాత్రి పది గంటలకు నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 5.34 లక్షల క్యూసెక్కులకు పైగా ఉన్నది. సాగర్‌లో విద్యుత్ ఉత్పత్తి మొదలైనట్లుగా సమాచారం తెలుస్తున్నది. ప్రస్తుత వరద పరిమాణాన్ని చూస్తుంటే... నాలుగైదు రోజుల్లోనే నాగార్జునసాగర్ కూడా నిండుకుండలా మారనున్నది. ఈ నేపథ్యంలో ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో ఆదివారం ఉదయం కుడి, ఎడమకాల్వల ద్వారా సాగునీటి విడుదలకు తెలుగు రాష్ట్రాలకు శ్రీకారం చుడుతున్నాయి. అంచెలంచెలుగా డిశ్చార్జిని పెంచి.. సాధ్యమైనంత మేర ఎక్కువ నీటిని కాల్వల ద్వారా విడుదలచేసేందుకు అధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. సాగర్ ఎడమ కాల్వ కింద ఈసారి పూర్తి ఆయకట్టుకు సాగునీటిని విడుదలచేస్తామని నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ నరసింహ తెలిపారు. బీచుపల్లి పుష్కరఘాట్ దగ్గర ఏడంచెల మెట్లను ముంచెత్తి రామాలయం కాంపౌండ్ ఆనుకొని కృష్ణమ్మ ప్రవహిస్తున్నది. రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ భక్తులు, సందర్శకులను నదిలోకి అనుమతించకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం శనివారం సాయంత్రానికి 628.30 (1.18టీఎంసీలు) అడుగులకు చేరింది.

### పోటెత్తిన టూరిస్టులు

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారన్న సమాచారంతో పర్యాటకులు పెద్ద ఎత్తున శ్రీశైలం ప్రాజెక్టుకు క్యూ కట్టారు. దోమలపెంటకు పది కిలోమీటర్ల దూరం నుంచి వాహనాలు బారులు తీరాయి. అక్కడినుంచి ఈగలపెంట, పాతాళగంగ, లింగాలగట్టు, డ్యాంసైట్ వద్ద ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. నాగర్‌కర్నూలు జిల్లా మన్ననూరు వద్ద రాత్రి 9 గంటలకు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను నిలిపేశారు. అంతకుముందే వచ్చిన వాహనాలతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. ప్రస్తుతం మన్ననూరు వద్ద వందలాది వాహనాలు శ్రీశైలం వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆదివారం వచ్చే వాహనాల రాకతో ట్రాఫిక్ సమస్య పెరిగే అవకాశమున్నది. డ్యాం సందర్శనకు వచ్చిన భక్తులు అనంతరం శ్రీశైలం దేవాలయం వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. శనివారం సుమారు 80 వేల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు గేట్ల నుంచి సవ్వడి చేసుకుంటూ దిగువకు వెళ్తున్న వరద సుందర దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు ఆసక్తిని చూపించారు. వాహనాలు దిగి తుంపరలో తడుస్తూ.. సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

### నీట మునిగిన వాసునగర్

**నారాయణపేట ప్రతినిధి/నమస్తే తెలంగాణ:** కృష్ణానదితోపాటు భీమా నదికి వరద వస్తుండటంతో నారాయణపేట జిల్లా కృష్ణ మండలం తంగిడి గ్రామ సమీపంలోని సంగమ ప్రదేశంలో పరవళ్లు తొక్కుతుండటంతో కృష్ణ మండలం వాసునగర్ నీటమునిగింది. శుక్రవారమే నదీ ప్రవాహ పరిస్థితిని పరిశీలించిన అధికారులు ప్రజలను అప్రమత్తంచేశారు. ఈ మేరకు వాసునగర్ గ్రామస్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. శనివారం మధ్యాహ్నం గ్రామానికి ఇరువైపులా జలాలతో వాసునగర్ జలమయమైంది. హిందుపూర్ గ్రామ సమీపానికి సైతం కృష్ణా జలాలు చేరుకోవడంతో అధికారులు గ్రామస్థులను అప్రమత్తం చేశారు. వరద తీవ్రత పెరుగుతుండటంతో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకట్రావు, ఆర్డీవో శ్రీనివాసులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. భీమా, కృష్ణా నదుల సంగమ ప్రదేశంలో దత్తాత్రేయ ఆశ్రమం నదీ ప్రవాహంలో పూర్తిగా మునిగిపోతుండటంతో అందులో ఉన్న భక్తులను శనివారం సాయంత్రం పోలీసులు పుట్టీల సాయంతో బయటకు తీసుకొచ్చారు.



నారాయణపేట జిల్లా కృష్ణమండలం హిందుపూర్‌లో పశువైద్యశాలను ఆనుకొని ప్రవహిస్తున్న భీమా వరద



కృష్ణభీమా సంగమ ప్రదేశంలో నీటమునుగుతున్న దత్తపీట ఆశ్రమంలోని భక్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES
BASAR, NIRMAL DISTRICT, TELANGANA-504107
PHONE: 9492301704
TENDER NOTICE
Online tenders are hereby invited from interested and eligible bidders for providing of Catering Services to 7000 students approx. (3 separate tenders) at RGUKT-Basar.
Interested bidders can download and submit the bids online from 13.08.2019 to 28.08.2019 up to 05:00PM through www.tender.telangana.gov.in. For further details please visit our website: www.rgukt.ac.in
Sd/-
DATE:11.08.2019 VICE CHANCELLOR

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ (సిపెట్)
సిపెట్ : సెంటర్ ఫర్ స్కిల్లింగ్ & టెక్నికల్ సపోర్ట్ (సి యస్ టి యస్)
హైదరాబాద్ - 500 051
నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ మరియు ఉపాధి కార్యక్రమములు
CIPET లో ప్లాస్టిక్స్ వస్తువులు తయారీ చేయుటకు సంబంధించిన మెషిన్ ఆపరేటర్ అసిస్టెంట్ / మెషిన్ ఆపరేటర్ / మెషిన్ ఆపరేటర్ (టూల్ రూమ్) కోర్సులలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించుచున్నది. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశములు కల్పించబడును.
కోర్సు వ్యవధి : 3 నెలలు / 6 నెలలు అర్హత : 8/10వ తరగతి ఉత్తీర్ణత
వయసు: 18 నుంచి 30 సం. లు (యస్సీ /యస్టీ / బీసీ అభ్యర్థులకు వయసు సడలింపు కలదు)
శిక్షణ, వసతి మరియు భోజనం: పూర్తిగా ఉచితము
పూర్తి వివరములకు సంప్రదించగలరు:
7893586494 | 9959333418 | 79810 02683

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీస్ (దివ్యాంగజన్)
గతంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది మెంటల్లీ హ్యాండీకాప్డ్
(వికలాంగులు (దివ్యాంగజన్) సాధికారత శాఖ) (సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం) (ISO 9001: 2015 ఇన్‌స్టిట్యూషన్)
మనోవికాస్ నగర్, సికింద్రాబాద్ -500009, తెలంగాణ.
టెలిఫోన్ నం. 27751741 -745, ఫ్యాక్స్ నం. 040-27750198. వెబ్‌సైట్: niepid.nic.in
ప్రవేశం కొరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూలు
NIEPID, సికింద్రాబాద్ ఆవరణలో 13-08-2019, ఉ.10.00 గం. నుండి నిర్వహించే వాక్-ఇన్-ఇంటర్వ్యూల ద్వారా దిగువ కోర్సులలోని ఖాళీ సీట్లను భర్తీ చేయుటకు దరఖాస్తులు కోరబడుచున్నవి.
1) M.Ed. స్పెషల్ ఎడ్యుకేషన్ (MR/ID)
2) P.G. డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్
దరఖాస్తుదారులు దరఖాస్తులను NIEPID వెబ్‌సైట్ : www.niepid.nic.in నుండి డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసి ఇంటర్వ్యూల సమయంలో వెరిఫికేషన్ కొరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు హాజరు కావాలి.
డిప్యూటీ డైరెక్టర్ (ADMIN)

# ప్రజాస్వామ్య పతనానికి కుట్రలు

అంకుశం



పరాంకుశం వేణుగోపాలస్వామి

> సంస్కరణోద్యమానికి ఐదు వందల ఏండ్లు నిండిన సందర్భంగా 2017 అక్టోబర్‌లో ఇరు మత శాఖలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. జరిగిన విషాదానికి వారిలో ఎంతో పశ్చాత్తాపం కనిపించింది. గతం ఎట్లాగూ మారదు కనుక, ఆ అనుభవాలను తమ మధ్య ఉన్న వైరుధ్యాలను అధిగమించే ఆకాంక్షలుగా మార్చుకుందామని వారు తమ ఉమ్మడి ప్రకటనలో అభిలషించారు. ఇప్పటికీ తమలో విభేదాలున్నాయనీ, కానీ వాటికన్నా ఏకత్వం మరింత ఉందని గ్రహించారు. ఎంత గొప్ప పరివర్తన!

హిట్లర్ ఆధ్వర్యంలో గోబెల్స్ ప్రచారం గురించి చదువుకోవడమే కానీ, అదెట్లా సాగుతుందో మన అనుభవంలో లేదు. కానీ ఇటీవల వాట్సాప్ ద్వారా ప్రజాస్వామ్య భావజాలంపై ఒక పద్ధతి ప్రకారం విషం చిమ్మడం చూస్తుంటే, మన దేశానికి పెద్ద ప్రమాదం ముంచుకొస్తున్నదనిపిస్తున్నది. ఈ ప్రచారం ఎంత దురుసుగా సాగుతున్నదీ అంటే, ప్రజాస్వామ్య భావజాలం ఏయే రూపాల్లో ఉందో పసిగట్టి, ధ్వంసం చేయడం కోసమే అబద్ధాలు అల్లి పెడుతున్నారు. అవి చదివేవారికి ప్రజా ప్రతినిధులపై నమ్మకం పోతుంది. లౌకికవాద, బహుళత్వ భావన నశించిపోతుంది. మన దేశం ప్రజాస్వామ్య బాటను ఎంచుకోవడానికి, సుస్థిరపడటానికి కీలక పాత్ర పోషించిన నెహ్రూ వంటి నాయకుల ఔన్నత్యాన్ని కట్టుకథలతో దెబ్బకొట్టాలనే కుట్రలు సాగుతున్నయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య యోధులను విలన్లుగా, ఆనాడు విభజించి పాలించే బ్రిటిష్ అజెండాలో పాత్రధారులైన వారిని దేశభక్తులుగా చిత్రీకరించే కుట్ర ఇది.

స్వాతంత్ర్యోద్యమంలో అగ్రశ్రేణి పాత్ర పోషించిన వారిలో ఎంతోమంది రాజనీతి కోవిదులు ఉన్నారు. సామ్రాజ్యవాదంపై పోరాటం చేసిన వీరు ఆనాటి కమ్యూనిస్టు వ్యవస్థలను కూడా కండ్లచూశారు. అన్నిటిపై అవగాహనతో మన దేశానికి ప్రజాస్వామ్య విధానమే మంచిదని నిర్ణయించారు. విదేశీ పెట్టుబడులపై ఆధారపడకుండా మన దేశం స్వావలంబన సాధించేందుకు కృషిచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పాదుకునేందుకు గట్టి పునాదులు వేశారు. సామ్రాజ్యవాదులకు పక్కలో బల్లెం మాదిరిగా కమ్యూనిస్టులు చెలరేగిపోతున్న కాలమది. సోవియెట్ యూనియన్, చైనా తదితర దేశాలు సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు మద్దతు ఇచ్చేవి. ఈ కాలమంతా సామ్రాజ్యవాదశక్తులు నంగినంగి ఉన్నయి. సోవియెట్ యూనియన్ కూలిపోయి, చైనా పెట్టుబడిశక్తులకు సాష్టాంగపడటంతో- ఈ సామ్రాజ్యవాద శక్తులకు మళ్ళా ఆసియా, ఆఫ్రికా దేశాల్లోని వనరులపై కన్నుపడ్డది. భారత్ వంటి దేశాలలో ప్రజాస్వామ్యాన్ని కూలదోయాలంటే మొదట ఇక్కడి ప్రజలకు ప్రజాస్వామిక వ్యవస్థ మీద ద్వేష భావం కలిగించాలనే వ్యూహం అమలవుతున్నది. సామ్రాజ్యవాదులకు నెహ్రూ మీదా, నెహ్రూ భావజాలం మీద ఎంత కసి ఉన్నదో ఈ వాట్సాప్ సందేశాలను గమనిస్తే తెలుస్తుంది.

నెహ్రూ కుటుంబీకులు మొఘల్ దర్బారులోని ఒక ప్రముఖుడి వారసులని, వారు రహస్యంగా హిందు పేర్లు పెట్టుకొని మన దేశాన్ని నాశనం చేస్తున్నారనేది ఒక వాట్సాప్ కథనం! వాళ్ళ పేర్లన్నీ ఖాన్ అని ఉంటాయట! సర్దార్ వల్లభాయి పటేల్ ప్రధాని కావలసి ఉండగా గాంధీ అడ్డుకొని నెహ్రూను చేశారనేది మరో కథనం. ఇందుకు పీసీసీ అధ్యక్షులంతా పటేల్ వైపు మొగ్గారనే కథనాన్ని ప్రచారంలో పెడుతున్నారు. వాస్తవానికి పీసీసీ అధ్యక్షులు ప్రధానిని ఎన్నుకోరు. నెహ్రూ ప్రధాని అయినప్పుడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె.బి.కృపలానీ. 1929లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడైన నాటినుంచి నెహ్రూ దేశవ్యాప్తంగా గాంధీ తరువాత మళ్ళా అంతటిస్థాయిలో పేరుపొంది ఉన్నారు. ప్రధానిగా దేశానికి దిశానిర్దేశం చేసే స్థాయి నెహ్రూకే ఉన్నట్టు చరిత్ర నిరూపించింది. ఇప్పుడు కొందరు ప్రచారం చేస్తున్నట్టు- పటేల్ ఏనాడూ కొన్ని మత సంస్థలకు అనుకూలంగా లేడు. రెండు ప్రపంచయుద్ధాల తరువాత కాలంలో ప్రపంచవ్యాప్తంగా యుద్ధాల పట్ల, ఆక్రమణల పట్ల ఆనాడు అంతర్జాతీయ ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా ఉన్నది. ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో వందలాది రాజ్యాలను మన దేశంలో విలీనం చేసుకోవడం అసాధారణం. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ముస్లిం జనాభా అధికంగా గల కశ్మీర్‌ను మనవైపు ఆకర్షించడం కూడా నెహ్రూ, ఆయన నిర్మించుకున్న బృందం ఘనత. కానీ నాటి చరిత్రను వక్రీకరించి నెహ్రూపై బురద జల్లే ప్రయత్నం సాగుతున్నది.

అమెరికా అణ్వస్త్ర సహాయం చేస్తామంటే నెహ్రూ తన శాంతి విధానం మూలంగా వద్దన్నాడనేది మరో వాట్సాప్ ప్రచారం. నిజానికి భారత అణ్వస్త్ర పరిశోధన 1944 లోనే జరిగింది. ఇంకా ముందే హోమీభాభా తన పరిశోధనలకు ముందు నెహ్రూతో చర్చలు జరిపారు. ఆ తరువాతే 1945లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చి స్థాపన జరిగింది. స్వాతంత్ర్యం రావడానికి ముందే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ స్థాపన జరిగింది. ఆనాడు విదేశాలలో చదువు ముగియక ముందే పరిశోధకులతో నెహ్రూ స్వయంగా మాట్లాడుతూ దేశానికి పిలిపించుకునేవారు. వారితో వ్యక్తిగత పరిచయం పెట్టుకొని ప్రోత్సహించారు. అణు విజ్ఞానం మొదలుకొని అంతరిక్షం వరకు అన్నిరంగాలలో భారత్ వెలిగిపోవడానికి కారణం నెహ్రూ వేసిన బాటలే. ఐఐటీలు పెట్టింది కూడా నెహ్రూ కాలంలోనే. శాస్త్ర విజ్ఞానంలో, రక్షణరంగంలో భారత్‌ను కట్టడి చేసేందుకు ప్రయత్నించింది అమెరికా కాగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించింది సోవియెట్ యూనియన్.

భారత్‌ను అస్థిరత్వం పాలు చేయడానికి పాశ్చాత్య దేశాలు పన్నిన కుట్రలు అనేకం. మన పొరుగునే ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో పాటు అనేక ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో ప్రభుత్వాలను కూలగొట్టి సైనిక పాలన నెలకొల్పి, అక్కడి వనరులను కొల్లగొట్టిన ఘనత పాశ్చాత్య దేశాలది. సౌదీ అరేబియా వంటి అరబ్బు దేశాలలో తన సైన్యాన్ని పెట్టి ప్రజాస్వామ్యం నెలకొనకుండా రాచరికాలను కాపాడుతున్నది అమెరికా కూటమి. జాతులు, మతాల పేర ప్రజలను విడదీసి రక్తపుటేరులను పారిస్తూ, తమ పెత్తనాన్ని కాపాడుకోవడం సామ్రాజ్యవాదుల నైజం. ఇన్ని అంతర్జాతీయ కుట్రల మధ్య దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుతూ, స్వావలంబన సాధించి, మత సామరస్యాన్ని కాపాడుకుంటూ, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడిన ఘనత నెహ్రూకు, ఇతర నాయకులకు దక్కుతుంది.

ప్రజా ప్రతినిధులను కించపరిచే భావజాలం కూడా ఈ మధ్య ప్రచారమవుతున్నది. ప్రజా ప్రతినిధికి ఇచ్చే జీతభత్యాలు తగ్గించాలని, పింఛన్లు ఇవ్వవద్దనేది వాట్సాప్‌లో ప్రచారం. బ్యూరోక్రాట్ల కన్నా, మేధావివర్గం కన్నా ప్రజాప్రతినిధే తన సహజాతం కొద్దీ ప్రజల గురించి ఎక్కువ పట్టించుకుంటాడనేది స్పష్టం. ఎంత దిగజారిపోయి ఉన్నా, ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదు. మనకు దేశభక్తి ఉంటే ఈ ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థను మరింత మెరుగుపరుచుకోవాలె. కానీ ప్రజాప్రతినిధ్య వ్యవస్థనే బలహీనపరుచడం సరికాదు. ఒక నిజాయితీపరుడైన ప్రజాప్రతినిధికి అయ్యే ఖర్చు లెక్కగట్టడం కష్టం. వారికి ఉండే ఈ మాత్రం వేతనాలు లేకుండా చేస్తే, ఇక రాజకీయాలలోకి ఎవరు వస్తారు?

మత విద్వేషాలను రెచ్చగొట్టే వాట్సాప్ కథనాలు కూడా ప్రచారమవుతున్నయి. ఈ నేపథ్యంలో యూరప్ అనుభవాల మనం పాఠాలు నేర్చుకోవాలె. యూరప్ సమాజం 1524 నుంచి పదిహేడవ శతాబ్దం ప్రథమార్ధం వరకు దాదాపు 125 ఏండ్లు మత యుద్ధాలతో రగిలిపోయింది. ఎంతో రక్తపాతం సాగింది. ఆ తరువాత కాలంలో హింసా ద్వేషాలు సమాజానికి మేలు చేయవని వారికి అర్థమైంది. ఎన్నో నిరంకుశాలను, జాత్యహంకారాలను యూరప్ ప్రజలు అనుభవించారు. వాటి నుంచి బయటపడే క్రమంలోనే ప్రజాస్వామ్యం వికసించింది. మత విద్వేషాల స్థానంలో సామరస్యం చోటుచేసుకున్నది. జాతులు, మతాలు, భావజాలాలు వేరైనా పరస్పరం గౌరవించుకోవాలనే భావన బలపడ్డది. మతాన్ని రాజకీయాల నుంచి విడదీసి లౌకికపాలన నెలకొల్పుకున్నారు. 'నీవు చెప్పే విషయంతో నేను ఏకీభవించక పోవచ్చు, కానీ చెప్పడానికి నీకుండే హక్కు కోసం ప్రాణమిచ్చి పోరాడుతా' అనే వాల్టేర్ మాటలు ప్రజాస్వామ్య భావనకు పునాది. మార్టిన్ లూథర్ ప్రతిపాదనల మూలంగా యూరప్‌లో ప్రొటెస్టెంట్ ఉద్యమం మొదలై కాథలిక్ చర్చితో విభేదించిన తరువాత ఎన్నో యుద్ధాలు సాగిన విషయం తెలిసిందే. ఈ సంస్కరణోద్యమానికి ఐదు వందల ఏండ్లు నిండిన సందర్భంగా 2017 అక్టోబర్‌లో ఇరు మత శాఖలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. జరిగిన విషాదానికి వారిలో ఎంతో పశ్చాత్తాపం కనిపించింది. గతం ఎట్లాగూ మారదు కనుక, ఆ అనుభవాలను తమ మధ్య ఉన్న వైరుధ్యాలను అధిగమించే ఆకాంక్షలుగా మార్చుకుందామని వారు తమ ఉమ్మడి ప్రకటనలో అభిలషించారు. ఇప్పటికీ తమలో విభేదాలున్నాయనీ, కానీ వాటికన్నా ఏకత్వం మరింత ఉందని గ్రహించారు. ఎంత గొప్ప పరివర్తన!

ఏ దేశంలోనైనా లౌకికత్వం వెలుగులోనే శాస్త్రాభివృద్ధి జరిగింది. మతం బలపడగానే శాస్త్రవిజ్ఞానం పలుచనై సమాజం బానిసత్వంలోకి పోయింది. భారత్‌లో గణితం, వైద్యం, ఖగోళం వంటి శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందింది. మహమ్మద్ ప్రవక్త తన ఉద్యమాన్ని ప్రారంభించిన తరువాత అరబ్బు సమాజం ఇటు భారత్ నుంచి, అటు యూరప్ నుంచి అనేక పుస్తకాలను తెప్పించుకొని, ఒక ఉద్యమంగా తమభాషలోకి అనువాదం చేసుకొన్నది. ఎనిమిదవ శతాబ్దం మొదలుకొని కొన్ని వందల ఏండ్లు అరబ్బులకు అది స్వర్ణయుగం. ఇప్పుడు అరబ్బు ప్రపంచం ఎట్లున్నదో చూస్తూనే ఉన్నాం. శాస్త్రవిజ్ఞానమే యూరప్ సమాజాన్ని ప్రపంచ నాయకత్వంలో నిలబెట్టింది. ఏ దేశాన్నయినా బానిసత్వంలోకి నెట్టాలంటే విద్వేష రాజకీయాలను పెంచిపోషించడం సరైనమార్గమని పెత్తందారీ దేశాలు, కార్పొరేట్ సంస్థలకు తెలుసు.

స్మార్ట్‌ఫోన్లు తప్ప సమాజం, రాజనీతి గురించి ఏ మాత్రం తెలువని కొత్తతరం పిల్లలకు కట్టుకథలు చెప్పి మన నాయకుల మీద, ప్రజాస్వామిక వ్యవస్థ మీద ఆగ్రహాన్ని నూరిపోస్తున్నారు. మన దేశాన్ని, సామాజిక సామరస్యాన్ని నాశనం చేసి, సామ్రాజ్యవాదుల కాళ్ళ దగ్గర పెట్టే కథనాలను ప్రసారం చేయడం దేశభక్తి కింద చెలామణి కావడం ఇంకా దారుణం. ■

# చరిత్రను నిక్షిప్తం చేయాలె

సినిమా



వారాల ఆనంద్

> దశాబ్దాలుగా సినిమా రంగంలో ఉంటూ తరతరాలుగా ఆ రంగంపైనే ఆధారపడి ఎదిగిన వ్యక్తులూ, సంస్థలూ ముందుకొచ్చి తెలుగు సినిమాల పరిరక్షణ పట్ల నడుం బిగించాలి. వ్యాపారాత్మకంగా ఫిల్మ్ స్టూడియోలు, ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లు ఏర్పాటుచేసినట్టే ఆర్కైవ్స్‌ను ఏర్పాటుచేయగలిగితే తమ వృత్తి కి ఎంతో దోహదం చేసినట్టవుతారు. కనీసం నటులు దర్శకులు, నిర్మాతల వారసులైనా వారి తల్లిదండ్రుల సినిమాలు, సినిమాల పోస్టర్లు, పాటల పుస్తకాలు, తదితరాలు సేకరించి వాటిని ఉత్తమ క్వాలిటీలో పునరుద్ధరించి భద్రపరుచాలి.

సినిమా పుట్టి వందేండ్ల పైచిలుకు కాలమే గడిచింది. కానీ వందేండ్ల కిందటే పుట్టిన సినిమాకు సంబంధించిన చారిత్రక పరిశీలన గానీ, సినిమాల పరిరక్షణ గానీ జరుగలేదంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఆధునిక సాంకేతిక వసతులు అందుబాటులోకి వచ్చినా కూడా భారతీయ సినిమారంగం తొలినాళ్లల్లో అంటే 1900 సంవత్సరానికి కొంచెం అటూఇటూ రూపొందించబడిన 1300 పైచిలుకు మూకీ సినిమాల్లో 29 సినిమాలు మాత్రమే ఇప్పుడు లభిస్తునాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అందుబాటులో ఉన్న ప్రింట్లల్లో కూడా తేడాలున్నట్టు ఇటీవలి పరిశీలనల్లో తెలుస్తున్నది.

ఇప్పుడు లభిస్తున్న దాదాసాహెబ్ ఫాల్కే రూపొందించిన 'రాజా హరిశ్చంద్ర' ప్రింట్ 1913లోనిది కాదని అది 1917లో తీసిన రీమేక్ ఫిల్మ్‌కు సంబంధించిందని చరిత్రకారులు అంటున్నారు. 1925లో బాబూరావు పాయింటర్ తీసినట్టుగా చెబుతున్న 'మాయాబజార్' నిజానికి ఆయనే 1921లో తీసిన 'సురేఖాహరణ్' పేరుమార్చిన సినిమా అని తేలింది. నిజానికి భారతీయ తొలి సినిమా 1901లో హరిశ్చంద్ర భట్వాడేకర్ ఒక రెజ్లింగ్ పోటీని షూట్ చేయడం ద్వారా రూపొందింది. తర్వాత 1912లో ఎన్.జీ.చిత్రే, ఆర్.జీ టోర్నీలు తీసిన 'పుండలీక్' మొట్టమొదటి భారతీయ నరేటివ్ ఫిల్మ్‌గా చరిత్ర చెబుతున్నది, అయితే భారతీయ సినిమా చరిత్రను లిఖించడంలో వ్యవస్థల కంటే వ్యక్తులే అధికంగా కృషిచేశారని చెప్పుకోవచ్చు. డి.వి.ధరప్, ఫెరోజ్ రంగూన్ వాలా, ఎరిక్ భౌమిక్, కృష్ణస్వామి, భాగేశ్వర్ ఝూలు కూడా కృషిచేశారు. అదేక్రమంలో 1980 దశకం నుంచి వీర్‌చంద్ దారంశే అవిరాళంగా కృషిచేస్తున్నారు. ఆయన పరిశోధన ప్రకారం దక్షిణ భారతీయ సినిమా రంగంలో 1915లో నటరాజ మొదలియార్ నిర్మించిన 'గోపాలకృష్ణ' మొదటి సినిమా అని తర్వాతే 1916లో 'కీచకవధం' విడుదలైనదని తేలుతున్నది. అట్లా ఆయన పరిశోధనల్లో అనేక అంశాలు తేలనున్నాయి.

భారతీయ సినిమాల లిస్టుల విషయానికి వస్తే మొట్టమొదట సురేశ్ చాబ్రియా సంపాదకత్వంలో 1994లో వెలువడిన 'లైట్ ఆఫ్ ఆసియా ఇండియన్ సైలెంట్ సినిమా 1912-1934 అన్న పుస్తకం ముఖ్యమైంది. తర్వాత ఆశిష్‌రాజాధ్యక్ష వెలువరించిన 'ఎన్‌సైక్లోపెడియా ఆఫ్ ఇండియన్ సినిమా' మరొక ముఖ్యమైన పుస్తకం. వివరాల సేకరణ లిస్టుల తయారీ విషయం ఇట్లా ఉంటే ఆ ప్రింట్లను సేకరించి భద్రపరుచడం మరెంతో ముఖ్యమైనది. కానీ ఆ క్రమంలో జరుగుతున్న కృషి అంతంత మాత్రమే. వ్యక్తుల కృషి కొనసాగుతున్నప్పటికీ వ్యవస్థాగతంగా ప్రభుత్వాలు ముందుకురావాలి.

సినిమా ప్రభావంతమైన దృశ్యమాధ్యమం. దేశంలో సినిమా, క్రికెట్‌లు రెండూ ప్రజలకు తమ జీవితాల్లో అంతర్భాగమైపోయిన అంశాలు. దశాబ్దాలుగా ఆ రెండూ భారతీయులను అమితంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆధునిక సాంకేతిక అంశాలు వచ్చిన తర్వాత ఆ రెండూ మన నట్టింట్లోకి వచ్చేశాయి. ముఖ్యంగా సినిమా అన్ని వయసుల, అన్నివర్గాల ప్రజలకూ చేరింది. వారి జీవితాల్లో అంతర్భాగమైపోయింది. సంఖ్యాపరంగా చూస్తే ప్రపంచంలోని అన్నిదేశాల్లోకంటే అత్యధిక సినిమాలు నిర్మిస్తున్న దేశంగా మన దేశం నిలుస్తున్నది. అధిక సినిమాలను అధిక సంఖ్యలో చూస్తున్నవారిగా భారతీయులకు పేరున్నది.


సినిమాల చరిత్రను వాటి ప్రభావాన్ని చూసినప్పుడు చారిత్రక దర్పణాలుగా ప్రజల జీవనసరళికి, సంస్కృతికి సినిమాలు అద్దంపడుతాయి. ఆయా కాలాల జీవనపరిస్థితిని అవి ఎంతోకొంత రికార్డు చేస్తాయి. భావి యువతకు దేశ చరిత్రను చూపించాల్సి వచ్చినప్పుడు సినిమాలూ, డాక్యుమెంటరీ చిత్రాలు గొప్ప ఆధారాలవుతాయి. ఫిల్మ్ రీళ్లల్లో ఉపయోగించే సెల్యూలాయిడ్ వందేండ్లే అయినప్పటికీ పెరిగిన సాంకేతికత పరిస్థితుల్లో వాల్టుల్లో ఉంచగలిగి తే సెల్యూలాయిడ్ జీవితకాలాన్ని పెంచవచ్చు. వర్తమానకాలంలో మొత్తం డిజిటల్‌లోనే సినిమాల నిర్మాణం కొనసాగుతున్న స్థితిలో పాత సినిమాలను రిస్టోర్ చేసి భద్రపరిస్తే అపురూపమైన కళాసంపదను భావితరాలకు అందించినట్టవుతుంది.

కేంద్రం 1984లో పునాలో ఫిల్మ్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియాను స్థాపించింది. సినిమా ప్రింట్లను సేకరించడం, భద్రపరుచడం, అవసరమైన అధ్యయనం కోసం పంపిణీ చేయడం ముఖ్య లక్ష్యాలుగా ఏర్పాటుచేసింది. కేంద్ర సమాచార ప్రసారశాఖ అధీనంలో ఏర్పాటైన ఆర్కైవ్స్ సినిమా ప్రింట్లతో పాటు పోస్టర్లు, స్టిల్స్, స్లైడ్స్, స్క్రిప్టులు, లాబీ కార్డులు, సినిమా పాటల పుస్తకాల సేకరణ మొదలుపెట్టింది. ఆర్కైవ్స్ డైరెక్టర్‌గా పి.కె.నాయర్ అద్భుతమైన సేవలందించారు. ప్రపంచస్థాయిలో సెల్యూలాయిడ్ మాన్‌గా గుర్తింపుతెచ్చుకున్నారు. ఇప్పటికీ ఆర్కైవ్స్‌లో లక్షా ముప్పై వేలకు పైగా ఫొటోలు, 17 వేలకు పైగా పోస్టర్లు, దాదాపు 12 వేల పాటల బుక్లెట్స్, 25 వేల సినిమా గ్రంథాలను సేకరించింది. 19 ఫిల్మ్ పరిరక్షక వాల్టుల్లో 2 లక్షల ఫిల్మ్ రీళ్లు భద్రపరిచే వసతులను కలిగి ఉన్నది. ఎన్నో అపురూపమైన పాత సినిమా వివరాలు ఈ ఆర్కైవ్స్‌లో భద్రపరచబడి ఉన్నాయి. నాయర్ పదవీ విరమణతో పాటు ప్రభుత్వ ఉదాసీన పోకడలతో అక్కడ కూడా నిధుల కొరత పట్టిపీడిస్తున్నది.

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన 'నేషనల్ ఫిల్మ్ హెరిటేజ్ మిషన్' కార్యక్రమంలో భాగంగా ప్రాచీన అపురూప సినిమాల సేకరణ, పరిరక్షణ, డిజిటలైజేషన్, పునరుద్ధరణ చర్యలకు కొంత ప్రాధాన్యం ఇస్తున్నారు. పునా,ముంబై, హైదరాబాద్, గౌహతీ, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురంలలో ఆర్కైవ్స్ సమావేశాలు ఏర్పాటుచేసి సినిమా ప్రతినిధులతో చర్చించారు. ఇలా పలు చర్యలు జాతీయస్థాయిలో కొంత మేర కొనసాగుతున్నయి. అయితే ప్రాంతీయ స్థాయిలోనూ ప్రతి భాషలో ప్రత్యేక ఫిల్మ్ ఆర్కైవ్స్ ఏర్పాటుచేసి సినిమాల సేకరణ, పరిరక్షణ, డిజిటలైజేషన్, పునరుద్ధరణ చర్యలకు పూనుకోవాలె. ఇది ప్రభుత్వం తరఫున, సినీరంగం తరఫున జరుగాలె.

దశాబ్దాలుగా సినిమా రంగంలో ఉంటూ తరతరాలుగా ఆ రంగంపైనే ఆధారపడి ఎదిగిన వ్యక్తులూ, సంస్థలూ ముందుకొచ్చి తెలుగు సినిమాల పరిరక్షణ పట్ల నడుం బిగించాలి. వ్యాపారాత్మకంగా ఫిల్మ్ స్టూడియోలు, ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లు ఏర్పాటుచేసినట్టే ఆర్కైవ్స్‌ను ఏర్పాటుచేయగలిగితే తమ వృత్తికి ఎంతో దోహదం చేసినట్టవుతారు. కనీసం నటులు దర్శకులు, నిర్మాతల వారసులైనా వారి తల్లిదండ్రుల సినిమాలు, సినిమాల పోస్టర్లు, పాటల పుస్తకాలు, తదితరాలు సేకరించి వాటిని ఉత్తమ క్వాలిటీలో పునరుద్ధరించి భద్రపరుచాలి. ఫలితంగా సినిమా పరిశోధకులకు, నవతరం యువతకు చరిత్ర అందుతుంది. ఇక ప్రింట్లను డిజిటలైజ్ చేసి అధ్యయనానికి అందుబాటులో ఉంచితే సమాచార కొరత తీరుతుంది. ఏడాదికోసారి ఇటలీ వలె పునరుద్ధరించిన సినిమాలతో ఫిల్మ్ ఫెస్టివల్స్ ఏర్పాటుచేయవచ్చు.

తెలుగు సినిమా రంగంలోని పెద్దలు తెలుగు 'ఫిల్మ్ ఆర్కైవ్స్' ఏర్పాటుచేయాలె. తమ వారసత్వాన్ని, చరిత్రను, గత సంస్కృతిని ప్రతిబింబించే ఈ సినిమాల సేకరణ, పరిరక్షణ, డిజిటలైజేషన్, పునరుద్ధరణ చర్యలకు పూనుకోవాలి. తమ చరిత్రను, వారసత్వాన్ని భావితరాల కోసం నిక్షిప్తం చేయాలని ఆశిద్దాం. ■



గత డెబ్బై ఏండ్లుగా.. 1947 నుంచి కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ అనేక రూపాల్లో దాడి చేస్తుంటే, భారత్ దాన్ని తిప్పికొడుతూనే ఉన్నది. యథాతథస్థితిని నిలిపి ఉంచేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నది. ఇప్పుడు పరిస్థితి తారుమారై పాక్ స్వీయరక్షణలో పడింది.

**శేఖర్ గుప్తా**



ఢిల్లీలో మరో ప్రయాణికురాలిపై లైంగికదాడి. ఇలాంటి వారిని ఏ జంతువు పేరుతో పిలిచినా ఆ జంతువును అవమానపరిచినట్లే. చట్టంలో ఏ మార్పు తెచ్చినా ఏం ప్రయోజనం సత్వర విచారణతో దోషులు శిక్షింపబడాలి. ఇలాంటి నేరాలను నిరోధించటానికి ప్రభుత్వం ఏం చేస్తున్నది?

**శర్మిష్ఠ ముఖర్జీ**



ట్రాన్స్‌జెండర్లకు తగు గుర్తింపు, న్యాయం జరిగేందుకు, వారి సంక్షేమానికి ఇన్నాళ్లకు ఓ ప్రయత్నం జరిగింది. మనం ఇంకా సుదూర ప్రయాణం చేయాల్సి ఉన్నది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం సామాజిక న్యాయం పట్ల చేస్తున్న కృషికి అభినందనలు.

**జ్యోతిరాదిత్య సింధియా**



ఆదాయపన్నుకు సంబంధించి మదింపు, ఇతర విషయాలను ప్రభుత్వం సరళతరం చేయటం కొత్త కంపెనీల స్థాపనకు ఊపునిస్తుంది. సులభతర వ్యాపారానికి అనుకూల విధానాలతో భారత నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయి.

**పీయూష్ గోయల్**

# రైతుకు ఎన్నడూలేని ధీమా

వ్యవసాయం



సి.పార్థసారథి,ఐఏఎస్

> సీఎం కేసీఆర్ రూపకల్పన చేసిన 'రైతుబంధు' పథకం ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యయవసాయ సంస్థ రోమ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఎంపికైన రైతు సంక్షేమ పథకాల్లో ఒకటిగా నిలిచింది. తెలంగాణ పేరు మరోసారి ప్రపపంచస్థాయిలో వినిపించింది. గతంలో చేసిన రుణాలు భయంకరంగా రైతులను వెంటాడుతున్న నేప థ్యంలో రుణమాఫీ పథకాన్ని కూడా చిత్తశుద్ధితో అమలుచేసి 'రైతు రాజ్యం' అనే పేరును సీఎం కేసీఆర్ సార్థకం చేశారు. నాలుగు విడుతల్లో లక్షలాది మంది రైతులకు రుణ విముక్తి లభించింది. రుణమాఫీ చేసి తాము నిజమైన రైతు బంధువులమని ప్రభుత్వం రుజువుచేసుకున్నది. ఆర్థిక సహాయంతో పాటు రైతులకు సాంకేతిక సహాయం కూడా అందించాలనే వినూత్నమైన ఆలోచన కూడా రైతాంగానికి తెలంగాణలో ఎంతగానో ఉపయోగపడింది.

రైతుబీమాతో పాటు కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనుగుణంగా విధానాల రూపకల్పనతో తెలంగాణలో మరొక వ్యవసాయ విప్లవానికి అంకురార్పణ చేసింది. దశాబ్దాల పోరాటం, ఎన్నో ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం వేస్తున్న అడుగు అన్ని రంగాల్లో ప్రగతి దిశగా సాగుతున్నది. ముఖ్యంగా దేశానికే వెన్నెముక లాంటి వ్యవసాయరంగంలో ప్రజలందరికీ ఆహారం సమకూరుస్తున్న అన్నదాతలు ఆత్మాభిమానంతో జీవించేమార్గాన్ని తెలంగా ప్రభుత్వం ఏర్పరుస్తున్నది. వినూత్న పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ఒకనాటి కటిక పేదరికం, నిరక్షరాస్యత, రైతుల ఆత్మహత్యలు, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో దీనత్వం తాండవించే తెలంగాణలో ఇప్పుడు ప్రజానీకం జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. తమది నిజమైన రైతురాజ్యం అని చాటుతూ కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసింది. రాష్ట్రంలో వ్యవ్యసాయ రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులకు సజీవ సాక్ష్యంగా వారి ముఖాల్లో ఆనందం కనిపిస్తున్నది. తెలంగాణలో వరి వంటి ఆహార పంటతో పాటు వాణిజ్యపంటలు కూడా అధికంగా పండించే వ్యవసాయం ఎక్కువగా బోరుబావులపైనే ఎక్కువగా ఆధారపడింది. ఇది అందరికీ తెలిసిన వాస్తవం. దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఎలాంటి భారం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేసింది.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలి ఐదేండ్ల పాలనలో విద్యుత్‌పై ఇతర రాష్ట్రాల మీద ఆధారపడే పరిస్థితిని మార్చివేసింది. ప్రస్తుతం నిరాఘాటంగా 24 గంటలు రైతాంగానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసే స్థితికి చేరుకొని రికార్డు సృష్టించింది. రైతుల పంటలకు రక్షణ కల్పిస్తూ వారు నష్టాలబారిన పడకుండా నివారించడానికి కేసీఆర్ ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మరింత ఊతం అందించేదిశగా 2019-20 సంవత్సరానికి గాను రూ.908.30 కోట్లు జీవితబీమా సంస్థకు ప్రీమియం చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం రైతుకు రక్షణగా, ఆసరాగా నిలువాలనే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. గతేడాది కంటే 1,284 అధికంగా చెల్లిస్తున్న ఈ ప్రీమియం వల్ల 31 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

2018 ఆగస్టు 14నుంచి అమలులోకి వచ్చిన ఈ పథకం కింద 18 నుంచి 60 ఏళ్ళ లోపు ఉన్న 29.58 లక్షల మంది పట్టాదారులకు ఒక్కొక్కరికి రూ 2,171.50 వంతున ప్రీమియం చెల్లించారు. దీనికింద 2018-19 సంవత్సరానికి గాను రూ 672 కోట్లు చెల్లించారు. ఇప్పటి వరకు బీమా పరిధిలో ఉన్న 30.92 మంది రైతులకు ప్రభుత్వం 704 కోట్లు ప్రీమియం చెల్లించింది. అయితే పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ఈసారి రైతులకు చెల్లించే ప్రీమియం 1284.44లకు పెంచటం జరిగింది. ఇది రైతుల్లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. బీమా పథకం వర్తించే కుటుంబాలలో 15,027 మంది రైతు కుటుంబాలకు ఈ పరిహారం కింద 751.35 కోట్లు చెల్లించటం జరిగింది. 0.1 ఎకరం నుంచి అయిదు ఎకరాలలోపు ఉన్న రైతులలో 84 శాతం మంది ఎస్సీ, ఎస్టీలకు చెందినవారే ఉండటం గమనార్హం.

రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీటి అందించాలనే ధ్యేయంతో ఏటా బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లను కేటాయిస్తున్నది. వివిధ సాగునీటి ప్రాజెక్టులను శరవేగంతో పూర్తిచేస్తున్నది. దీంతో కొత్తగా ఆయకట్టు సాగులోకి తీసుకువస్తున్నది. అంతేకాకుండా కాకతీయ రాజులకాలంలో తవ్వించిన గొలుసుకట్టు చెరువులకు 'మిషన్‌కాకతీయ' ద్వారా జీవం పోస్తున్నది. వానకాలం పంట సాగుకు సంబంధించి వ్యవ్యసాయశాఖ సమర్పించిన తాజా నివేదిక ప్రకారం 80.24 లక్షల ఎకరాల విస్తీర్ణం సాగులోకి వచ్చింది. 'మిషన్ కాకతీయ' కింద 46,531 చెరువుల్లో ఇప్పటికే 28,290 చెరువుల్లో పూడికతీసివేసి మరమ్మతులు పూర్తిచేసింది. దీనివల్ల భూగర్భ జలాల మట్టం కూడా పెరుగడానికి ఎంతగానో దోహదపడుతున్నది.

ఇదే సమయంలో భవిష్యత్తు నీటి అవసరాలను లభ్యత అవకాశాలను దృష్టిలో పెట్టుకొని తక్కువ వ్యయంతో ఎక్కువ భూమిని సాగుచేసు కోవడానికి తోడ్పడే సూక్ష్మ సేద్య విధానాన్ని కూడా ప్రోత్సహించడం ప్రభుత్వ దూరదృష్టికి మరొక నిదర్శనం. అంతేకాదు సూక్ష్మ సేద్యం విధానం అమలుకు అవసరమైన పరి కరాల కొనుగోలుకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం. మిగ తా రైతులకు 80 శాతం సబ్సిడీ కల్పిస్తున్నది. దీంతో 2.09 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. నీటి సరఫరాతో పాటు మరొక ముఖ్యమైన అవసరం సకాలంలో రైతులకు నాణ్యమైన విత్త నాల సరఫరా. ఇందుకుగాను విత్తనాభివృద్ధి, సేంద్రియ ధృవీకరణ సంస్థ (తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ) ఆవిర్భవించిం ది. దీనిద్వారా రాష్ట్రంలోని రైతులకే కాకుండా ప్రపం చ దేశాలకు కూడా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసే స్థాయికి మనం ఎదిగాం. ఇది తెలంగాణను విత్తన భాండాగారం అనే పేరును తెచ్చిపెట్టిం ది. దేశంలోని విత్తనాల అవసరాల్లో 60 శాతం తెలంగాణ ద్వారా తీర్చగ లుగుతున్నామంటే మనం సాధిస్తున్న పురోగతిని చాటిచెబుతున్నది. అంతర్జాతీయ విత్తన పరీక్ష సంఘం 'ఇస్టా'లో సభ్యత్వం సంపాదించడ మే కాకుండా 'ఇస్టా' 32వ అంతర్జాతీయ సదస్సును హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించుకోవటం ద్వారా ప్రపంచ దేశాల దృష్టిని ఆకట్టుకున్నాం.

ఒకప్పుడు పంటలకు తగిన పెట్టుబడి లేక అధిక వడ్డీలకు అప్పులు చేసి పంటలు చేతికి అందక రైతులు అత్మహత్యలు చేసుకోవడమో, స్వస్థలాలను వదలి పట్టణాలకు, పొరుగు రాష్ట్రాలకు కూలీ పనిచేసుకోవ డానికి వలసపోవడం జరిగేది. కొన్ని దశాబ్దాలుగా రైతు భారతంలో నిత్యం కనిపించే దృశ్యాలివి. కానీ కేసీఆర్ పాలన తెలంగాణలో రైతులకు ఆ చీకటిరోజులను దూరం చేసి, రైతు బతుకుకు భరోసా కల్పించే రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద వానకాలం, యాసంగి కాలాల్లో పంటలు వేసుకునే రైతులకు ఎకరాకు రూ.4 వేలు ఇవ్వడంతో రైతులకు ఎంతో ఊరట కలిగింది. 2018-19 సంవత్సరానికి రూ.12 వేల కోట్లు కేటాయించారు. లబ్ధిదారుల పేరుతో పాస్‌బుక్‌లను ఇచ్చి సకాలంలో వారికి ఈ సహాయం అందజేసే వ్యవస్థను ఏర్పాటుచేశారు.

సీఎం కేసీఆర్ రూపకల్పన చేసిన 'రైతుబంధు' పథకం ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యయవసాయ సంస్థ రోమ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఎంపికైన రైతు సంక్షేమ పథకాల్లో ఒకటిగా నిలిచింది. తెలంగాణ పేరు మరోసారి ప్రపంచస్థాయిలో వినిపించింది. గతంలో చేసిన రుణాలు భయంకరంగా రైతులను వెంటాడుతున్న నేపథ్యంలో రుణమాఫీ పథకాన్ని కూడా చిత్తశుద్ధితో అమలుచేసి 'రైతు రాజ్యం' అనే పేరును సీఎం కేసీఆర్ సార్థకం చేశారు. నాలుగు విడుతల్లో లక్షలాది మంది రైతులకు రుణ విముక్తి లభించింది. రుణమాఫీ చేసి తాము నిజమైన రైతు బంధువులమని ప్రభుత్వం రుజువుచేసుకున్నది. ఆర్థికసహాయంతో పాటు రైతులకు సాంకేతిక సహాయం కూడా అందించాలనే వినూత్నమైన ఆలోచన కూడా రైతాంగానికి తెలంగాణలో ఎంతగానో ఉపయోగపడింది. ప్రతి 5 వేల ఎకరాలకు ఒక విస్తరణాధికారి వంతున 2,638 మంది విస్తరణాధికారుల నియామకం జరిగింది. ఉద్యానపంటలకు గాను సబ్సిడీని 75 శాతం పెంచారు. రైతు సమన్వయ కమిటీలు ఏర్పాటుచేసి పంటలు, వాటి రక్షణ, సరైన గిట్టుబాటు ధర వచ్చే మార్కెట్ సదుపాయాల కల్పన తదితర అంశాలపై సలహాలిచ్చే విధానం కూడా రైతుల్లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నది. బీమా సౌకర్యంతో పాటు రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వ విధానాల అమలుతో రైతులకు జీవితం పట్ల ధీమాను కల్పిస్తున్నది. ఒకరకంగా రైతులకు కేసీఆర్ ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటూ సంరక్షిస్తున్నది. రైతు కుటుంబాల్లో సంతోషాలతోనే బంగారు తెలంగాణ ఆవిష్కరణకు అర్థం, పరమార్థమని ప్రభుత్వం త్రికరణశుద్ధిగా నమ్ముతున్నది. అందుకే ఎంత క్లిష్టమైనా, ఎంత భారమైనా రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ దేశానికే కాదు, ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తున్నది.

(వ్యాసకర్త: రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# మళ్లీ సోనియానే

## కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలిగా నియామకం

- సుదీర్ఘ చర్చల అనంతరం సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం
- రాహులే కొనసాగాలన్న నేతలు.. తిరస్కరించిన రాహుల్
- కొత్త అధ్యక్షుడి ఎంపిక పెండింగ్



సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం బయటకు వస్తున్న సోనియా గాంధీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియాగాంధీ నియమితులయ్యారు. కొత్త సారథి ఎంపిక కోసం శనివారం ఢిల్లీలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సుదీర్ఘ చర్చలు, సంప్రదింపుల అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. అధ్యక్షుడిగా కొనసాగేందుకు రాహుల్‌గాంధీ ససేమిరా అనడంతో పార్టీ మాజీ అధ్యక్షురాలి వైపు సీడబ్ల్యూసీ మొగ్గు చూపింది. కొత్త సారథిని ఎంపిక చేసేంతవరకు సోనియా గాంధీ పార్టీ బాధ్యతలు చేపట్టనున్నారు. 2017లో పార్టీ పగ్గాలు రాహుల్‌కు అప్పగించేవరకు దాదాపు 19 ఏండ్లు ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగారు.

**మూడు తీర్మానాలకు సీడబ్ల్యూసీ ఆమోదం**

సీడబ్ల్యూసీ సమావేశంలో మూడు తీర్మానాలను ఆమోదించారు. కొత్త అధ్యక్షుడి ఎంపికను పెండింగ్‌లో పెడుతూ.. పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టాలని సోనియాగాంధీని విజ్ఞప్తి చేస్తూ ఓ తీర్మానాన్ని ఆమోదించారు. పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశామని, అయితే అందుకు ఆయన నిరాకరించారని తీర్మానంలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ కనబరిచిన అసాధారణ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ మరో తీర్మానాన్ని ఆమోదించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పరాభవానికి నైతిక బాధ్యత వహిస్తూ అధ్యక్ష పదవి నుంచి వైదొలగడం ద్వారా ప్రజా జీవితంలో జవాబుదారీతనానికి కొత్త ప్రమాణాలను నెలకొల్పారని తీర్మానంలో ప్రశంసించారు. కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనను ప్రధాని మోదీ పారదర్శకంగా తొలగించాలని మరో తీర్మానాన్ని ఆమోదించారు.

**సుదీర్ఘ చర్చలు..**

కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు శనివారం ఉదయం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ సమావేశమైంది. అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీనే కొనసాగాలని నేతలు కోరినా ఆయన తోసిపుచ్చారు. చాలా కొద్ది మంది మాత్రమే పార్టీ అధ్యక్షుడిగా ఇతరుల పేర్లను సూచించారని, రాహుల్ కొనసాగకపోతే పార్టీలో వలసలు పెరుగుతాయని మెజార్టీ సభ్యులు హెచ్చరించినట్లు తెలిసింది. అధ్యక్షుడి ఎంపికలో అన్ని రాష్ట్రాల నేతల అభిప్రాయలను తెలుసుకునేందుకు రాహుల్ సూచన మేరకు ప్రాంతాల వారీగా ఐదు సబ్‌కమిటీలను ఏర్పాటుచేశారు. ఈశాన్య ప్రాంతానికి సంబంధించిన కమిటీలో అహ్మద్ పటేల్, అంబికా సోనీ, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ ఉన్నారు. తూర్పు ప్రాంత కమిటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అసోం మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్, కేంద్ర మాజీ మంత్రి కుమారి షెల్జా ఉన్నారు. ఉత్తర ప్రాంత కమిటీలో ప్రియాంకాగాంధీ, జ్యోతిరాదిత్య సింధియా, పీ చిదంబరం ఉన్నారు. పశ్చిమ ప్రాంత కమిటీలో గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, ఏకే ఆంటోనీ, మోతీలాల్ ఓరా ఉన్నారు. దక్షిణ ప్రాంత కమిటీలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఆనంద్‌శర్మ, ముకుల్ వాస్నిక్ ఉన్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లట్, ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి వీ నారాయణస్వామి కూడా సంప్రదింపుల ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ కమిటీలు నివేదికలు సిద్ధం చేసిన అనంతరం రాత్రి మరోసారి సీడబ్ల్యూసీ సమావేశమైంది. వాటిపై సుదీర్ఘంగా చర్చించింది. జమ్ముకశ్మీర్‌లోని పరిస్థితులపైనా చర్చలు జరిపింది.

**మధ్యలో వెళ్లి తిరిగొచ్చిన సోనియా, రాహుల్**

కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశం నుంచి సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ మధ్యలోనే వెళ్లిపోయారు. సంప్రదింపుల ప్రక్రియలో తాము భాగస్వామ్యం కాలేమని చెప్పారు. అయితే, కమిటీలు తమ నివేదికలను సమర్పించిన అనంతరం సీడబ్ల్యూసీ తిరిగి సమావేశమైనప్పుడు.. వారిద్దరూ తిరిగి వచ్చి సంప్రదింపుల్లో పాల్గొన్నారు.

## జాగ్వార్‌ను కొనివ్వలేదని బీఎండబ్ల్యూని నదిలోకి వదిలేశాడు

- హర్యానాలో ఓ పుత్రుడి నిర్వాకం
- స్థానికుల సాయంతో బయటికి తీసిన పోలీసులు



నదిలో మునిగిపోతున్న బీఎండబ్ల్యూ కారు

**యమునానగర్, ఆగస్టు 10:** తండ్రి విలాసవంతమైన జాగ్వార్ కారును కొనివ్వలేదని అలిగిన ఓ కుమారుడు రూ.45 లక్షలు విలువైన కొత్త బీఎండబ్ల్యూ కారును నదిలోకి వదిలేశాడు. ఈ వింత ఘటన హర్యానాలో చోటుచేసుకుంది. ముక్రంపూర్ గ్రామానికి చెందిన ఓ సంపన్న వ్యక్తి తన కొడుకు కోసం రెండు నెలల కిందట బీఎండబ్ల్యూ కారును కొనుగోలు చేశాడు. అయితే తాను కోరిన జాగ్వార్‌కు బదులు బీఎండబ్ల్యూ కారును కొనడంతో తీవ్ర అసంతృప్తి చెందిన ఆకాశ్ శుక్రవారం బీఎండబ్ల్యూలో నది గట్టు వద్దకు వెళ్లాడు. గట్టు వాలు వద్ద కారును వదిలేయడంతో నదిలోకి కొట్టుకుపోయింది. గమనించిన గ్రామస్థులు విషయాన్ని పోలీసులకు చేరవేయగా స్థానికుల సహకారంతో కారును నది నుంచి బయటికి తీశారు. ఆకాశ్ మానసిక వైకల్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

## వైద్యచికిత్సకు స్పందిస్తున్న అరుణ్ జైట్లీ

ఉప రాష్ట్రపతి కార్యాలయం వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ వైద్య చికిత్సకు స్పందిస్తున్నారని ఉపరాష్ట్రపతి కార్యాలయం వెల్లడించింది. శుక్రవారం ఉదయం ఊపిరిపీల్చుకునేందుకు ఇబ్బంది పడి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను ఎయిమ్స్ దవాఖానకు తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితరులు శుక్రవారం సాయంత్రం ఎయిమ్స్‌ను సందర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శనివారం ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎయిమ్స్ దవాఖానకు వెళ్లి జైట్లీ కుటుంబ సభ్యులను కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జైట్లీ ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు ఆయన స్పందిస్తున్నారని ఎయిమ్స్ డాక్టర్లు చెప్పినట్లు ఉప రాష్ట్రపతి కార్యాలయం పేర్కొంది.

# కశ్మీర్ అభివృద్ధికి.. 370 అడ్డు కాలేదు

- మానవాభివృద్ధి సూచీలో ఏపీ, గుజరాత్ కన్నా మెరుగు
- సగటు జీవితకాలంలో దేశంలోనే మూడోస్థానం
- జనాభా నియంత్రణలో రెండోస్థానం
- జీఎస్డీపీ వృద్ధి, తలసరి ఆదాయంలో మాత్రం వెనుకడుగు

### స్పష్టం చేస్తున్న గణాంకాలు



జమ్ముకశ్మీర్ అభివృద్ధికి ఆర్టికల్ 370 అడ్డుగా ఉన్నదనే కారణంతో కేంద్ర ప్రభుత్వం దానిని రద్దు చేసింది. ఇకపై కశ్మీర్‌లో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని ప్రధాని మోదీ ఇటీవలి పేర్కొన్నారు. అయితే పలువురు విశ్లేషకులు మాత్రం కశ్మీర్ అభివృద్ధికి 370వ అధికరణ అడ్డుగా నిలిచిందన్న వాదనలతో విబేధిస్తున్నారు. గణాంకాలను పరిశీలిస్తే జమ్ముకశ్మీర్ పలు అంశాల్లో ముందువరుసలోనే కనిపిస్తుంది. కొన్ని రంగాల్లో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. జీఎస్డీపీ వృద్ధి, తలసరి ఆదాయంలో మాత్రం కాస్త వెనుకబడింది.

### తగ్గుతున్న శిశు మరణాల రేటు

దేశ సగటు-33
జమ్ముకశ్మీర్-23

ప్రతి వెయ్యి జననాల్లో చనిపోతున్న శిశువుల సంఖ్యను శిశుమరణాల రేటుగా చెప్తుంటారు. 2017లో జమ్ముకశ్మీర్ శిశుమరణాల రేటు 23. ఈ జాబితాలో కేరళ (10) అగ్రస్థానంలో ఉండగా, మధ్యప్రదేశ్ (47) చివరిస్థానంలో ఉన్నది. జమ్ముకశ్మీర్ ఆరోస్థానంలో ఉన్నది. అంతేకాదు.. 2011 నుంచి గణాంకాలను పరిశీలిస్తే జమ్ముకశ్మీర్‌లో శిశుమరణాల రేటు 41 నుంచి 23కు తగ్గింది.

### పెరుగుతున్న సగటు జీవితకాలం

దేశ సగటు-68.7 ఏండ్లు
కశ్మీర్-73.5 ఏండ్లు

2012-16 నివేదిక ప్రకారం సగటు జీవితకాలంలో జమ్ముకశ్మీర్‌లో దేశ సగటుకన్నా దాదాపు ఐదేండ్లు ఎక్కువగా ఉన్నది. ఈ జాబితాలో కేరళ 75.1 ఏండ్ల సగటుతో అగ్రస్థానంలో ఉండగా.. జమ్ముకశ్మీర్ మూడో స్థానంలో ఉన్నది. ఉత్తరప్రదేశ్ 64.8 ఏండ్లతో చివరన నిలిచింది.

### జనాభా నియంత్రణలో ఆదర్శం

దేశ సగటు-2.2
జమ్ముకశ్మీర్-1.6

జనాభా నియంత్రణలోనూ కశ్మీర్ ఆదర్శంగా నిలిచింది. 2017 లెక్కల ప్రకారం జననాల రేటులో ఢిల్లీ టాప్‌లో ఉండగా పంజాబ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్‌తో సంయుక్తంగా కశ్మీర్ రెండోస్థానంలో నిలిచింది. 2016తో పోల్చితే మెరుగుపడింది.

### డాక్టర్ల సంఖ్య ఎక్కువే



2018 నివేదిక ప్రకారం కశ్మీర్‌లో ప్రతి 3,060మందికి ఒక ప్రభుత్వ డాక్టర్ అందుబాటులో ఉన్నారు. ఈ జాబితాలో ఢిల్లీ (2,203 మందికి ఒక డాక్టర్) అగ్రస్థానంలో ఉండగా, బీహార్ (28,391 మందికి ఒక డాక్టర్) చివరిస్థానంలో ఉన్నది.



### అక్షరాస్యత ఓకే

2011 జనాభా లెక్కల ప్రకారం అక్షరాస్యతలో జాతీయ సగటు 73.0 శాతం. జమ్ముకశ్మీర్‌లో ఇది 67.2 శాతంగా నమోదైంది. బీహార్(61.8), అరుణాచల్ ప్రదేశ్(65.4), రాజస్థాన్(66.1) వంటి రాష్ట్రాల కన్నా మెరుగైన స్థానంలో నిలిచింది.

### పేదరికం తక్కువే..

దేశ సగటు-21.9 శాతం
కశ్మీర్-10.35 శాతం

పేదరికం విషయంలో దేశసగటుతో పోల్చితే జమ్ముకశ్మీర్ సగం మాత్రమే ఉన్నది. ఈ జాబితాలో గోవా (5.09శాతం) ఉత్తమస్థానంలో ఉండగా, ఛత్తీస్‌గఢ్ (39.93శాతం) చివరన నిలిచింది. జమ్ముకశ్మీర్ 8వ స్థానం దక్కించుకున్నది.

### మానవాభివృద్ధి సూచీలో మెరుగు

2017 మానవాభివృద్ధి సూచీ జాబితాలో గుజరాత్, ఆంధ్రప్రదేశ్ కన్నా కశ్మీర్ మెరుగ్గా ఉన్నది. ఈ జాబితాలో కేరళ 0.77 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, జమ్ముకశ్మీర్ 0.68 పాయింట్లు సాధించింది.

### తలసరి ఆదాయం తక్కువ

తలసరి ఆదాయం జాతీయ సగటుతో పోల్చితే జమ్ముకశ్మీర్‌లో చాలా తక్కువగా కనిపిస్తున్నది. 2018 లెక్కల ప్రకారం దేశ తలసరి ఆదాయం రూ.98వేలు కాగా.. కశ్మీర్‌లో రూ.65,615గా ఉన్నది.

### నిరుద్యోగం తక్కువే

దేశ సగటు-6.1%
జమ్ముకశ్మీర్-5.3%

దేశ సగటుతో పోల్చితే కశ్మీర్‌లో నిరుద్యోగుల సంఖ్య తక్కువగా నమోదైంది. 2017-18 జాబితా ప్రకారం ఛత్తీస్‌గఢ్ (3.3 శాతం) తొలిస్థానంలో, కేరళ (11.4శాతం) చివరి స్థానంలో ఉన్నాయి.



### లింగనిష్పత్తిలో మెరుగే

లింగనిష్పత్తిలోనూ దేశ సగటుకన్నా జమ్ముకశ్మీర్ మెరుగ్గా ఉన్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆ రాష్ట్రంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 889 స్త్రీలు ఉండగా.. ఆరేండ్లలోనే మెరుగైన ఫలితాలను (917 మంది స్త్రీలు) సాధించింది.

దేశ సగటు-896
జమ్ముకశ్మీర్-917

### జీఎస్డీపీ వృద్ధిరేటులో లోటు



జీఎస్డీపీ వృద్ధిలో దేశసగటుతో పోల్చితే కశ్మీర్‌లో చాలా లోటు కనిపిస్తున్నది. చివరి నుంచి మూడోస్థానంలో నిలిచింది. 2016-17 జాబితాలో గుజరాత్ 9.8 శాతంతో టాప్‌లో నిలువగా పశ్చిమబెంగాల్ 4.8 శాతంతో చివరి స్థానంలో ఉన్నది.

- నేషనల్ డెస్క్

# సరికొత్త పార్లమెంటు భవనం!

- పరిశీలనలో ప్రతిపాదన
- స్పీకర్ ఓం బిర్లా వెల్లడి



ప్రధాని మోదీతో స్పీకర్ ఓంబిర్లా (ఫైల్)

**న్యూఢిల్లీ:** నూతన పార్లమెంటు భవన నిర్మాణం ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం తెలిపారు. ప్రస్తుత పార్లమెంటు భవనాన్ని ఆధునీకరించడం లేదా కొత్త పార్లమెంటు భవన నిర్మాణాన్ని చేపట్టడం వంటి అంశాలు పరిశీలనలో ఉన్నాయని, అయితే, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. కొత్త పార్లమెంటు భవనం అవసరమనే ఒక అభిప్రాయం కూడా ఉన్నదని, అభిప్రాయ సేకరణకు కొన్ని బృందాలను ఏర్పాటు చేసి ఎంపీలతో సహా వివిధ వర్గాల ప్రజల సూచనలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాల చివర్లో కూడా ఓం బిర్లా పార్లమెంటు కొత్త భవన నిర్మాణం ప్రస్తావన తీసుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తయ్యే 2022నాటికి 'సరికొత్త భారత్'ను ఆవిష్కరించాలని ఇప్పటికే ప్రకటించారని గుర్తుచేశారు. దీంట్లో భాగంగా పార్లమెంటు భవనాన్ని విస్తరించడం లేదా ఆధునీకరించే అంశాన్ని కూడా చేర్చాలని ప్రధానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి చిహ్నమైన భారత పార్లమెంటు భవనం అత్యంత ఆకర్షణీయంగా, అత్యద్భుతంగా ఉండాలనేది తమందరి ఆకాంక్ష అని కూడా ఓం బిర్లా పేర్కొన్నారు.

**ఒక్కసారికూడా వాయిదా వేయలేదు**


ఇటీవలి లోక్‌సభ సమావేశాలు ఒక్కసారికూడా వాయిదా పడలేదని ఓం బిర్లా వెల్లడించారు. 'ఈ పార్లమెంటు సమావేశాల్లో లోక్‌సభను ఒక్కసారికూడా వాయిదా వేయలేదు. ఫలితంగా కేటాయించిన సమయం కంటే 72 గంటలు అదనంగా సభ నడిచింది. లోక్‌సభ సవ్యంగా సాగుతూ.. సభ్యులు ఎక్కువ సమయం సభలో కూర్చోవడం అంటే దేశానికి సానుకూల సందేశం పంపించడమే' అని ఓం బిర్లా తెలిపారు. మరోవైపు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లతో తాను త్వరలోనే ఓ సమావేశం నిర్వహిస్తానని, సభను సజావుగా నడపడం, సమయాన్ని వృథాకాకుండా ఫలవంతమైన చర్చలను సాగించడం వంటి అంశాలను ఈ సమావేశంలో చర్చిస్తామని ఓం బిర్లా తెలిపారు.

### బీజేపీ నేతల ద్వంద్వప్రవృత్తి

ఢిల్లీలో నూతన పార్లమెంటు భవనాన్ని నిర్మించాలని కేంద్ర బీజేపీ నాయకత్వం భావిస్తున్నది. మరోవైపు, తెలంగాణలో కొత్త అసెంబ్లీ, నూతన సచివాలయం భవనాలను నిర్మించాలన్న ప్రతి పాదనలను మాత్రం రాష్ట్ర బీజేపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ద్వంద్వప్రవృత్తిని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఢిల్లీలో కొత్త పార్లమెంటు భవనం నిర్మాణం కావాలని చెబుతూ.. ఇక్కడ మాత్రం కొత్త అసెంబ్లీకి అడ్డుపుల్ల వేయడం ఏంటని నిలదీస్తున్నారు.

## క్షిపణి పరీక్షలో భారీ పేలుడు

- ఐదుగురి మృతి రష్యాలో ఘటన
- అణుధార్మికత విడుదల.. భయాందోళనలో ప్రజలు



**మాస్కో, ఆగస్టు 10:** రష్యాకు చెందిన ఓ రహస్య మిలిటరీ ప్రాంతంలో నిర్వహించిన క్షిపణి పరీక్ష విఫలమైంది. దీంతో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు సిబ్బంది మరణించగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు కారణంగా ఆ చుట్టుపక్కల ప్రాంతమంతా అణుధార్మికత(న్యూక్లియర్ రేడియేషన్) క్రమంగా వ్యాపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రష్యా అణు సంస్థ రోసాటమ్‌లో గురువారం ఈ దుర్ఘటన జరిగినట్టు అధికారులు తెలిపారు. ఆర్కెన్‌గల్స్ ప్రాంతంలో ఉన్న మిలిటరీ ఫైరింగ్ రేంజ్‌లో ఈ ప్రమాదం జరిగింది. లిక్విడ్ ప్రొపెల్లంట్ ఇంజిన్ కోసం పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో పేలుడు చోటుచేసుకున్నట్టు సమాచారం. అణుధార్మికత విడుదలైనట్టు ఆధారాలు లేవని తొలుత మిలిటరీ చెప్పింది. అయితే, ప్రయోగం విఫలమైన తర్వాత, సమీపంలోని సెవెరోడ్వినిస్క్ పట్టణంలో అణుధార్మికత క్రమంగా పెరిగినట్టు అధికారులు తెలిపారు. ప్రమాదం గురించి తెలుసుకున్న సెవెరోడ్వినిస్క్ స్థానికులు దగ్గర్లోని మెడికల్ షాపుల్లో అయోడిన్‌ను పెద్దఎత్తున కొనుగోలు చేయడం ప్రారంభించారు. ధార్మికతను వేగంగా గ్రహించే థైరాయిడ్ గ్రంథి చర్యల్ని అయోడిన్ నిరోధిస్తుంది. చెర్నోబిల్ అణు ప్రమాదం వంటి ఘటన జరిగి ఉంటుందేమో అన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగవిరుద్ధం

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టులో నేషనల్ కాన్ఫరెన్స్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) పార్టీ శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇందుకు సంబంధించి పార్లమెంట్ ఆమోదించిన చట్టం, రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ, వీటిని చెల్లుబాటు కాకుండా చేయాలని కోర్టును అభ్యర్థించింది. ప్రజాభీష్టం తెలుసుకోకుండానే వారి హక్కులను లాగేసుకుంటున్నారని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ ఎంపీలు మొహమ్మద్ అక్బర్ లోన్, హస్నైన్ మసూదీ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. లోన్.. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ మాజీ స్పీకర్ కాగా, మసూదీ.. జమ్ముకశ్మీర్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 శాశ్వతమైనదని 2015లో జస్టిస్ మసూదీ తీర్పునివ్వడం గమనార్హం. జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019, తదనంతరం జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వులను వీరు కోర్టులో సవాల్ చేశారు. సంబంధిత చట్టం, రాష్ట్రపతి ఉత్తర్వులను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని, చెల్లుబాటు కాకుండా చేయాలని ఎన్సీ ఎంపీలు సుప్రీంకోర్టును అభ్యర్థించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద జమ్ముకశ్మీర్ రాష్ట్ర ప్రజలకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులను ఇవి ఉల్లంఘిస్తున్నాయని వారు పేర్కొన్నారు. చట్ట నిబంధనలను పెడచెవిన పెడుతూ, రాష్ట్రపతి పాలన ముసుగులో కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఈ సమాఖ్య బంధాన్ని తెంచేందుకు అధికారం ఉన్నదా అన్నదానిపై కోర్టు పరిశీలించాలని కోరారు.


**మీడియాపై ఆంక్షలు ఎత్తివేయాలని పిటిషన్**

ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్ముకశ్మీర్‌లో మీడియాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో శనివారం పిటిషన్ దాఖలైంది. కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధ భాసిన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

# కశ్మీర్ అందరిదీ..

### అక్కడి యువతులను పెండ్లి చేసుకోవచ్చు!

- హర్యానా సీఎం ఖట్టర్ వివాదాస్పద వ్యాఖ్య
- ఇంత నీచంగా మాట్లాడుతారని అనుకోలేదు: రాహుల్




**చండీగఢ్, ఆగస్టు 10:** హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ వివాదాస్పద వ్యాఖ్య చేశారు. 'ఇప్పుడు కశ్మీర్ అందరిదీ అయ్యింది.. అక్కడి అమ్మాయిని తెచ్చుకొని పెండ్లి చేసుకోవచ్చు అని చాలా మంది అంటున్నారు' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై దుమారం రేగింది. సీఎం స్థాయి వ్యక్తి కశ్మీర్ యువతులను ఎలా కించపర్చుతారంటూ పలువురు మండిపడుతున్నారు. శుక్రవారం ఫతేబాద్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఖట్టర్ మాట్లాడుతూ 'ఇక్కడి యువకులకు వధువులు దొరకపోతే బీహార్ నుంచి తీసుకొస్తానని గతంలో మన మంత్రి ధన్‌కర్‌జీ చెప్పారు. ఇప్పుడు కశ్మీర్ అందరిదీ అయ్యింది. దీంతో కొందరు తాము కశ్మీర్ యువతులను ఇక్కడికి తెచ్చుకొని పెండ్లి చేసుకోవచ్చని చెబుతున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సరదాగా ఉన్నా లింగ నిష్పత్తి పెరిగితేనే సమాజంలో సమతూకం సాధ్యమవుతుంది' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో లింగ నిష్పత్తిలో చాలా వ్యత్యాసం ఉన్నదని, 1000 మంది పురుషులకుగాను 850 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారని తెలిపారు. దీంతో లింగ నిష్పత్తిని పెంచడానికి తాము ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, ఫలితంగా ప్రస్తుతం లింగనిష్పత్తి 1000-933గా వృద్ధి చెందిందని పేర్కొన్నారు. మరోవైపు ఖట్టర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ స్పందించారు. సీఎం స్థాయి వ్యక్తి ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేస్తారని తాను అస్సలు ఊహించలేదని తెలిపారు. మహిళ పురుషుడి ఆస్తికాదని చెప్పారు. దీంతో స్పందించిన ఖట్టర్ వెంటనే వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని, కశ్మీర్ ఆడపడుచులు తన కూతురులాంటి వారని చెప్పారు. ఫతేబాద్ కార్యక్రమంలో తాను మాట్లాడిన విషయాలకు సంబంధించిన వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఇంకోవైపు కశ్మీర్ యువతులపై వ్యాఖ్యలకు సంబంధించి ఖట్టర్ నుంచి వివరణ కోరుతానని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ చెప్పారు. కాగా గతంలో కశ్మీర్ యువతి బయటి రాష్ట్రానికి చెందిన వ్యక్తిని పెండ్లి చేసుకుంటే సొంత రాష్ట్రంలో ఆమె ఆస్తులపై హక్కులను కోల్పోయే పరిస్థితి ఉండేది. కానీ ఆర్టికల్ 370 రద్దుతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

# జలప్రళయం!

- దక్షిణాదిని ముంచెత్తిన వరదలు.. రెండ్రోజుల్లో 114 మంది మృతి
- జలదిగ్బంధంలో కేరళ.. కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ అతలాకుతలం

కర్ణాటకలో బాగల్‌కోట్ జిల్లాలోని లాడ్‌ఖాన్ ఆలయం నీటమునిగిన దృశ్యం



**తిరువనంతపురం/అహ్మదాబాద్/సంగ్లీ, ఆగస్టు 10:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి దక్షిణాది రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఘటనల్లో మృతి చెందిన వారి సంఖ్య శనివారంనాటికి 114కి చేరింది. పోటెత్తుతున్న వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో కేరళ, కర్ణాటకలో గత రెండు రోజుల్లోనే 83 మంది మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో గుజరాత్‌లో 19 మంది తమ ప్రాణాల్ని కోల్పోయారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా మహారాష్ట్రలో జనజీవనం అస్తవ్యస్తమవుతున్నది. ఇప్పటివరకూ ఆ రాష్ట్రంలో 12 మంది మరణించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కేరళలో జనజీవనం స్తంభించింది. నదులు, వాగులు ఉప్పొంగుతుండటం, కొండచరియలు విరిగి పడుతుండటంతో ప్రజలు ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని బతుకీడుస్తున్నారు. 1.25 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గురువారం నుంచి శనివారంనాటికి రాష్ట్రవ్యాప్తంగా 57 మంది చనిపోగా, 8 జిల్లాల్లో దాదాపు 80కిపైగా ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడినట్టు అధికారులు తెలిపారు. ముఖ్యంగా వయనాడ్, కోజికోడ్ జిల్లాలపై వర్షాల ప్రభావం తీవ్రంగా ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. మలప్పురం, వయనాడ్ జిల్లాల్లో విరిగిపడిన కొండచరియల కింద కొందరు చిక్కుకున్నట్టు అధికారులు భావిస్తున్నారు. వయనాడ్, కన్నూర్, కసర్‌గడ్ జిల్లాల్లో అధికారులు ఆదివారం రెడ్ అలర్ట్ ప్రకటించారు. కేరళలోని కాబిని నదిపై ఉన్న ప్రముఖ బానాసుర సాగర్ డ్యాం గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. నది తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,24,464 మందిని 1,111 సహాయక శిబిరాలకు తరలించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రైలు, విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. కొచి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం సర్వీసులను తిరిగి ప్రారంభిస్తామని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

### అదృష్టం.. దురదృష్టం వెంటాడాయి



విరిగిపడుతున్న కొండచరియలు

తప్పించుకున్న శరత్ (వృత్తంలో)

కేరళలోని పలు జిల్లాల్లో పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. మల్లపురం జిల్లా కొట్టకున్ను ప్రాంతంలో ఉన్న తమ ఇంటి ముందు శరత్, అతని తల్లి సరోజిని మాట్లాడుకుంటున్నారు. ఉన్నట్టుండి విరిగిపడిన కొండచరియలతో కూడిన ఓ పెద్ద నీటి ప్రవాహం వాళ్లపైకి దూసుకువచ్చింది. ఆఖరి నిమిషంలో ప్రమాదాన్ని కనిపెట్టిన శరత్.. తల్లితో సహా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అయితే, సరోజిని ప్రవాహంలో కొట్టుకుపోగా.. శరత్ కొద్దిలో తప్పించుకున్నాడు. అయితే శరత్ భార్య గీతూ, ఏడాదిన్నర చిన్నారి ఇంటితో సహా కూరుకుపోయారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ ఘటన జరిగింది. ఆరోజు రాత్రి వరకు అధికారులు సహాయక చర్యలు చేపట్టినప్పటికీ గల్లంతైన వాళ్ల ఆచూకీ లభించలేదు.

**45 ఏండ్లలో చూడని ప్రకృతి విపత్తు**

కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు 26 మంది మరణించారు. బెళగావి, బగల్‌కోట్, విజయపుర, రాయిచూర్, యాద్‌గిర్, గడగ్, ఉత్తర కన్నడ, హావేరి, హుబ్బళ్లి-ధార్వాడ్, దక్షిణ కన్నడ, చిక్కమగళూరు, కొడగు జిల్లాలు వర్షాలకు తీవ్ర ప్రభావితం అయ్యాయి. నేత్రావతి నది ఉప్పొంగడంతో పనే మంగళూరు గ్రామం మునిగిపోయింది. 45 ఏండ్లలో ఇంత పెద్ద ప్రకృతి విపత్తు చూడలేదని, భారీ వర్షాలు, వరదలతో రూ. 6వేల కోట్ల నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి బీ ఎస్ యడియూరప్ప పేర్కొన్నారు. కేంద్రం రూ. 3వేల కోట్లను సాయంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర సంగ్లీ జిల్లాలో గురువారం పడవ బోల్తాపడిన ఘటనలో మృతుల సంఖ్య 12కు చేరింది. రాష్ట్రంలోని కొల్హాపూర్, సంగ్లీ జిల్లాల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. 26 నౌకాదళ సిబ్బంది బృందాలు వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు ప్రారంభించాయి. భారీ వర్షాలు గుజరాత్‌ను వీడటం లేదు. ఆ రాష్ట్రంలో 19 మంది మృతిచెందారు. ఖేడా జిల్లాలోని నడియాడ్‌లో శుక్రవారం అర్ధరాత్రి మూడు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో నలుగురు మృతి చెందగా ఐదుగురికి గాయాలయ్యాయి.



సిక్కిరెడ్డి
అశ్విని

## ఫైనల్లో సిక్కి జోడీ

హైదరాబాద్ బ్యాడ్మింటన్ ఓపెన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** స్థానిక గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరుగుతున్న హైదరాబాద్ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో రాష్ట్ర యువ షట్లర్ సిక్కిరెడ్డి, అశ్విని పొనప్పతో కలిసి ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో సిక్కి, అశ్విని జోడీ 21-12, 21-12 తేడాతో హాంకాంగ్ ద్వయం ఫన్ క యన్, వు యి తింగ్‌పై అలవోక విజయం సాధించింది. అర్ధ గంటలోపే ముగిసిన మ్యాచ్‌లో సిక్కి, అశ్విని తమదైన శైలిలో ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. కండ్లు చెదిరే స్మాష్‌లకు తోడు డ్రాప్ షాట్లు, నెట్‌గేమ్‌తో హాంకాంగ్ జోడీని ఆటాడుకున్నారు. ఏ మాత్రం అవకాశమివ్వకుండా వరుస పాయింట్లతో వరుస గేముల్లో మ్యాచ్‌ను తమ వశం చేసుకుని ఈ సీజన్‌లో తొలిసారి ఫైనల్లోకి ప్రవేశించారు. ఆదివారం జరిగే తుది పోరులో సిక్కి, అశ్విని జోడీ కొరియాకు చెందిన బయిక్ హానా, జంగ్ క్యుంగ్‌తో తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో సౌరభ్ వర్మ ఫైనల్లోకి ప్రవేశించాడు. శనివారం నాటి సెమీస్‌లో సౌరభ్ 23-21, 21-16తో ఇస్కందర్ జుల్కర్‌నైన్(మలేషియా)పై విజయం సాధించాడు. 48 నిమిషాల్లోనే సౌరభ్.. ఇస్కందర్‌ను మట్టికరిపించాడు. ఆదివారం ఫైనల్లో సౌరభ్.. లోహ్ కీన్ యు(సింగపూర్)తో ఆడుతాడు.



సౌరభ్

**పీకేఎల్‌లో నేడు**

బెంగళూరు X హర్యానా -7.30గం.
గుజరాత్ X తెలుగు టైటాన్స్ -8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో

## సింధు X సైనా

### ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ముఖాముఖి తలపడే చాన్స్



**న్యూఢిల్లీ:** బాసెల్(స్విట్జర్లాండ్) వేదికగా వచ్చే వారంలో జరుగనున్న ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధు ముఖాముఖి తలపడనున్నారు. మహిళల సింగిల్స్ డ్రాలో ప్రపంచ గవర్నింగ్ బాడీ మార్పులు చేసింది. దీంతో ఒకే పార్శ్వంలో ఉన్న సైనా, సింధు సెమీఫైనల్లో తలపడే అవకాశాలు ఉన్నాయి. మహిళల సింగిల్స్ తప్ప మిగతా నాలుగు విభాగాల్లో ఎలాంటి మార్పు చేయలేదని బీడబ్ల్యూఎఫ్ శనివారం పేర్కొంది. 'మహిళల సింగిల్స్‌లో మారిషస్‌కు చెందిన కేట్ కునె పేరు తప్పిదంగా వచ్చింది. ఈ కారణంగా బీడబ్ల్యూఎఫ్ మార్పులు చేసి డ్రాను పునరుద్ధరించాల్సి వచ్చింది' అని ఫెడరేషన్ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగుతున్న సింధుకు తొలి రౌండ్‌లో బై లభించింది. పై యు పో లేదా లిండా జెచిరితో సింధు రెండో రౌండ్‌లో ఆడుతుంది. మరోవైపు ఎనిమిదో సీడ్ సైనా.. సబ్రినా జాక్వెట్, సొరయా డీ విచ్ మధ్య విజేతతో తలపడుతుంది. ఇలా గ్రూపు దశను దాటుకుని వస్తే సైనా, సింధు సెమీస్‌లో ఆడాల్సి వస్తుంది.



స్థానిక గచ్చిబౌలి స్టేడియం వేదికగా శనివారం ముగిసిన ఆరవ తెలంగాణ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గన్‌తో గురిచూసి కొడుతున్న రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్. చిత్రంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర రైఫిల్ సంఘం అధ్యక్షుడు అమిత్ సంఘీ తదితరులు

# సత్తా చాటేందుకు..

### గెలుపే లక్ష్యంగా భారత్ • వరుణుడు కరుణించాలని ఆకాంక్ష



కోహ్లీ

నేడు విండీస్‌తో భారత్ రెండో వన్డే

**సిరీస్‌లో తొలి వన్డే వర్షార్పణం తర్వాత... అచ్చొచ్చిన మైదానంలో అదరగొట్టేందుకు టీమ్ఇండియా సిద్ధమైంది. ఎంతో మథనం.. ఎన్నో కసరత్తుల తర్వాత తొలి మ్యాచ్‌లో జట్టు కూర్పు చేసినా... ఆ ఆలోచనలపై వరుణుడు నీళ్లు చల్లగా.. నేడు జరిగే రెండో వన్డే కోసం తాజా ప్రణాళికలతో రెడీ అయింది. ఆటగాళ్లను పరీక్షించాలన్న ప్రయత్నానికి ఈసారైనా వర్షం అడ్డుతగలకూడదని కోహ్లీసేన ఆశిస్తున్నది. పరిస్థితులను బట్టి స్వల్ప మార్పులు మినహా తొలి వన్డేకు ఎంపికైన తుది జట్టే ఖరారయ్యే అవకాశం ఉంది. అరంగేట్రం కోసం నవ్‌దీప్ సైనీ ఎదురుచూస్తుంటే.. తొలి మ్యాచ్‌లో వరుణుడు దెబ్బ తీసినా ఈ మ్యాచ్‌లోనైనా సత్తా చాటేందుకు అవకాశమొస్తుందని శ్రేయస్ అయ్యర్ నిరీక్షిస్తున్నాడు. వన్డేల్లో విండీస్ తరపున అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచేందుకు క్రిస్ గేల్ అత్యంత సమీపంలో ఉన్నాడు.**

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్ :** విండీస్‌తో తొలి వన్డేలో వినూత్న ప్రణాళికలను అమలు చేయాలనుకున్న ప్రయత్నానికి వరుణుడు గండికొట్టినా... అదే ఉత్సాహంతో రెండో పోరులో అడుగుపెట్టేందుకు టీమ్ఇండియా సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇక్కడి క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో ఆతిథ్య వెస్టిండీస్‌తో రెండో మ్యాచ్‌లో భారత్ ఆదివారం తలపడనుంది. టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన విధంగానే వన్డేల్లోనూ సత్తా చాటాలని కోహ్లీసేన కృత నిశ్చయంతో ఉంది. గురువారం గయానాలోని ప్రావిడెన్స్ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో విండీస్ తొలుత బ్యాటింగ్ చేయగా... 13 ఓవర్లు ముగిసే సరికి వర్షం ఎడతెరిపి లేకుండా పడడంతో ఆ పోరు రద్దయిన విషయం తెలిసిందే. తమ వ్యూహాలు అమలు చేసేందుకు వరుణుడు రెండో వన్డేలోనైనా సహకరించాలని కోహ్లీసేన కోరుకుంటున్నది. సిరీస్‌లో తొలి విజయాన్ని నమోదు చేసి ముందడుగేయాని పట్టుదలతో ఉంది. పరిస్థితులను బట్టి తుది జట్టు కూర్పులోనూ ఒకటి, రెండు మినహా పెద్దమార్పులేమీ ఉండే అవకాశాలు లేవు. నాలుగో స్థానంలో శ్రేయస్ రానుండడం ఖాయంగా కనిపిస్తుండగా.. సైనీ అరంగేట్రంపై ఆసక్తి నెలకొంది. ఇక వెస్టిండీస్ మాత్రం ఈ సిరీస్‌లో సత్తా చాటి గేల్‌కు ఘన వీడ్కోలు పలకాలని పట్టుదలగా ఉంది. హిట్టర్లే ప్రధాన బలంగా బరిలోకి దిగుతున్న ఆ జట్టు.. టీ20 పరాభవానికి బదులు తీర్చుకోవాలని ఆశిస్తున్నది.

**అయ్యర్ ఆరాటం**

విండీస్‌తో టీ20సిరీస్‌కు ఎంపికైనా.. ఒక్క మ్యాచ్‌లోనూ యువ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ చోటు దక్కించుకోలేకపోయాడు. అయితే తొలి వన్డేలో అవకాశమొచ్చినా వరుణుడు బ్యాట్‌పట్టుకోనివ్వలేదు. రెండో వన్డేలోనూ అతడికి తప్పక అవకాశం దక్కనుండడంతో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నాడు. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో అదర గొట్టి ప్రశ్నార్థకంగా ఉన్న మిడిల్‌ఆర్డర్‌లో శాశ్వతంగా పాగా వేసేందుకు మార్గం సుగమం చేసుకోవాలని ఆశిస్తున్నాడు. తొలి వన్డేలో కేఎల్ రాహుల్‌ను మేనేజ్‌మెంట్ బెంచ్‌కే పరిమితం చేయగా.. నాలుగో స్థానంలో అయ్యర్ రాగా, ఈ మ్యాచ్‌లోనూ అదే ఖాయంగా కనిపిస్తున్నది. రోహిత్, ధావన్‌కు రిజర్వ్ ఓపెనర్‌గానే రాహుల్‌ను ఇకపై పరిగణించే అవకాశం ఉంది. విండీస్-ఏతో జరిగిన అనధికార వన్డే సిరీస్‌లో భారత్-ఏ తరపున రెండు అర్ధసెంచరీలతో అయ్యర్ దుమ్ములేపిన విషయం తెలిసిందే.

**విండీస్‌కు కుల్దీప్ గండం**

వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్ ఎప్పటి నుంచో భారత స్పిన్నర్ కుల్దీప్‌ను అంచనా వేయడంలో విఫలమవుతూనే ఉన్నారు. కెరీర్‌లో ఇప్పటి వరకు కరీబియన్ జట్టుపై 10 వన్డేలు ఆడిన కుల్దీప్.. మొత్తం 19వికెట్లు తీశాడు. 4.50 ఎకానమీతో విండీస్ బ్యాట్స్‌మెన్‌ను ముప్పుతిప్పలు పెట్టాడు. మ్యాచ్‌ను గెలవాలంటే మాత్రం కుల్దీప్‌ను కరీబియన్ బ్యాట్స్‌మెన్ దీటుగా ఎదుర్కోకతప్పదు. మరోవైపు వెస్టిండీస్‌కు నాణ్యమైన స్పిన్నర్ కొరత ఉంది. ఇది టీమ్ఇండియాకు కలిసిరానుంది. అయితే రోచ్, కాట్రెల్‌తో ఆతిథ్య జట్టు పేస్ దళం బలంగానే ఉంది.

**ఖలీలా... సైనీయా..**

వెస్టిండీస్‌తో తొలి వన్డేలో అరంగేట్రం చేస్తాడని అందరూ అంచనా వేసిన యువపేసర్ నవ్‌దీప్ సైనీకి ఆ మ్యాచ్‌లో అవకాశం దక్కలేదు. భువనేశ్వర్ కుమార్ తుదిజట్టులో ఉండడంతో అతడికి నిరాశతప్పలేదు. అయితే తొలి మ్యాచ్‌లో చోటు దక్కించుకున్న లెఫ్టార్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్ అంతగా ఆకట్టుకోకపోగా మూడు ఓవర్లకు 27పరుగులు ఇచ్చేశాడు. విండీస్ ఓపెనర్ లూయిస్‌కు పదేపదే షార్ట్‌పిచ్ బంతులు సంధిస్తూ మూల్యం చెల్లించుకున్నాడు. అయితే ఈ మ్యాచ్‌లో కోహ్లీ... సైనీ, ఖలీల్‌ల్లో ఎవరివైపు మొగ్గు చూపుతాడనేది ఆసక్తికరంగా మారింది.

**జాదవ్ నిరూపించుకుంటాడా..**

ప్రపంచకప్‌లో విఫలమైనా... అనూహ్యంగా విండీస్ పర్యటనలో కేదార్ జాదవ్‌కు చోటు దక్కింది. తన ప్రతిభ, హిట్టింగ్ సామర్థ్యంపై రేగిన విమర్శలు, అనుమానాలను పటాపంచలు చేయాలని అతడు పట్టుదలగా ఉన్నాడు. ఎలాగైనా పూర్వ ఫామ్‌ను తెచ్చుకొని జట్టులో స్థానాన్ని పదిలం చేసుకోవాలని భావిస్తున్న అతడిని తొలి మ్యాచ్ రద్దు నిరాశపరించింది. అందునా అతడి స్థానం కోసం శుభ్‌మన్ గిల్ లాంటి యువ టాలెంటెడ్ ఆటగాళ్లు పోటీలో ఉన్నారు. కేదార్ సైడ్‌ఆర్మ్ స్పిన్ బౌలింగ్ జట్టుకు ఉపయోగపడతుందని భావించినా.. జట్టులో జడేజా సహా చాహల్, కుల్దీప్‌లో ఎవరో ఒకరు ఉండడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో జాదవ్ అవసరం జట్టుకు ఎంత వరకు ఉన్నదనే ప్రశ్న తలెత్తుతున్నది. అయితే నిరూపించుకునే అవకాశాన్ని జాదవ్‌కు ఇచ్చేందుకే టీమ్ఇండియా యాజమాన్యం మొగ్గు చూపే అవకాశముంది.

**గేల్ ఈసారైనా..**

13 పరుగులు చేస్తే విండీస్ తరపున వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచే అరుదైన రికార్డు ముంగిట కరీబియన్ విధ్వంస బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్(31 బంతుల్లో 4) తొలి వన్డేలో బోల్తాకొట్టాడు. ముఖ్యంగా అతడి స్లోబ్యాటింగ్ తీవ్రంగా నిరాశపరిచింది. అయితే మిగిలిన రెండు వన్డేల్లో చెలరేగి రికార్డు సృష్టించడం సహా కెరీర్ చరమాంకంలోనూ సత్తా తగ్గలేదని చెప్పి... తన చివరి వన్డే సిరీస్‌కు అదిరే ముగింపు పలకాలని అనుకుంటున్నాడు. మరోవైపు టెస్టు సిరీస్‌తో కెరీర్‌ను ముగిద్దామనుకున్న ఈ కరీబియన్ వీరుడికి సెలెక్టర్లు ఆ అవకాశమివ్వకపోవడంతో ఈ వన్డే సిరీసే గేల్‌కు చివరదయ్యే అవకాశముంది.

రాత్రి 7 నుంచి సోనీ టెన్-1, 3లో

**19**

విండీస్‌పై మరో 19 పరుగులు చేస్తే ఆ దేశంపై అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లీ(1912, 33ఇన్నింగ్స్) రికార్డు సృష్టిస్తాడు. పాక్ మాజీ ఆటగాడు జావెద్ మియాందాద్(1930,64ఇన్నింగ్స్)ను వెనక్కి నెట్టేస్తాడు.



**జట్లు అంచనా**

**భారత్:** కోహ్లీ(కెప్టెన్), రోహిత్, ధవన్, శ్రేయస్ అయ్యర్, కేదార్, పంత్(వికెట్ కీపర్), జడేజా, భువనేశ్వర్, షమీ, ఖలీల్ అహ్మద్, కుల్దీప్

**వెస్టిండీస్:** హోల్డర్(కెప్టెన్), క్రిస్ గేల్, ఎవిన్ లూయి స్, హోప్(వికెట్ కీపర్), హెట్‌మైర్, పూరన్, చేస్, అలెన్, బ్రాత్‌వైట్, కీమర్ రోచ్, కాట్రెల్

**పిచ్, వాతావరణం**

పేస్ కంటే స్పిన్‌కు పిచ్ ఎక్కువగా అనుకూలించే అవకాశం ఉంది. వర్షం ముప్పు తక్కువగానే ఉంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

**6** పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో ఆడిన గత ఆరు మ్యాచ్‌ల్లోనూ టీమ్ఇండియానే విజయం వరించింది.

**9** విండీస్ తరపున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచేందుకు గేల్(10,397) చేయాల్సిన పరుగులు. ఈ మ్యాచ్‌లో 9రన్స్ చేస్తే లారా(10,405)ను ఈ జమైకా వీరుడు అధిగమిస్తాడు.

**300** క్రిస్ గేల్‌కు ఇది 300వ వన్డే మ్యాచ్. బ్రియాన్ లారా(299)ను వెనక్కి నెట్టి విండీస్ తరపున అత్యధిక వన్డేలు ఆడిన బ్యాట్స్‌మెన్‌గా గేల్ రికార్డు సృష్టించనున్నాడు.

## యువ భారత్‌దే సిరీస్

**టరోబా(ట్రినిడాడ్ అండ్ టోబాగో):** వెస్టిండీస్-ఏ జట్టుతో జరిగిన మూడో అనధికారిక టెస్టును భారత్-ఏ 'డ్రా'గా ముగించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన యువ భారత్ మూడు టెస్టుల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో 373 పరుగుల లక్ష్యంతో చివరిదైన నాలుగో రోజు బ్యాటింగ్ కొనసాగించిన విండీస్ ఆటముగిసే సమయానికి 314/6తో నిలిచింది. జెరెమీ సొలొజానో (92), బ్రండన్ కింగ్ (77), సునీల్ అంబ్రీస్ (69) మొండి పట్టుదల కనబర్చడంతో విండీస్ ఆఖరి రోజు ఆసాంతం బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించగలిగింది. భారత బౌలర్లలో షాబాజ్ నదీమ్ 5 వికెట్లు పడగొట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ (204 నాటౌట్) ద్విశతకం.. కెప్టెన్ హనుమ విహారి (118 నాటౌట్) శతకంతో చెలరేగడంతో విండీస్ ముందు భారత్-ఏ భారీ టార్గెట్ విధించగలిగింది.

## గేల్‌కు చుక్కెదురు

స్వదేశంలో భారత్‌తో టెస్టు సిరీస్ ఆడిన అనంతరం క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలనుకున్న వెస్టిండీస్ స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్‌గేల్‌కు ఆ దేశ బోర్డు మొండిచేయి చూపింది. ఈనెల 22 నుంచి జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం శనివారం 13 మందితో కూడిన జట్టును ప్రకటించిన బోర్డు అందులో గేల్‌కు చోటివ్వలేదు. వన్డే ప్రపంచకప్‌కు ముందు ఇదే తన చివరి అంతర్జాతీయ టోర్నీ కావొచ్చన్న గేల్ ఆ తర్వాత మనసు మార్చుకొని స్వదేశంలో భారత్‌తో ఆడాక ఆటకు వీడ్కోలు పలకాలనుకుంటున్నట్లు తన మనసులో మాట బయటపెట్టాడు. అందుకు తగ్గట్లే పరిమిత ఓవర్ల క్రికెట్‌కు గేల్‌ను ఎంపిక చేసినా.. టెస్టులకు మాత్రం అతడిని పరిగణించలేదు. ఐదేండ్ల క్రితం చివరి టెస్టు ఆడిన గేల్‌ను ఎంపిక చేసి యువ ఆటగాళ్లకు తప్పుడు సంకేతాలు ఇవ్వకూడదనుకున్న బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. స్పిన్ ఆల్‌రౌండర్ రాకీమ్ కార్న్‌వాల్ తొలిసారి వెస్టిండీస్ టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు.140 కేజీల బరువు, ఆరున్నర అడుగుల ఎత్తుతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అదరగొట్టిన 26 ఏండ్ల రాకీమ్ టెస్టుల్లోనూ ఆకట్టుకుంటాడని బోర్డు విశ్వాసం వ్యక్తం చేసింది. 'బౌలింగ్ లైనప్‌లో వైవిధ్యం తేవడంతో పాటు లోయర్ ఆర్డర్‌లో పరుగులు చేయగల సత్తా రాకీమ్‌లో ఉంది. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడు మ్యాచ్ విన్నర్‌గా నిరూపించుకున్నాడు' అని సెలక్షన్ కమిటీ చీఫ్ రాబర్ట్ హైనెస్ తెలిపాడు.

## అజయ్ ఠాకూర్ విజృంభణ

### గుజరాత్‌పై తమిళ్ తలైవాస్ విజయం • ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్

**అహ్మదాబాద్:** సొంతగడ్డపై జరిగిన తొలి మ్యాచ్‌లో గుజరాత్ నిరాశ పర్చింది. శనివారం అహ్మదాబాద్ వేదికగా ప్రారంభమైన అంచె పోటీల్లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 28-34తో తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమి పాలైంది. స్టార్ రైడర్ రాహుల్ చౌదరి (4 పాయింట్లు) పెద్దగా ఆకట్టుకోలేకపోయినా.. కెప్టెన్ అజయ్ ఠాకూర్ సత్తాచాటడంతో తలైవాస్ విజయం సాధించింది. 16 రైడ్లు చేసిన అజయ్ 9 పాయింట్లు సాధించగా.. మోహిత్ చిల్లర్ (5 పాయింట్లు), మన్‌జీత్ చిల్లర్ (4 పాయింట్లు)ట్యాక్లింగ్‌లో సత్తాచాటారు. గుజరాత్ తరఫున రోహిత్ గులియా (9 పాయింట్లు), సునీల్ కుమార్ (6 పాయింట్లు) రాణించారు. తలైవాస్‌కు ఇది మూడో విజయం కాగా.. గుజరాత్‌కు మూడో పరాజయం.



**చివర్లో హైడ్రామా**

మ్యాచ్ ఆరంభంలోనే రోహిత్‌ను పట్టేసిన గుజరాత్ తొలి 15 నిమిషాలు ఆధిక్యంలో కొనసాగింది. కీలక దశలో రెండుసార్లు డూ ఆర్ డై రైడ్‌లలో పాయింట్లు సాధించిన అజయ్ ఠాకూర్ తలైవాస్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ఇదే జోరులో ఫార్చ్యూన్ జెయింట్స్ కోర్టు ఖాళీ చేయడంతో అదనపు పాయింట్లు ఖాతాలో చేరి తమిళ్ తలైవాస్ తొలి సగం ముగిసేసరికి 15-10తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. రెండో సగంలో తలైవాస్ పూర్తి ఆధిపత్యం కనబర్చినా.. మరో నాలుగు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. గుజరాత్ 26-25తో ముందంజ వేసింది. ఈ దశలో అజయ్ మరోసారి సూపర్ రైడ్‌తో మూడు పాయింట్లు తేవడంతో తలైవాస్ తిరిగి ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక అక్కడి నుంచి అదే ఊపు కొనసాగించిన తలైవాస్ మ్యాచ్‌ను విజయంతో ముగించింది. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 32-30తో పుణేరీ పల్టన్స్‌పై గెలుపొందింది.

### పంద్రాగస్టు తర్వాతే
## కోచ్ ఎంపిక!

**న్యూఢిల్లీ:** భారత ప్రధాన కోచ్ ఎంపిక ఆగస్టు 15 తర్వాతే జరిగే అవకాశాలున్నాయి. వచ్చిన దరఖాస్తుల్లో నుంచి వడపోసి అర్హులైన సుమారు ఆరుగురికి ఈ నెల 13, 14వ తేదిల్లో ఇంటర్వ్యూలు నిర్వహించాలని ముందు నిర్ణయించినా.. అవసరమైన పత్రాలు సిద్ధంకాని కారణంగా ఆగస్టు 15 తర్వాత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలుస్తున్నది. కపిల్‌దేవ్, అన్షుమన్ గైక్వాడ్, శాంతా రంగస్వామితో కూడిన క్రికెట్ సలహాదారుల కమిటీ (సీఏవో) ఆధ్వర్యంలో కోచ్ ఎంపిక జరుగనుండగా.. అందుకు అవసరమైన ప్రాథమిక ప్రక్రియ పూర్తికాకపోవడంతో కాస్త ఆలస్యమవుతున్నట్లు ఓ అధికారి తెలిపారు. 'ప్రధాన కోచ్ పదవికి వచ్చిన దరఖాస్తుల్లో సుమారు ఆరుగురిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశాం. వారిని పరీక్షించేందుకు ఒకరోజు సరిపోతుంది. కానీ పేపర్ వర్క్ ఇంకా పూర్తి కాలేదు. అందుకు ప్రక్రియ కాస్త ఆలస్యమవుతున్నది' అని ఆయన తెలిపారు.

## ప్రణాళికతో ముందుకొస్తే నిషేధం ఎత్తేస్తాం

### భారత ఆర్చరీ సంఘానికి డబ్ల్యూఏ లేఖ

**న్యూఢిల్లీ:** సమాంతర పాలక మండళ్లను రద్దు చేసుకొని పక్కా ప్రణాళికతో ముందుకొస్తే.. ఈ నెలాఖరులోగా భారత ఆర్చరీ సంఘంపై విధించిన నిషేధం ఎత్తివేసే అవకాశాలున్నాయని ప్రపంచ ఆర్చరీ (డబ్ల్యూఏ) స్పష్టం చేసింది. ఈ మేరకు డబ్ల్యూఏ కార్యదర్శి టామ్ డైలెన్ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) కార్యదర్శి రాజీవ్ మెహతాకు శనివారం లేఖ రాశారు. ఈ ఏడాది జూన్‌లో నిబంధనలకు విరుద్ధంగా భారత ఆర్చరీ సంఘం ఢిల్లీ, చండీగఢ్ కేంద్రాలుగా రెండు ఎన్నికలను నిర్వహించింది. అందులో అర్జున్ ముండా, బీవీ పాపారావు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. దీనిపై ఆగ్రహించిన డబ్ల్యూఏ జూలై ఆఖరు వరకు తుది గడువు ఇచ్చి సమస్య పరిష్కరించుకోమని ఆదేశించింది. ఇరు వర్గాల నుంచి ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో సస్పెన్షన్ వేటు వేసింది. ఈ అంశంపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి రిటైర్డ్ జస్టిస్ బీడీ అహ్మద్ నేతృత్వం వహించనున్నారు.

## సెమీస్‌లో బోపన్న జోడీ




**మాంట్రియల్ (కెనడా):** ఏటీపీ మాస్టర్స్-1000 మాంట్రియల్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)-డెనిస్ షపోవలోవ్ (కెనడా) జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. కెనడా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో అన్‌సీడెడ్ బోపన్న-షపోవలోవ్ ద్వయం శనివారం బెనోయిట్ పెయిర్ (ఫ్రాన్స్)-వావ్రింకా (స్విట్జర్లాండ్) జోడీతో తలపడాల్సిఉండగా.. వావ్రింక జంట వాకోవర్ ఇవ్వడంతో ముందడుగు వేసింది. అంతకుముందు ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జంట 6-3, 6-4తో కైల్ ఎడ్మండ్ (బ్రిటన్)-టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) ద్వయంపై నెగ్గి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం జరుగనున్న సెమీఫైనల్లో బోపన్న జంట రాబిన్ హస్సే-వెస్లే కుల్హోఫ్ (నెదర్లాండ్స్)తో తలపడనుంది.

### ఆసియా వాలీబాల్
## ఫైనల్లో భారత్

**నేపీతా(మయన్మార్):** ఆసియన్ అండర్-23 వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో తొలిసారిగా ఫైనల్ చేరి భారత జట్టు చరిత్ర సృష్టించింది. శనివారమిక్కడ జరిగిన సెమీఫైనల్లో భారత్ 21-25, 25-16, 25-22, 25-18 తేడాతో పాకిస్థాన్‌ను చిత్తుచేసింది. తొలిసారి ఫైనల్ చేరడం సహా... అంతర్జాతీయ పురుషుల అండర్-23 చాంపియన్‌షిప్‌నకు కూడా భారత్ అర్హత సాధించింది.

# అవయవదానం చాలా గొప్పది



సరిత ఆత్మకు శాంతి చేకూరాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన ట్వీట్

**నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన సరిత ఆత్మకు శాంతి చేకూరాలి**

**ట్విట్టర్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



ఎర్రవెల్లి సరిత (ఫైల్)

**ముస్తాబాద్:** రెండ్రోజుల క్రితం ఆకస్మికంగా మృతిచెందిన ఎర్రవెల్లి సరిత అవయవాలను దానంచేయాలని ఆమె కుటుంబ సభ్యులు నిర్ణయించారు. మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపుతున్న సరిత ఆత్మకు శాంతి చేకూరాలని ట్విట్టర్ వేదికగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు ప్రార్థించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన ఎర్రవెల్లి సరిత (42), డాక్టర్ వినయ్‌కుమార్ దంపతులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. శుక్రవారం సరిత అధిక రక్తపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆమెను బంజారాహిల్స్ కేర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఆమె అవయవాలు దానం చేయాలని భర్త డాక్టర్ వినయ్‌కుమార్ నిర్ణయించుకొన్నాడు. సరిత గుండె, మూత్రపిండాలు, కాలేయం, కార్నియాతోపాటు ఇతర అవయవాలను వైద్యులు సేకరించారు. గుండెను కేర్ దవాఖానలో చేరిన 18 ఏండ్ల బాలికకు అమర్చారు. అవయవదానం చేసిన సరిత కుటుంబసభ్యులను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు.



# కృషివిజ్ఞాన కేంద్రంలో హరితహారం

**ఎంపీ సంతోష్‌కుమార్ గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

**బెల్లంపల్లిరూరల్:** తెలంగాణకు హరితహారంలో భాగంగా రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఇటీవల ఇచ్చిన గ్రీన్‌చాలెంజ్‌ను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్వీకరించారు. శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కృషివిజ్ఞాన కేంద్రం పరిసరాల్లో అటవీశాఖ, మండల పరిషత్ అధికారులు, కస్తూర్బా గాంధీ, తెలంగాణ సంక్షేమ బాలుర కళాశాల విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున మొక్కలు నాటారు. ఎంపీ సంతోష్‌కుమార్ అందించిన స్ఫూర్తి మరువలేనిదని చిన్నయ్య కొనియాడారు.

శనివారం బెల్లంపల్లిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య





కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

# వైద్యరంగానికి రోల్‌మోడల్ తెలంగాణ

- మంత్రి ఈటల రాజేందర్

**కరీంనగర్ హెల్త్ :** వైద్యరంగానికి తెలంగాణ రోల్ మాడల్ కానున్నదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన నాలుగో రాష్ట్రస్థాయి ఫిజీషియన్ వైద్యుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏ వ్యాధికైనా ముందుగా ఫిజీషియన్ వైద్యుడే రోగాన్ని గుర్తించి స్పెషలిస్టులకు రెఫర్ చేస్తారని మంత్రి పేర్కొన్నారు. వైద్యో నారాయణ హరి అన్న నానుడిని నిజం చేయాలని కోరారు. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య 65 శాతం పెరిగిందనీ, అందులోనూ సాధారణ ప్రసవాలు ఎ క్కువగా జరగడం శుభ పరిణామమన్నారు. అనంతర సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పాలికర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డీసీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణపై కేంద్రం చిన్నచూపు

- ఎంపీ నామా నాగేశ్వరరావు



**మామిళ్లగూడెం:** తెలంగాణ సమస్యలపై కేంద్రం చిన్నచూపు చూస్తున్నదనీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని టీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం టీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో ప్రపంచం హర్షించే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి సంఘాలు, కమిటీలు ప్రాజెక్టును అభినందించడం తప్పా పైసా నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. కాళేశ్వరం సందర్శనకు పార్లమెంటులో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను ఆహ్వానించామన్నారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగూడెం కేంద్రంగా మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రానికి బడ్జెట్‌లో ప్రకటించిన రైల్వే లైన్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. దేశ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆర్టికల్ 370 కశ్మీర్ బిల్లుకు మద్దతు తెలిపామన్నారు. జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు, మేయర్ పాపాలాల్, వితనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోరోజు 804 మందికి పరీక్షలు

- చింతమడకలో కొనసాగుతున్న వైద్య శిబిరం

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ :** సిద్దిపేట జిల్లా చింతమడకలో వైద్య శిబిరంలో ఆరో రోజు 804 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. శనివారం వైద్యశిబిరాన్ని యశోద దవాఖాన మెడికల్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ లలితారెడ్డి సందర్శించి, పరీక్షల తీరును పరిశీలించారు. యశోద గ్రూప్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో అమర్‌సింగ్, గడా వైద్యాధికారి, వైద్య శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ కాశీనాథ్, ఆర్బీఎస్కే జిల్లా కో-ఆర్డినేటర్ చక్రధర్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

# కాళేశ్వరంతో సస్యశ్యామలం

**రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం కేసీఆర్**

**దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి**

**ఎల్లంపల్లిపై కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారాలు**

**సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**వైభవంగా కాళేశ్వర జలజాతర**





మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద గోదావరికి దండం పెడుతున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, బాల్క సుమన్.. జలజాతరకు తరలివచ్చిన జనం

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వర జలాలతో మంచిర్యాల జిల్లాను సస్యశ్యామలం చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఎల్లంపల్లి ప్రాజెక్టుపై నిర్వహించిన 'ఎల్లంపల్లి–కాళేశ్వరం జలజాతర'కు మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంటి వెంకటేశ్‌నేతకాని, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, జెడ్పీ చైర్‌పర్సన్లు నల్లాల భాగ్యలక్ష్మి, కోవ లక్ష్మి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంతోపాటు, 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజానీకం ముఖ్యంగా రైతులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారన్నారు. కేసీఆర్ పాలనలో ఎక్కడా కరువు కాటకాలు ఏర్పడలేదన్నారు. గోదావరి నుంచి సముద్రంలో వృథాగా పోతున్న నీటికి నడకలు నేర్పిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు.

**ఎల్లంపల్లిపై తప్పుడు ప్రచారం తగదు..**

ఎల్లంపల్లి ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. ఒకసారి కాళేశ్వరం ప్రాజెక్టు చూస్తే బాగుంటుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనీ, ప్రజలు వాటిని నమ్మవద్దన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాల వల్లే ప్రజలు వారిని ఎన్నికల్లో తరిమికొట్టారని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ ప్రాజెక్టులోని సగభాగం రైతులకు సాగు నీరు అందుతుందున్నారు. సీఎం కేసీఆర్ కోటి ఎకరాలకు సాగు నీరందిస్తానని ఇచ్చిన మాట మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, మాజీ విప్ నల్లాల ఓదెలు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ అత్తి సరోజ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ చొరవతో స్వగ్రామానికి..

- తంగళ్లపల్లికి చేరిన పోచయ్య భౌతికకాయం
- ఆరునెలల క్రితం సౌదీలో మృతి



పోచయ్య (ఫైల్)

**సిరిసిల్ల రూరల్:** ఉపాధి కోసం సౌదీ అరేబియాలో వెళ్లిన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన బూడిద పోచయ్య(50) ఆరునెలల క్రితం మరణించగా.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక చొరవతో ఆయన మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. బూడిద పోచయ్య 25 ఏండ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. రెండేండ్లకోసారి స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న పనిచేసే చోట హఠాన్మరణం చెందాడు. పోచయ్య మృతి చెందినా మూడు నెలల వరకు కుటుంబసభ్యులకు సమాచారం అందలేదు. ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబ సభ్యులు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కేటీఆర్.. తెలంగాణ ఎన్ఆర్ఐ సెల్ సెక్రటరీకి లేఖ రాసి, ఎంబీసీకి సమాచారం అందించారు. కాగా అక్కడి కంపెనీ యజమాని మరణించడంతో అతడి కొడుకు పోచయ్య మృతదేహం అప్పగింతపై చేతులెత్తేశారు. దీంతో న్యాయ స్థానంలో యాజమాన్యంపై కేసు వేశారు. సౌదీ ప్రభుత్వం స్పందించి విచారణ చేయించగా, మృతదేహం వద్ద రెండు పాస్‌పోర్టు ఫొటోలు లభ్యమయ్యాయి. వాటిని కుటుంబ సభ్యులకు సమాచారం అందివ్వగా, పోచయ్యగా గుర్తించారు. మృతిపై అనుమానాలు లేవని, కొడుకు లవణ్ కుమార్, అల్లుడు తిరుపతి, భార్యతో లిఖిత పూర్వకంగా అఫిడవిట్‌ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. తర్వాత వేగవంతంగా భారత ఎంబీసీ ఎన్‌వోసీ జారీ చేసింది. వెంటనే మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించాలని ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎంబీసీ హైకమిషనర్ ద్వారా మృతదేహం తరలింపునకు అయ్యే ఖర్చులను చెల్లించింది. దీంతో శనివారం ఉదయం అతని మృతదేహం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా, అక్కడి నుంచి తంగళ్లపల్లికి తీసుకొచ్చారు. మృతదేహం స్వగ్రామానికి త్వరగా చేరేలా చొరవ తీసుకున్నందుకు ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనితతోపాటు ప్రజాప్రతినిధులు తదితరులు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# వివేక్.. ఓ తుగ్లక్

- మీ తండ్రి విగ్రహం ట్యాంక్‌బండ్ మీద పెట్టడమే తప్పా?
- సీఎంను అనేంత సిపాయివేం కాదు
- చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'మాజీ ఎంపీ వివేక్ ఓ తుగ్లక్.. ఆయన గురించి ఆయనే ఎక్కువగా ఊహించుకుంటున్నారు. సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయీ, అర్హతా వివేక్‌కు లేదు' అని చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద శనివారం నిర్వహించిన కాళేశ్వర జల జాతరలో పాల్గొన్న బాల్క సుమన్ మాట్లాడుతూ.. 'మీ తండ్రి విగ్రహం ట్యాంక్‌బండ్ మీద పెట్టడమే తుగ్లక్ చర్యనా..? నువ్వు సీఎంను అనేంత సిపాయివేం కాదు' అని విమర్శించారు. '2012కు ముందు కాంగ్రెస్.. ఆ తర్వాత టీఆర్ఎస్, మళ్లీ కాంగ్రెస్, తిరిగి టీఆర్ఎస్, ఇప్పుడు బీజేపీ ఇలా పార్టీలు మారిన నీవు ప్రజలకు ఏం మేలు చేశావ్?, దశాబ్దాలపాటు పెద్దపల్లి ప్రాంతంలో రాజకీయాలు చేసిన నీ కుటుంబం ఈ ప్రాంతానికి ఏం చేసిందో చెప్పాలి?' అని డిమాండ్ చేశారు. కేసీఆర్ గురించి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో 13 జిల్లాల్లో, 106 మండలాలు, 45 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. రైతు కుటుంబాల్లో ఆనందం నింపాలనే తపనతోనే ముఖ్యమంత్రి ప్రాజెక్టుల రీడిజైనింగ్ చేశారని స్పష్టం చేశారు.

# ఆశలు రేకెత్తించిన వానలు

- రాష్ట్రంలో సాధారణ స్థాయికి మించి వర్షాలు
- ఉత్తర తెలంగాణలో అధికం.. దక్షిణాదిలో లోటు
- కుమ్రంభీమ్ జిల్లాలో అత్యధికం.. నల్లగొండలో అత్యల్పం
- మరో మూడు రోజులు తేలికపాటి వానలు

**ప్రత్యేకప్రతినిధి,నమస్తే తెలంగాణ :** గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురిసిన వర్షాలు అన్నదాతల్లో ఆశలు రేకెత్తించాయి. మొన్నటివరకు 15 శాతం లోటుగా ఉన్న వర్షపాతం సాధారణ స్థాయిని మించింది. లోటును దాటి 3 శాతం అధికంగా నమోదైంది. వరుసగా ఏర్పడుతున్న ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాల ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. జూన్ నుంచి జూలై 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటు 462 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 447.7 మి.మీటర్లు కురిసింది. ఆ తరువాత నుంచి ఇప్పటివరకు సగటు కంటే 3 శాతం అధికంగా వర్షాలు కురవడం విశేషం. ఉత్తర తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 43 శాతం అధిక వర్షపాతం నమోదైంది. వరంగల్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. దక్షిణ తెలంగాణలో సగటు కంటే తక్కువ వర్షాలు కురిశాయి.

**జిల్లాల వారీగా ఇలా..**

ఆదిలాబాద్‌లో సాధారణ వర్షపాతం 619.4 మిల్లీమీటర్లు కాగా సగటుకంటే 18 శాతం ఎక్కువగా 728.7 మిల్లీమీటర్లు నమోదైంది. కొత్తగూడెంలో 560.6 మి.మీటర్లకు 624, హైదరాబాద్‌లో 343.3 మి.మీటర్లకు 297.4 మి.మీ. వర్షం కురిసింది. జయశంకర్ భూపాలపల్లిలో 724.2కు 871.3 మి.మీ., జగిత్యాలలో 499.7కు 613.4 మి.మీ. నమోదైంది. జనగామలో సగటు 444.8 మి.మీలు కాగా 471.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. జోగులాంబ గద్వాలలో 254.3 మి.మీ. కాగా 166.5 మి.మీ.గా నమోదైంది. కామారెడ్డిలో 506.5కు 573.1 మి.మీ., కరీంనగర్ 428.8 మి.మీ. కాగా 568.9 మి.మీ. వర్షం కురిసింది. ఖమ్మంలో 478.1కు 369.2 మి.మీ. కురిసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ 564 కాగా 808.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. మేడ్చల్‌లో 374కు 384.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్‌లో 497.3కు 504.8 మి.మీ., మహబూబ్‌నగర్‌లో 298.7కు 262.7మి.మీ., మంచిర్యాలలో 570.2కు 587.6 మి.మీ., మెదక్‌లో 440.2కు 423.7మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ సగటు 282 కాగా 273.5మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

**మరో మూడు రోజులు తేలికపాటి వానలు**

దక్షిణ ఆంధ్రప్రదేశ్ దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 7.6 కి.మీ. ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఉత్తర బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. వాయవ్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఈనెల 12న అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నదని, దీని ప్రభావం తెలంగాణపై పెద్దగా ఉండదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వచ్చే మూడు రోజులపాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు. నాలుగు రోజుల తర్వాత రుతుపవనాలు మళ్లీ బలపడే పరిస్థితులున్నాయని వారు పేర్కొన్నారు.

# పసుపు బోర్డుపై బీజేపీ కుట్ర

- డిమాండ్‌ను నీరు గార్చేలా చర్యలు
- రైతుల నోటే వద్దనిపించే పన్నాగం
- పక్కా స్కెచ్‌తో రైతులతో సమావేశం
- బీజేపీ నయా నాటకం.. రైతుల్లో అసంతృప్తి



**నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి:** పసుపు బోర్డు డిమాండ్‌ను నీరు గార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలను కొనసాగిస్తున్నదని పసుపు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పసుపు బోర్డు అవసరం లేదని రైతులతోనే అనిపించేలా ప్రణాళికలు చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొన్న ఢిల్లీలో సమావేశం పేరిట ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన కుతంత్రం మరువక ముందే.. తాజాగా నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో పసుపు పరిశోధనా స్థానంలో రైతుల అభిప్రాయాలు తెలుసుకునే పేరిట సమావేశం నిర్వహించి నయా నాటకానికి తెరతీశారంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు ఏర్పాటు వ్యవహారంలో తమ వైఖరిని స్పష్టం చేయాలని, ఐదు రోజుల్లో పసుపు బోర్డు అన్న మాటను ఏం చేశావని రైతులు ఇదివరకే నిలదీశారు. పసుపు బోర్డుతోనే సమస్యలు తీరుతాయని ఘంటాపథంగా పునరుద్ఘాటిస్తున్నారు. బోర్డు ఏర్పాటుపై ఈనెల 15లోగా కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయాలని, లేదంటే మరోసారి ఉద్యమిస్తామని రైతులు, ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు స్పష్టం చేశారు. దీని సారాంశమంతా పసుపు బోర్డుపై కేంద్రం గానీ, ఎంపీ అర్వింద్ గానీ మాట తప్పినా.. కాలయాపనతో డిమాండ్‌ను నీరుగార్చే యత్నం చేసినా సహించేది లేదనే సంకేతాలు ఇప్పటికే ఇందూరు పసుపు రైతుల నుంచి వచ్చాయి.

**బీజేపీ నయా నాటకం..**

పసుపు రైతుల సమస్యలపై వారి అభిప్రాయాలను సేకరించడమే అధికారుల లక్ష్యమైతే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టుగా ముందుగా సమాచారం ఎందుకు ఇవ్వలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నపలంగా సమావేశం నిర్వహించి బీజేపీ అనుకూల రైతులతో పసుపు బోర్డుతో పెద్దగా ఉపయోగం లేదని చెప్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశానికి హాజరైన ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు అన్వేష్‌రెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి మాత్రం బోర్డు ఇవ్వాలని అధికారులకు గుర్తు చేశారు. కానీ లోక్‌సభ ఎన్నికల సమయంలో రైతులతో రోడ్లపై బైటాయించిన నాయకుడు ముత్యాల మనోహర్‌రెడ్డి మాత్రం నోరే విప్పకపోవడం గమనార్హం. పసుపు బోర్డు వచ్చే దాకా చెప్పులు వేసుకోనని శపథం చేసిన మనోహర్‌రెడ్డి కేంద్ర కమిషనర్ ముందు రైతుల మధ్య పసుపు బోర్డు కావాలని ఎందుకు అడగ లేదనే విమర్శలు బాహాటంగానే వినిపించాయి. సమావేశంలో స్వయంగా బీజేపీ నాయకుడైన ఆర్మూర్ మండలం మంథనికి చెందిన భూమారెడ్డి పసుపు బోర్డు వచ్చినా సరే రాకున్నా సరే, మద్దతు ఉంటే చాలు అని మాట్లాడటం బోర్డు డిమాండ్‌ను నీరు గార్చేలా బీజేపీ ప్రభుత్వం.. అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నదనే అనుమానాలకు బలం చేకూర్చిందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. బోర్డు ఏర్పాటు విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి బయటపడుతుందని పలువురు మండిపడుతున్నారు.

# కశ్మీర్ సరిహద్దులో జవాన్లకు చిక్కిన కోరుట్ల వాసి



పంజాబ్ పోలీసుల అదుపులో అబ్దుల్ మహ్మద్

**కోరుట్లటౌన్:** మూడేళ్ల క్రితం జాడ లేకుండా పోయిన కోరుట్లకు చెందిన అబ్దుల్ మహ్మద్ (62) మూడు రోజుల క్రితం పాకిస్తాన్ – కశ్మీర్ బోర్డర్‌లో జవాన్లకు చిక్కిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన అబ్దుల్ మహ్మద్ 2015లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రెండేళ్లుగా ఆయన కోసం ఎదురుచూసిన కుటుంబసభ్యులు 2017లో కోరుట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు నేపథ్యంలో బీఎస్ఎఫ్ జవాన్లు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మహ్మద్‌ను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడిని కోరుట్లకు చెందిన వ్యక్తిగా గుర్తించిన పోలీసులు పంజాబ్‌లోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమాచారాన్ని కోరుట్ల పోలీసులకు అందించి వివరాలు సేకరించారు. రెండు రోజుల క్రితం అబ్దుల్ మహ్మద్ కుమారులు పంజాబ్ వెళ్లి అతడిని కోరుట్లకు తీసుకువచ్చినట్లు తెలిసింది. కాగా అబ్దుల్ మహ్మద్‌కు మతిస్థిమితం సరిగా లేదని సమాచారం.

## అప్పుల బాధ తాళలేక గోదారిలోకి దూకిన వ్యక్తి

**రక్షించిన పోలీసులు**

**ఫెర్టిలైజర్‌సిటీ:** అప్పుల బాధతో ఓ వ్యక్తి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించగా, సమాచారం అందుకున్న రామగుండ కమిషనరేట్ పోలీసులు అతన్ని రక్షించారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన రాసపల్లి రాజమౌళి(55) మేడిపల్లిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల అప్పులు పెరగడంతో జీవితంపై విరక్తితో రాజమౌళి శనివారం సాయంత్రం గోదావరిలో దూకాడు. అయితే రాజమౌళి బ్రిడ్జి ఫిల్లర్లకు ఉన్న ఇనుప చువ్వలు తట్టుకొని మునగకుండా ఉన్నాడు. అక్కడే ఉన్న సందర్శకులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వన్‌టౌన్ సీఐ రమేశ్ టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ రమేశ్ బాబు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి జాలర్ల సాయంతో రాజమౌళిని రక్షించారు.

# ఎల్‌బ్రుస్ అధిరోహించిన కరీంనగర్ వాసి



జాతీయ జెండాతో మహిపాల్‌రెడ్డి

**కరీంనగర్‌స్పోర్ట్స్ :** యూరప్ ఖండంలోని అతి ఎత్తైన ఎల్‌బ్రుస్ పర్వతాన్ని కరీంనగర్‌కు చెందిన ఎక్సైజ్, ప్రొహిబిషన్ కానిస్టేబుల్ లెంకల మహిపాల్‌రెడ్డి అధిరోహించారు. ఈమేరకు 5,642 మీటర్ల ఎత్తైన వాల్కొనో ఎల్‌బ్రుస్‌ను విజయవంతంగా అధిరోహించినట్టు ఈ నెల 8న సర్టిఫికెట్‌ను అందుకున్నారు. పర్వతారోహణ అనంతరం మహిపాల్‌రెడ్డి జాతీయ పతాకం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ లోగోతో ఉన్న జెండాను ఆవిష్కరించాడు. కాగా, ఆయన ఇంతకుముందే కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. ప్రొహిబిషన్, అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నుంచి రెండు పర్వత శిఖరాలను అధిరోహించిన మొదటి వ్యక్తిగా లెంకల మహిపాల్‌రెడ్డి రికార్డు సృష్టించినట్టు అధికారులు పేర్కొన్నారు.

# విద్యుదాఘాతంతో తల్లీకొడుకు మృతి

**లింగంపేట :** పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్న తల్లీకొడుకులు విద్యుదాఘాతంతో దుర్మరణం చెందారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కృష్ణాజివాడికి చెందిన జంగం అనసూయ, నరేశ్ శనివారం పత్తికి మందు పిచికారీ చేసి, ఇంటికి వస్తున్న సమయంలో వీరి పొలం పక్కనే ఉన్న రాజేందర్ మక్కచేనుకు ఏర్పాటు చేసిన విద్యుత్‌కంచె తగిలి అక్కడికక్కడే మృతి చెందారు.

# యువకుడిపై చిరుతదాడి



గాయపడిన కిరణ్

**అమ్రాబాద్:** శ్రీశైలం ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన వ్యక్తిపై చిరుత దాడి చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన ఆరుగురు శ్రీశైలం ప్రాజెక్టును చూసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో అమ్రాబాద్ మండలం మన్ననూర్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలో శ్రీశైలం వెళ్లే రహదారిలో స్పీడు బ్రేకర్ వద్ద ఆటో నెమ్మదిగా వెళుతుండగా, అడవిలో నుంచి అకస్మాత్తుగా చిరుత వచ్చి ఆటోలో ఉన్న కిరణ్ తలపై పంజాతో కొట్టి అడవిలోకి వెళ్లింది. చిరుత దాడితో ఆటోలో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన కిరణ్‌ను మన్ననూర్ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు.

# అదనపు కట్నం కోసం వేధించిన ఎస్సైపై కేసు

**లక్షెట్టిపేట :** అదనపు కట్నం కోసం భార్యను వేధించిన ఓ రిజర్వ్‌డ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై శనివారం కేసు నమోదైంది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట ఎస్సై మధుసూదన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. లక్షెట్టిపేట పట్టణానికి చెందిన అవంతికకు హైదరాబాద్‌కు చెందిన పూనెం శ్రీనివాస్‌తో 2018లో వివాహం జరిగింది. వివాహనంతరం ఆరునెలల తర్వాత రూ.5 లక్షల అదనపు కట్నం తీసుకురమ్మని తన భర్త వేధించినట్టు అవంతిక ఫిర్యాదులో పేర్కొన్నది. శ్రీనివాస్ ప్రస్తుతం 17వ బెటాలియన్ సిరిసిల్లలో రిజర్వుడు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ
కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

## మా మాట!

### ప్రభుత్వ సంస్కరణలు భేష్



రైతు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న రెవెన్యూశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరమున్నది. ఇందుకు ప్రభుత్వం తీసుకొంటున్న నూతన సంస్కరణలను అందరూ స్వాగతించాలి. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యపు వైఖరిని పోగొట్టేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకోవడం శుభపరిణామం. ఇప్పటికే ధర్మగంట ద్వారా చాలామంది రైతులకు ఉన్న భూసమస్యలు తీరాయి. రైతులకు అవినీతి అధికారులను దూరం చేయాలనే సదుదేశంతో పనిచేస్తున్న సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి.

**- రాపోలు యాదగిరి, వేములపల్లి, నల్లగొండ జిల్లా**

### కొండంత అండ



భూసమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారికి 'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట' కొండంత అండగా నిలిచింది. ఇందులో ప్రచురితమవుతున్న కథనాలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపుతుండటం సంతోషంగా ఉన్నది. సీఎం కేసీఆర్ తలపెట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో చాలా వరకు సమస్యలు తీరాయి. అవినీతి అంతంకావాలంటే రెవెన్యూశాఖను ప్రక్షాళనచేయాల్సిందే.

**- గోవిందు, నందికొండ, నల్లగొండ జిల్లా**

### రెవెన్యూ ప్రక్షాళన అవసరం

రెవెన్యూశాఖలో అవినీతి పోవాలంటే తక్షణమే ప్రక్షాళనచేయాలి. స్థానిక రెవెన్యూ అధికారులు ఏ చిన్న పనిచేయాలన్నా పైసలు ఇవ్వనిదే ఫైల్ కదిలించని పరిస్థితికి దిగజారారు. అనేక ఏండ్లు ఇదే పరిస్థితి. ప్రాంతాన్ని బట్టి ఎకరానికి ఇంత ఇస్తేనే పనిచేస్తామని చెప్పడం మరీ దారుణం. కడుపు కట్టుకొని ఎండనక, వాననకు, చలి అనక కష్టించి పని చేసి దేశానికి అన్నంపెట్టే రైతన్నను ఇబ్బందుల పాలుచేయడం సరికాదు. రైతుల బాధలు గుర్తించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రెవెన్యూశాఖ ప్రక్షాళనకు పూనుకోవడం చాలా సంతోషం. వీలైనంత త్వరగా ఈ పనిచేసి అన్నదాతలకు మేలుచేయాలి.

**- మురళీమనోహర్, హైదరాబాద్**

# ఐదెకరాల ఆసామిని.. 92 ఎకరాల భూస్వామిని చేశారు

**ఐదెకరాల సామాన్య ఆసామిని 92 ఎకరాల భూస్వామిని చేశారు రంగారెడ్డి జిల్లా కేశంపేట రెవెన్యూ అధికారులు. రైతుకు సుమారు 87 ఎకరాలు బోనస్‌గా ఇచ్చారు. లేని భూమిని రికార్డుల్లో సృష్టించారు. రికార్డుల ప్రకారం భూములను ఆన్‌లైన్ చేయాల్సిన అధికారులు ఇష్టమొచ్చినట్టుగా వ్యవహరించారు. కేశంపేట మండలం మీనమోనిపల్లి రైతుకు అంకెలగారడీ చూపించి.. రైతుబంధు సాయానికి దూరంచేశారు. అక్రమాస్తుల కేసులో జైలుకెళ్లిన లావణ్య.. తాసిల్దార్‌గా ఉన్న సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.**

- రంగారెడ్డి జిల్లా కేశంపేటలో రెవెన్యూ అధికారుల నిర్వాకం
- లేని భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించారు
- ఉన్నది ఐదెకరాల 39.50 గుంటలు.. ఆన్‌లైన్‌లో 92 ఎకరాలు
- పంటపెట్టుబడి సాయం అందక అన్నదాత ఆందోళన

**కేశంపేట:** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం చౌలపల్లి గ్రామ పరిధిలోని మీనమోనిపల్లికి చెందిన ఆనపోసల బుచ్చయ్య అనే రైతుకు సర్వే నంబర్లు 52, 53, 57, 58, 62, 63లలో ఐదెకరాల 39.50 గుంటల వారసత్వ భూమి ఉన్నది. పాత పట్టాదారు పాస్ పుస్తకాలతోపాటు రికార్డుల్లో భూమి సరిగ్గానే ఉన్నా ఇటీవల ఆన్‌లైన్‌చేసే క్రమంలో అధికారులు సర్వే నంబర్ 52లో బుచ్చయ్య పేరిట ఉన్న ఎకరంతోపాటు మరో 86 ఎకరాల 28 గుంటలను అదనంగా ఆన్‌లైన్‌లో ఎక్కించారు. దీంతో రైతు 5.39 ఎకరాల నుంచి సుమారు 92 ఎకరాలకు పట్టాదారైపోయారు. వాస్తవానికి 52 సర్వే నంబర్‌లో 19 ఎకరాల భూమి ఉన్నది. ఆ భూమికి సరిపడా పట్టాదార్లు ఉన్నారు. బుచ్చయ్య పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కిన 86 ఎకరాల 28 గుంటల భూమి లేనే లేదు. గత మార్చిలో బ్యాంకులో లోను కోసం బుచ్చయ్య ఆన్‌లైన్‌లో ఆర్వోఆర్ తీసుకోగా ఈ విషయం తెలిసింది. రైతు వెంటనే అప్పటి తాసిల్దార్ లావణ్య, వీఆర్వో రాములును సంప్రదించగా.. అదనంగా ఎక్కిన భూమిని సరి చేస్తామని బుజ్జగించారు. బుచ్చయ్య రోజు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఐదు నుంచి పదెకరాల భూమి ఉన్న రైతులకు మొదటగా పంట సహాయాన్ని బ్యాంకులో జమచేసింది. ఐదు నుంచి 92 ఎకరాల భూమికి యజమానిగా మారిన బుచ్చయ్య వాస్తవ భూమికి పెట్టుబడిసాయం అందలేదు.



బాధిత రైతు బుచ్చయ్య

### అధికారుల నిర్లక్ష్యానికి బలయ్యాను

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి లేని భూమిని అంటగట్టిన అధికారుల వల్లే నాకు పంటసాయం రాకుండా పోయింది. పెట్టుబడి కోసం నానా అవస్థలు పడ్డాను. జరిగిన తప్పును సరిచేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ నెలల తరబడి తిరిగినా ఫలితం లేక పోయింది. ఆర్థిక స్థోమతలేని నాకు పంటసాయం రాకుండాచేసిన తాసిల్దార్ లావణ్య, వీఆర్వో రాములుపై చర్య తీసుకొని న్యాయంచేయాలి.

**- ఆనపోసల బుచ్చయ్య, రైతు, మీనమోనిపల్లి, కేశంపేట మండలం**

### అదనపు భూమిని తొలగిస్తాం

బుచ్చయ్య పేరిట ఆన్‌లైన్‌లో అదనంగా ఎక్కిన 86 ఎకరాల భూమిని తొలగించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడాం. ఆ భూమికి సంబంధించిన వివరాలను ఆర్డీవో లాగిన్‌లో పెట్టాం. అనుమతులు రాగానే ఎక్కువగా ఉన్న భూమిని రైతు ఖాతా నుంచి తొలగిస్తాం. అదనంగా ఆన్‌లైన్‌లో ఎక్కిన భూమికి పంటసాయం ఇవ్వకూడదని వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేశాం. రైతుకు వాస్తవంగా ఉన్న ఐదెకరాల 39.50 గుంటల భూమికి రావాల్సిన పంటసాయం గురించి ఉన్నతాధికారులతో మాట్లాడుతాం.

**- ఆంజనేయులు, కేశంపేట తాసిల్దార్**

# తప్పుడు సర్వేతో భూమికి ఎసరు

- వేరొకరికి భూమి బదలాయించేందుకు అధికారుల యత్నం
- రైతుకు నోటీసు జారీచేసిన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం తాసిల్దార్
- న్యాయం చేయాలంటున్న బాలప్పేట బాధితుడు

**రఘునాథపాలెం:** ఖమ్మం నగరం బాలప్పేట గ్రామానికి చెందిన బోయపాటి వెంకటేశ్వరరావుకు రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 207/ఆ/1లో తాత నుంచి వారసత్వంగా వచ్చిన ఐదెకరాల పట్టా భూమి ఉన్నది. ఆ భూమిని 1984లో రిజిస్ట్రేషన్ (2139/1984డాక్యుమెంట్ నంబర్) సైతం చేయించుకొన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులను కలిసి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. రికార్డులు పరిశీలించిన అధికారులు సదరు ఐదెకరాల భూమికి వెంకటేశ్వరరావును పట్టాదారుగా చేర్చారు. 35 ఏండ్లుగా వెంకటేశ్వర్లు ఆ భూమిని సాగుచేసుకొంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూలై 7న రెవెన్యూ అధికారులు వెంకటేశ్వర్లుకు నోటీసు జారీచేశారు. 'మీరు సాగుచేస్తున్న భూమిలో 26 గుంటలు వరదబోయిన చిన్న నాగేశ్వరరావుకు సంబంధించినది.. కాబట్టి అతని పేరిట రికార్డులు నమోదుచేస్తున్నాం' అని ఆ నోటీసులో పేర్కొన్నారు. నోటీసును చదివిన వెంకటేశ్వరరావు అవాక్కయ్యారు. తన వద్ద ఉన్న పత్రాలన్నింటినీ తీసుకొని వెంటనే తాసిల్దార్ శ్రీనివాసరావును కలిశారు. వాటిని పరిశీలించిన తాసిల్దార్ 'ఇవేవీ పనిచేయవు.. వరదబోయిన నాగేశ్వరరావు పెట్టుకొన్న అర్జీ మేరకు చేసిన సర్వేలో నీవు సాగు చేస్తున్న భూమిలో 26 గుంటలు అతనిదని తేలింది. ఆ భూమిని అతడికే పట్టా చేస్తున్నాం' అని తేల్చి చెప్పారని బాధిత రైతు వాపోయారు. నాగేశ్వర్‌రావు తప్పుడు పత్రాలతో తనకు అప్పటికే ఉన్న భూమికి అదనంగా 26 గుంటలు రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారని వెంకటేశ్వరరావు చెప్పినా తాసిల్దార్ ఖాతరుచేయలేదు. దీంతో చేసేదిలేక బాధిత రైతు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. భూసర్వే సమయంలో తమకు ఎలాంటి నోటీసు సైతం ఇవ్వలేదని, తప్పుడు సర్వేచేసేందుకు సర్వేయర్ వెంకటరత్నం లంచం తీసుకొన్నారని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఉన్నతస్థాయి సర్వే కోసం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌కు అర్జీ పెట్టుకొన్నామన్నారు. మండల పరిధిలోని మంచుకొండ గ్రామ రెవెన్యూ పరిధికి చెందిన మరో రైతు విషయంలోనూ ఈ సర్వేయర్ ఇదే రీతిలో తప్పుడు సర్వే చేశారని ఆరోపించారు.



బాధిత రైతు వెంకటేశ్వరరావు

# నా భూమి ఇప్పించండి

### భూపాలపల్లి జిల్లా రంగయ్యపల్లివాసి చిలువేరు పెద్దులు



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నా పేరు చిలువేరు పెద్దులు. మాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామం. నాకు మండలంలోని దమ్మన్నపేట శివారులో సర్వే నంబర్ 155/53లో 1.10 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. 30 ఏండ్ల నుంచి ఈ భూమిలో నేను కాస్తులో ఉన్నాను. గత ఏడాది ఈ భూమి తమ పేరుతో పట్టా అయిందంటూ రాజు అనే వ్యక్తి వచ్చి నన్ను అడ్డుకొన్నారు. దీంతో నేను తాసిల్దార్‌కు మొరపెట్టుకొన్నాను. నా భూమి వివాదంలో ఉన్నదంటూ తాసిల్దార్ చేతులు దులుపుకొన్నారు. సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు. భూమికి సంబంధించిన పహాణీ, ఇతర వివరాలు తాసిల్దార్‌కు అందజేసినా.. పట్టించుకోవడం లేదు. పంట వేసుకోవడానికి ప్రయత్నిస్తే రాజు నన్ను బెదిరిస్తున్నారు. ఇప్పుడు ఆ భూమిలో వ్యవసాయం చేసుకోవద్దంటే ఎక్కడికి వెళ్లాలి. నాకు దిక్కెవరు.

### సర్వేచేసి తేలుస్తాం

చిలువేరి పెద్దులు కాస్తులో ఉన్నమాట వాస్తవమే. అయితే, ఆ భూమి వేరొకరి పేరుతో పట్టా అయినట్టు తెలిసింది. ఆ భూమికి సరిహద్దుల్లో ఉన్న రైతులకు నోటీసులు ఇచ్చి సర్వేచేయిస్తాం. పెద్దులు చూపుతున్న సర్వే నంబర్‌లోని భూమి ఎక్కడుందో తేల్చుతాం. డిప్యుటేషన్‌పై అధికారులు వెళ్లడం వల్ల సర్వే చేయించడం ఆలస్యమవుతున్నది. రెండ్రోజుల క్రితం పెద్దులు తన భూమి సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు పెట్టుకొన్నారు.

**- శ్రీనివాసాచారి, రేగొండ తాసిల్దార్**



మహబూబాబాద్ జిల్లా శనిగపురం నుంచి పర్వతగిరికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం

# హరితశోభితం

- నాలుగువిడుతల్లో నాటిన మొక్కలు 3 కోట్లు
- ఐదోవిడుత లక్ష్యం 2.48 కోట్లు..
- మహబూబాబాద్ జిల్లాలో హరితఫలాలు

హరిత చైతన్యం

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** హరిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర సర్కారు అమలుచేస్తున్న హరితహారం కార్యక్రమం సత్ఫలితాలిస్తున్నది. మహబూబాబాద్ జిల్లా హరితమయంగా మారుతున్నది. జిల్లావ్యాప్తంగా మొదటి, రెండోవిడుత హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఆకట్టుకుంటున్నాయి. ఐదోవిడుత హరితహారంలో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా నాలుగువిడుతల్లో కలిపి సుమారు 3 కోట్ల మొక్కలు నాటారు. ప్రస్తుతం ఐదోవిడుతలో 2.48 కోట్ల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. హరితహారం మొదటి, రెండోవిడుతలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్క లు వృక్షాలుగా ఎదగాయి. మహబూబాబాద్ నుంచి వయా శనిగపురం మీదుగా ఆమన్‌గల్ వరకు సుమారు 10 కిలోమీటర్ల వరకు రోడ్లకు ఇరువైపులా నాటిన 4 వేల మొక్కలు ఏపుగా పెరిగాయి. శనిగపురం నుంచి పర్వతగిరి వరకు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా ఎదుగుతున్నాయి. మొదటి, రెండోవిడుత హరితహారాల్లోభాగంగా నాటిన మొక్క ల ఫలాలు ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తున్నాయని జిల్లా అటవీశాఖ అధికారి కిష్టాగౌడ్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. జిల్లాలో ఐదోవిడుతలో 2.48 కోట్ల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మొదటి, రెండోవిడుతలో నాటిన మొక్కలు రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగాయని తెలిపారు. మహబూబాబాద్ నుంచి ఆమనగల్ వరకు పది కి.మీ.మేర నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయని చెప్పారు.

# ఇస్త్రీపెట్టెల్లో 9.2 కిలోల బంగారం

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత

**శంషాబాద్:** ఇస్త్రీపెట్టెల్లో రూ.3.46 కోట్ల విలువైన 9.2 కిలోల బంగారం తరలిస్తున్న స్మగ్లర్‌ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఈకే విమానం-528లో నుంచి దిగిన ఓ ప్రయాణికుడిని అధికారులు ముందస్తు సమాచారంతో తనిఖీ చేశారు. బ్యాగులోని నాలుగు ఇస్త్రీపెట్టెల్లో నాలుగు బంగారు కడ్డీలను వీ ఆకారంలో వెండి కోటింగ్‌తో తీసుకొచ్చినట్టు గుర్తించారు. స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీలు

# మహిళల ఉపాధిపై సర్వే

- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు
- సాగు అనుబంధరంగాలపై దృష్టి
- 'లోన్ సురక్ష' కింద రుణసాయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళల ఆర్థికాభివృద్ధిపై సమగ్ర సర్వే మొదలైంది. రోజువారీ జీవనంలో గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఎలాంటి అవసరాలు ఉంటాయనేది గుర్తించి వాటికి అనుగుణంగా కార్యక్రమాలు, పథకాలు రూపొందించే ప్రక్రియ ప్రారంభమైంది. మహిళలకు ఉపాధి అవకాశాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, మహిళలతో ఉమ్మడి వ్యవసాయంపై ఇటీవల సీఎం కేసీఆర్ పలు ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామస్థాయిలో ప్రక్రియను వేగవంతం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఉపాధి మార్గాలపై పరిశీలన జరుపుతున్నారు. ఈ ప్రక్రియలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను కీలకం చేస్తున్నారు. గ్రామాల్లో ఆర్థిక విప్లవం తీసుకొచ్చేలా సీఎం కేసీఆర్ ఆహార శుద్ధి కేంద్రాల ఏర్పాటుపై ప్రణాళికలు రూపొందించారు. అవసరమైనచోట ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసి, యాంత్రీకరణ కోసం రుణసాయం చేసి కల్తీ లేని ఆహారాన్ని అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నది. రైతులు పండించిన పంటలు ఆన్ డిమాండ్‌గా అమ్ముకోవడమే కాకుండా.. స్థానికంగా పండించే పంటలను బట్టి నాణ్యమైన ఆహార పదార్థాలను తయారు చేసేందుకు ప్లాంట్లను పెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది.



ప్రస్తుత రంగాలకు అనుబంధంగానే..

మహిళా సంఘాలు, కీలకపాత్ర పోషించేవారిని ఎంపికచేసివారి సామర్థ్యం, ఆసక్తి మేరకు వివిధ పథకాలను అమలుచేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. కారం, పసుపు, మామిడి వంటి వాటిని ఎగుమతి చేసే పనులను మహిళా సంఘాలతో చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉండగా.. దానికి అనుగుణంగా ఆయాప్రాంతాల్లో సర్వే చేపడుతున్నారు. మహిళా సంఘాలకు రుణం అందించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధిచెందేలా కొత్త పథకాలను రూపొందించేలా కసరత్తు చేస్తున్నారు. సాగుపై ఆసక్తి ఉన్న సంఘాలను ఎంపికచేసి ఉమ్మడిసాగు చేపట్టేందుకు కార్యాచరణ తయారుచేస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం వైపువారిని మళ్లించాలని చూస్తున్నారు. ఈ లక్ష్యాలను అధిగమించేందుకు సెర్ప్ నుంచి రుణాలు ఇప్పించడం, స్త్రీనిధి బ్యాంకును గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించడం వంటి నిర్ణయాలు తీసుకొంటున్నారు. లోన్ సురక్షా పథకం, పెట్టుబడులు పెట్టిన ప్రాంతాలు, ఆదాయం వచ్చే పనులు ఎక్కడెక్కడ చేస్తున్నారు.. అనే అంశాలపై పరిశీలన చేస్తున్నారు. సర్వే అనంతరం పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కొత్త పథకాలు మొదలెట్టేందుకు కృషిచేయనున్నారు.

### దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

#### హోంమంత్రి మహమూద్ అలీకి దూదేకుల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దూదేకుల కులస్థులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సిద్దా నేతృత్వంలోని ప్రతినిధిబృందం శనివారం హోంమంత్రి మహమూద్ అలీని కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని హోంమంత్రి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసింది. రిజర్వేషన్ వర్తింపచేయడంతోపాటు.. నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని విన్నవించింది. దూదేకుల సమస్యలు తమ దృష్టిలో ఉన్నాయని, తప్పకుండా పరిష్కరిస్తామని మహమూద్ అలీ వారికి హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం ముఖ్య సలహాదారుడు అజీముద్దీన్, ఉపాధ్యక్షుడు రజాక్, యూత్‌ప్రెసిడెంట్ అబ్దుల్‌రజాక్ తదితరులు పాల్గొన్నారు.

### ఒలింపియాడ్‌లో 'నారాయణ' ప్రతిభ

**హైదరాబాద్:** హంగేరీలో ఇటీవల నిర్వహించిన 13వ ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ , ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు సత్తాచాటారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ సింధూర నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం ఆదర్శ్‌రెడ్డి, వీ సాయితేజ అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో వెండి, కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశం నుంచి మెడల్స్ పొందిన విద్యార్థులు కూడా వీరేనని వెల్లడించారు. పతకాలు సాధించిన విద్యార్థులను తనతోపాటు విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే పునిత్ ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు తెలిపారు.

### కోడెల కొడుకు హోండా షోరూం సీజ్

**అమరావతి:** టీడీపీ సీనియర్ నేత, ఏపీ మాజీస్పీకర్ కోడెల శివప్రసాదరావు కుటుంబానికి మరో షాక్ తగిలింది. కోడెల కుమారుడు శివరాంకు చెందిన గౌతమ్ హోండాషోరూంను అధికారులు శనివారం సీజ్‌చేశారు. పన్నుచెల్లించకుండా వాహనాలు విక్రయించినట్టు గుర్తించారు. ఐదేండ్లుగా ఈ దందా కొనసాగిస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. కోడెల బినామీగా భావించే యర్రంశెట్టి మోటర్స్‌లోనూ పన్ను చెల్లించకుండా 400 వాహనాలు అమ్మినట్టు తేల్చారు. నరసరావుపేట, గుంటూరులోని రెండు షోరూంలను అధికారులు సీజ్‌చేశారు.

### వర్సిటీల నుంచే ఆవిష్కరణలు రావాలి

#### గీతం 39వ వ్యవస్థాపక దినోత్సవంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతన ఆవిష్కరణలు దేశంలోని విశ్వవిద్యాలయాల నుంచే ప్రారంభంకావాలని మాజీ రాష్ట్రపతి, భారతరత్న ప్రణబ్‌ముఖర్జీ పిలుపునిచ్చారు. శనివారం ఏపీలోని విశాఖపట్టణంలో నిర్వహించిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడంలో పరిశోధన, నూతన ఆవిష్కరణలు దోహదంచేస్తాయన్నారు. అనంతరం ప్రణబ్‌కు గీతం అధ్యక్షుడు ఎం శ్రీభరత్ గీతం ఫౌండేషన్ అవార్డును అందజేశారు.

### ప్రాణం తీసిన సాహస క్రీడ

**ఎల్బీనగర్, నమస్తే తెలంగాణ:** విహారయాత్రలో సాహసక్రీడ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. పారాసెయిలింగ్ చేస్తుండగా పారాచ్యూట్ విడిపోయి నగర యువకుడు దుర్మరణం చెందాడు. ఎల్బీనగర్ నియోజకవర్గం న్యూనాగోలులోని సమతాపురికాలనీకి చెందిన లక్కా చంద్రశేఖర్‌రెడ్డి (24) ఈసీఐఎల్‌లోని శ్రీకర్ దవాఖానలో ఫిజియోథెరపిస్టు. కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలోని కొత్తపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం పదేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడింది. తన స్నేహితులైన మోహన్‌నగర్‌కు చెందిన విశాల్, న్యూనాగోలుకు చెందిన అఖిల్‌తో కలిసి చంద్రశేఖర్‌రెడ్డి ఈ నెల ఏడున హిమచల్‌ప్రదేశ్‌లోని కులూమనాలి వెళ్లాడు. శనివారం కులూలోయలో పారాసెయిలింగ్ చేస్తుండగా పారాచ్యూట్ తాడు తెగి చంద్రశేఖర్‌రెడ్డి మృతిచెందాడు.

# తెలంగాణలో మైనార్టీ సంక్షేమం భేష్

### ఒమన్ దేశ రాజు కుమారుడు హిషం అల్‌షాన్‌ఫరి కితాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో మైనార్టీ సంక్షేమంకోసం అమలుచేస్తున్న పథకాలు అద్భుతమని ఒమన్ దేశ రాజు కుమారుడు హిషం అల్‌షాన్‌ఫరి ప్రశంసించారు. శనివారం హైదరాబాద్‌లోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో చైర్మన్ మహ్మద్ సలీంతో అల్‌షాన్‌ఫరి భేటీ అయ్యారు. వక్ఫ్ బోర్డు ద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి సలీం ఆయనకు వివరించారు. వక్ఫ్ బోర్డు ఆస్తులపరిరక్షణ, రాష్ట్రంలో శాంతిభద్రతల కోసం తీసుకుంటున్న చర్యలను అల్‌షాన్‌ఫరి కొనియాడారు.



శనివారం హైదరాబాద్‌లోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో చైర్మన్ మహ్మద్ సలీంతో ఒమన్ దేశ రాజు కుమారుడు హిషం అల్‌షాన్‌ఫరి

# మిస్‌ఇండియా రన్నరప్‌గా డాక్టర్ రమ

- కేఎంసీ పూర్వ విద్యార్థిని ఘనత
- ప్రస్తుతం క్యాన్సర్ స్పెషలిస్టుగా విధులు

**పోచమ్మమైదాన్ (వరంగల్):** వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) పూర్వ విద్యార్థిని డాక్టర్ వాగ్మేరి రమ మిస్‌ఇండియా రన్నరప్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 8న న్యూఢిల్లీలో నిర్వహించిన 'మిస్ ఇండియా గ్లామ్‌ఆన్ - 2019' అందాల పోటీలో దేశవ్యాప్తంగా 30 మంది విద్యార్థినులు పాల్గొనగా.. రమ రన్నరప్‌గా నిలిచారు. 2006 నుంచి 2012 వరకు కేంఎసీలో ఎంబీబీఎస్ చదివిన రమ.. విద్యార్థి దశలోనే మోడలింగ్ పోటీల్లో పాల్గొనేవారు. మెడికల్ విద్యార్థిగా మిస్‌ఇండియా పోటీల్లో పాల్గొనే సమయం లభించలేదు. హైదరాబాద్‌లో క్యాన్సర్ స్పెషలిస్టుగా స్థిరపడ్డాక.. పట్టుదలతో లక్ష్యం వైపు కదిలారు. తొలుత హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఎంపికై.. దుబాయ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఆమె తండ్రి మాధవరావు రిటైర్డు హెడ్‌కానిస్టేబుల్ కాగా, తల్లి చంద్రకళ గృహిణి. పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించానని, డాక్టర్‌గా ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడమే ధ్యేయమని రమ చెప్పారు. రమ ఎంపికపై కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య అనిల్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మ ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.



మిస్ ఇండియా రన్నరప్‌గా నిలిచిన డాక్టర్ రమ

నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం 11 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



తెలుగు పరిశ్రమలో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న మహానటి కీర్తి సురేశ్

చిన్న వయసులోనే సావిత్రి బయోపిక్‌లో నటించి జాతీయ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయింది.

వచ్చిన అవార్డుని తల్లి మేనకకు అంకితం చేసి అమ్మ కోరిక నెరవేర్చింది.

మహానటి సినిమా మొదలు నుంచి చివరి వరకు కీర్తి పడిన శ్రమ అంతా సినిమా సక్సెస్‌తో పోయిందంటున్నది.

ఈ అవార్డు రావడంతో మరింత బూస్టప్ వచ్చిందంటున్న అమ్మాడీ అంతరంగ ఆవిష్కరణ ఇది.

# అమ్మ కోరిక నెరవేర్చాను

**లెక్కలేనన్ని పాత్రలు చేసిన మహానటి సావిత్రికి రాని జాతీయ ఉత్తమ నటి అవార్డు మీకు రావడం ఎలా అనిపించింది?**

ఇలా నేనెప్పుడూ అనుకోలేదు. నాకు జాతీయ ఉత్తమ నటిగా అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. నేను సినిమా రంగానికి రావడానికి మా ఫ్యామిలీ సపోర్ట్ చాలా ఉంది. వారి ప్రోత్సాహంతోనే 'మహానటి' చేయడానికి ఒప్పుకున్నాను. నేను టెన్షన్ పడుతున్న ప్రతిసారీ 'యు కెన్ డూ ఇట్' అని ముందుండి నడిపించారు. అందుకే ఈ అవార్డును మా అమ్మ గారికి అంకితం చేస్తున్నాను.

**ఈ అవార్డు వచ్చిందని ఫస్ట్ మీకు ఎవరు చెప్పారు. చెప్పగానే మీ ఎక్స్‌ప్రెషన్ ఏంటి?**

నేను న్యూస్‌లో చూశాను (చిరునవ్వు). ఆ తర్వాత ఫ్రెండ్స్, రిలేటివ్స్ చాలామంది కాల్ చేసి నీకు జాతీయ ఉత్తమనటిగా అవార్డు వచ్చింది కంగ్రాట్స్ అన్నారు. నాకు ముందుగానే తెలిసినా వారు చెబుతుంటే మళ్లీ మళ్లీ వినాలనిపించింది. ఇప్పటికీ కాల్స్ వస్తూనే ఉన్నాయి.

**సావిత్రిగారి గురించి ఏం చెప్తారు?**

సావిత్రిగారి ఆశీస్సులు, సపోర్ట్ లేకుంటే మహానటి ఇంత దూరం వచ్చేది కాదు. ఈ విషయంలో ఆమె కుమార్తె విజయ చాముండేశ్వరికి థ్యాంక్స్ చెప్పాలి. మేము ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలా అడ్డంకులు ఎదర్కొన్నాం. వాటన్నింటినీ ఎదుర్కొంటూ గైడ్ చేస్తూ మమ్మల్ని ముందుకు నడిపించారని నా ఫీలింగ్. ఆమె ఆశీసులు ఎప్పుడూ నాపై ఉండాలని మనసారా కోరుకుంటున్నాను.

> **మీకు వచ్చిన అవార్డును మీ అమ్మ మేనకకు అంకితం చేశారు. ఎందుకు ఇవ్వాలనుకున్నారు. కారణం ఏమైనా ఉందా?**
>
> నేను ఫిల్మ్ ఇండస్ట్రీకి రావడానికి కారణం మా అమ్మ. ఆమె ఇన్స్పిరేషన్‌తోనే ఈ రంగంలోకి అడుగు పెట్టాను. ఆమె తమిళం, మలయాళంలో ఎక్కువగా నటించింది. తెలుగులో పున్నమినాగు సినిమాలో పున్నమిరాత్రి పాటకు మెగాస్టార్ చిరంజీవి సరసన నటించింది. అందులో ఆమెది నెగెటివ్ కేరక్టర్. అప్పట్లో ఆమెకు తొలి మలయాళం సినిమాకు జాతీయ అవార్డు రావాల్సింది. కానీ, జస్ట్ మిస్సైపోయింది. అందుకే ఆమెకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నాను.

**అవార్డు అనౌన్స్ చేసినప్పటి నుంచి మీకు చాలామంది ఫోన్ చేసి కంగ్రాట్స్ చెప్పి ఉంటారు. అందులో బెస్ట్ కాంప్లిమెంట్ ఏది?**

చాలామంది ఫోన్ చేశారు. అందులో ఒకటి చెప్పడం చాలా కష్టం (నవ్వుతూ). మా ఫాదర్ ఫ్రెండ్స్ కాల్ చేసి కంగ్రాట్స్ చెప్పారు. మీ అమ్మాయి తెలుగులో జాతీయ అవార్డు సాధించడం మామూలు విషయం కాదు. మేము మీ తండ్రి ఫ్రెండ్స్ అయినందుకు చాలా గర్వంగా ఉందని అన్నప్పుడు మరో అవార్డు వచ్చినంత ఆనందంగా ఉన్నది. ఇది నాకు బెస్ట్ కాంప్లిమెంట్‌గా గుర్తుండిపోతుంది.

**సావిత్రిగారి బయోపిక్‌కు ఒప్పుకున్న తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

సావిత్రిగారి పాత్రని చాలెంజ్‌గా తీసుకున్నాను. సావిత్రికి సంబంధించిన పుస్తకాలన్నీ ముందేసుకొని ఆమెను అవగాహన చేసుకోవడం మొదలుపెట్టాను. అయినా ఎక్కడో అనుమానం, భయం ఉండేది. కరెక్ట్‌గా చేస్తానో లేదో, సావిత్రి పేరు నిలబెడతానో లేదో అన్న భయంతో నిద్రకూడా పట్టేది కాదు. తొలిరోజు షూటింగ్‌లో సావిత్రికి సంబంధించిన పాటల్ని మెడ్లీగా తీశారు. ఆ పాటల్లో సావిత్రి కాస్ట్యూమ్స్, సెట్టింగ్ అంతా కరెక్ట్‌గా సరిపోయే వరకు టేక్స్ తీస్తూనే ఉన్నారు. అందులోని ప్రతీ సీన్ కరెక్ట్‌గా వచ్చింది. ఆ రోజును ఎప్పటికీ మర్చిపోలేను.

**మహానటి సినిమాలో మీరు బాగా కనెక్ట్ అయిన సీన్ ఏది? దానికి మీరు న్యాయం చేశారనుకుంటున్నారా?**

అందులో ముఖ్యంగా చెప్పాల్సింది మాయాబజార్‌లోని 'అహ నా పెళ్లంట' ఎపిసోడ్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ సీన్ తీయడానికి సుమారు 50 టేకులు తీసుకున్నాను. టేక్ తీసిన ప్రతీసారి చూసుకుంటూ ఉండేదాన్ని. ఒకసారి చేసిన తప్పులు దొర్లకుండా చూసుకునేదాన్ని. ఫైనల్ అవుట్‌పుట్ బాగా రావడంతో అందరూ అభినందించారు.



తల్లి మేనకతో కీర్తి..

**మహానటి కాస్ట్యూమ్స్‌కి కూడా అవార్డు వచ్చింది. ఆమె కాస్ట్యూమ్ మీరు ధరించినప్పుడు ఏమనిపించింది?**

అప్పటికి ఇప్పటికీ కాస్ట్యూమ్స్‌లో చాలా తేడాలు గమనించాను. మహానటికి కాస్ట్యూమ్ డిజైనర్లు కూడా బాగా కష్టపడ్డారు. సావిత్రి డ్రెస్సింగ్ స్టైల్ వేరేలా ఉంటుంది. అచ్చు అలానే కావాలి అనేదాన్ని. ఆమె చాలా టైట్‌గా ఉండే బ్లౌజులు ధరించేది. ఊపిరి ఆడకపోయినా ఆమెలా కనిపించాలని వేసుకున్నాను.

**సావిత్రికి, మీకు దగ్గర పోలికలు ఉన్నట్లు విన్నాం. అది నిజమేనా?**

మొదట మహానటికి ఒప్పుకున్నప్పుడు విజయ చాముండేశ్వరిని అడిగి సావిత్రి గురించి కొన్ని విషయాలు తెలుసుకున్నాను. ఆమెకు స్విమ్మింగ్ అంటే ఇష్టం. మా ఇద్దరికీ టీ అంటే చాలా ఇష్టం. ఆమె క్రికెట్ ఆడేవారు. నేను స్కూల్‌లో ఉన్నప్పుడు ఆడేదాన్ని. ఆమెకు, నాకు కార్ డ్రైవింగ్ అంటే ఇష్టం. ఇలా చాలా విషయాల్లో కలిశాయి.

**మహానటి పాత్ర చేసినందుకు మీ ఫీలింగ్ ఏంటి?**

ఒక లెజెండ్ పాత్ర పోషించాలి. మహానటి కోసం నన్ను నాగ్ అశ్విన్, స్వప్న, ప్రియాంక దత్‌లు కలిసినపుడు నేను ఒక నిమిషం కూడా ఆలోచించకుండా నో చెప్పాను. సావిత్రి పాత్ర పోషించగలనా? అవిడ లైఫ్‌లో అప్స్ అండ్ డౌన్స్ ఉన్నాయి. నేను కరెక్ట్‌గా చేయగలనా? అని సంకోచించాను. సావిత్రి కథ అందరికీ తెలిసిందే. మనం కొత్తగా ఎలాంటి మార్పులు చేయడం లేదని నాగ్ నన్ను కన్విన్స్ చేశాడు. లోపల భయం ఉన్నా మళ్లీ చాన్స్ రాదని ధైర్యం చేసి ఒప్పుకున్నాను.

**తెలుగు చాలా మంచిగా మాట్లాడుతున్నారు? ఎవరి దగ్గరైనా నేర్చుకుంటున్నారా?**

అవును.. మంచిగా మాట్లాడుతున్నానా (నవ్వుతూ). థ్యాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్. అమ్మ తమిళం, నాన్న మలయాళం. రెండు బాషలు అనర్గళంగా మాట్లాడుతాను. తెలుగు రాదు. ఇక్కడికి వచ్చిన తర్వాత అందరితో మాట్లాడుతూ నేర్చుకుంటున్నాను.

**ఈ మధ్య కాలంలో మీరు బాగా సన్నగా అయినట్లున్నారు? దీనికి మీ సీక్రెట్ ఏంటి?**

అవును కొంచెం తగ్గాను. సీక్రెట్ ఏమీ లేదు. రోజూ వర్క్‌వుట్స్ చేస్తుంటాను. సినిమాలోని పాత్రకు తగినట్లుగా మన శరీరాకృతి ఉండాలి.

**మహానటి కోసం మీరు శారీరకంగా కష్టపడ్డారా?**

మహానటి సినిమాలోని కొన్ని సన్నివేశాల్లో బొద్దుగా ఉన్న సావిత్రిని చూపించాల్సి ఉంటుంది. అప్పుడు పాత్రకు తగినట్లుగా నేను శారీరకంగా కష్టపడ్డాను. పద్నాలుగేండ్ల అమ్మాయిగా కనిపించడం పెద్ద కష్టమనిపించలేదు. బుగ్గలు రావడం కోసం నోట్లో దూది పెట్టుకున్నాను. దూది ఉండగా డైలాగులు చెప్పడం కష్టం అనిపించింది.

**మహానటి షూటింగ్ పూర్తయిన తర్వాత సెట్ వదిలి వెళ్లేటప్పుడు ఏడ్చారట?**

షూటింగ్ మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు చిత్రబృందంతో విడదీయలేని అనుబంధం ఏర్పడింది. సావిత్రి జీవితంలోని విషాదాన్నీ, విజయాన్నీ నా మనసులోతుల్లోకి తీసుకోగలిగాను. చివరిరోజు సెట్‌ను వదిలి వెళ్తుంటే కన్నీళ్లు ఆగలేదు. అందరికీ చిన్న కానుకలు ఇచ్చి సెలవు తీసుకున్నాను. ఆ పాత్రలో ఏదో మ్యాజిక్ ఉందనిపిచ్చింది. ఈ జాతీయ అవార్డుతో ఆ మ్యాజిక్ ఏమిటన్నది అర్థమైంది.

... వనజ వనిపెంట

# తెలుగు సినిమాకు దక్కిన గౌరవం ఇది!

'సావిత్రిగారికి జాతీయస్థాయిలో ఆశించిన గుర్తింపు లభించలేదు. ప్రతిభకు తగిన పురస్కారాలు కూడా దక్కలేదు. 'మహానటి' చిత్రానికి జాతీయ అవార్డులు వరించడం సావిత్రిగారికి దక్కిన నిజమైన గౌరవంగా భావిస్తున్నాం. ఆమెకే పురస్కారాలు వచ్చాయన్నంత ఆనందంగా ఉంది' అన్నారు చిత్ర దర్శకుడు నాగ్‌అశ్విన్. సావిత్రి జీవితకథకు వెండి తెరపై ప్రాణప్రతిష్ఠ చేసి తెలుగు సినీ ప్రియులతో శభాష్ అనిపించుకున్నాడు. 'మహానటి' చిత్రానికి మూడు జాతీయ అవార్డులు వరించడం అనిర్వచనీయమైన అనుభూతినిచ్చిందని చెప్పారాయన. ఈ సందర్భంగా నాగ్‌అశ్విన్ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.



**'మహానటి' చిత్రానికి జాతీయ అవార్డు వస్తుందని ఊహించారా?**

సినిమా విడుదలైన తర్వాత చాలామంది బాగుందని ప్రశంసించారు. సావిత్రిగారి జీవితకథను హృద్యంగా దృశ్యమానం చేశారంటూ అభినందించారు. కీర్తి సురేష్ అభినయం అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. అయితే జాతీయ అవార్డుల కోసం అన్ని భాషా చిత్రాల నుంచి పోటీ ఉంటుంది. హిందీలో దీపికాపదుకునే నటించిన 'పద్మావత్', అలియాభట్ 'రాజీ' చిత్రాలు పోటీలో ఉన్నాయి. అంతటి కాంపిటీషన్‌లో మేం పురస్కారాల్ని గెల్చుకోవడం కష్టమనే అభిప్రాయం ఉండేది. 'మహానటి'కి జాతీయ అవార్డులు వరించడం గొప్ప విజయంగా భావిస్తున్నా.

> **సావిత్రిగారి కుటుంబసభ్యుల స్పందన ఎలా ఉంది. మీరు వాళ్లతో మాట్లాడారా?**
>
> చాలా సంతోషంగా ఉన్నారు. వారందరితో నేను సంభాషించాను. అవార్డు రావడం పట్ల సావిత్రిగారి కుటుంబసభ్యులందరూ సంతృప్తిగా ఉన్నారు.

> **'మహానటి' వంటి అపూర్వ చిత్రం తర్వాత మీ దర్శకత్వంలో రాబోయే సినిమా గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మీ తదుపరి సినిమా ఎలా ఉండబోతున్నది?**
>
> నా తదుపరి సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్‌పనుల్లో ఉన్నాను. అన్నీ సిద్ధమయ్యాక ఆ వివరాల్ని వెల్లడిస్తాను.

**సావిత్రి పాత్రధారిణి కీర్తిసురేష్‌కు ఉత్తమనటిగా జాతీయ అవార్డుతో పాటు మీ సినిమా మొత్తంగా మూడు అవార్డులను కైవసం చేసుకోవడం ఎలాంటి అనుభూతినిచ్చింది?**

ఈ సినిమా ప్రయాణం ఆసాంతం సంతృప్తికరంగా సాగిపోయింది. అవార్డులు మాలో నూతనోత్సాహాన్ని నింపాయి. మా సినిమాపై వచ్చిన సమీక్షలు, విశ్లేషకుల అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకుంటే కీర్తి సురేష్‌కు అవార్డు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావించాం. మేం అనుకున్నట్లుగానే కీర్తి సురేష్‌కు అత్యున్నత పురస్కారం దక్కడం చాలా సంతోషంగా ఉంది.

**తొలుత సావిత్రి పాత్ర కోసం కథానాయికలుగా ఎవరిని పరిశీలనలోకి తీసుకున్నారు? కీర్తి సురేష్ ఎంపిక ఎలా జరిగింది?**

సావిత్రి వంటి మహానటి పాత్రకు న్యాయం చేయాలంటే చక్కటి ప్రతిభాసామర్థ్యాలు కలిగిన నాయికను తీసుకోవాలనుకున్నాం. ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న కథానాయికలు అందరూ సావిత్రి పాత్రకు ఎంత వరకు కుదురుతారో అని విశ్లేషించాం. కీర్తి సురేష్ అయితే సావిత్రి పాత్రలో పరిపూర్ణంగా ఒదిగిపోతుందని విశ్వసించాం. సావిత్రి పాత్ర కోసం మేము అనుకున్న లక్షణాలన్నీ కీర్తి సురేష్‌లో ఉన్నాయనిపించింది.

**కీర్తి సురేష్‌ను సావిత్రి పాత్ర కోసం ఎంపిక చేసుకున్నప్పుడు కొందరి నుంచి విమర్శలు వచ్చాయి. ఆమె మహానటి పాత్రకు న్యాయం చేస్తుందో లేదో అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. వాటిని మీరెలా స్వీకరించారు?**

విమర్శల్ని పెద్దగా పట్టించుకోలేదు. సినిమా బాగా తీయడంపైనే దృష్టి పెట్టాం. సావిత్రిగారి వంటి అసమాన నటి జీవిత కథ ఉన్నత విలువలతో తెరపై ఆవిష్కృతం కావాలని టీమ్ అంతా తపించాం. సినిమా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది కాబట్టి కీర్తి సురేష్ విషయంలో మా అంచనాలు నిజమయ్యాయని అనుకున్నాం.

**'మహానటి' చిత్రానికి జాతీయ అవార్డులు రావడంలో దర్శకుడిగా మీ క్రెడిట్ ఎక్కువగా ఉందని అందరూ అంటున్నారు?**

సక్సెస్ క్రెడిట్ ఇస్తే సంతోషంగా తీసుకుంటా (నవ్వుతూ). అయితే సినిమా అనేది సమిష్టి కృషి. అందరి శ్రమవల్లనే మంచి ఫలితాలొస్తాయి. నటీనటుల నుంచి అభినయం రాబట్టడంలో దర్శకుడి పాత్ర చాలా ఉంటుంది. అయితే ఆర్టిస్టులు విఫలమయ్యే పక్షంలో మనం ఏమీ చేయలేం. స్క్రిప్ట్ మనం కోరుకున్న విధంగా తెరపై రావాలంటే ఆర్టిస్టుల అభినయం ముఖ్యం. వారు సరిగ్గా అభినయించలేకపోతే చేసేది ఏమీ ఉండదు. కీర్తి సురేష్ సావిత్రి పాత్రలో జీవించింది. కాబట్టి క్రెడిట్ మొత్తం ఆమెకే దక్కుతుందని అనుకుంటున్నా.

**'మహానటి' తెలుగులో తొలి జీవితకథా చిత్రం. ఈ సినిమాకు ప్రేక్షకుల ప్రశంసలతో పాటు వాణిజ్యపరంగా కూడా మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు పురస్కారాలు దక్కడం ఎలా అనిపిస్తున్నది?**

సినిమా విడుదలైన తర్వాత మొదటివారంలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన అవార్డుల కంటే ఎక్కువ భావిస్తున్నా. అయితే పురస్కారాలు దక్కడం గొప్ప గౌరవం. జాతీయ స్థాయిలో మన ప్రతిభకు లభించిన గుర్తింపు కాబట్టి అవార్డులను బోనస్‌గా భావిస్తున్నా. మొత్తంగా తెలుగు సినిమాకు దక్కిన గౌరవమిదని అనుకోవచ్చు.

... సినిమా డెస్క్

---

**కుంకుమ పువ్వు ఒక ఖరీదైన సుగంధ ద్రవ్యం. ఇరిడాసే కుటుంబానికి చెందిన కుంకుమ పువ్వును ప్రధానంగా శీతల ప్రదేశాల్లో పండిస్తారు. గర్భిణులకు ఎక్కువగా ఈ కుంకుమ పువ్వును పాలల్లో కలిపి ఇస్తారు. అయితే చాలామంది కుంకుమ పువ్వును గర్భిణులు మాత్రమే వాడాలనే అపోహతో ఉంటారు. కుంకుమ పువ్వు వల్ల లాభాలు అనేకం.**



# కుంకుమపువ్వుతో గుండెపోటుకు చెక్

- కుంకుమపువ్వును తరచూ తింటే క్యాన్సర్ రాకుండా ఉంటుంది. ప్రతి రోజూ రాత్రి పడుకునే ముందు పాలల్లో కొన్ని కుంకుమ పువ్వులు వేసుకుని పాలు తాగితే మంచిది. పాలల్లో కుంకుమ పువ్వు వేసినప్పుడు పసుపు రంగులోకి మారితే అది ఒరిజినల్ అని గుర్తు పట్టవచ్చు.
- నెలలో కనీసం మూడు లేదా నాలుగుసార్లు కుంకుమ పువ్వు తింటే ఊపిరితిత్తులను శుభ్రపరుస్తుంది. చాలా రోజులుగా కడుపు ఉబ్బరంగా ఉన్నా ఆ సమస్య కూడా తగ్గుతుంది. అజీర్తి తగ్గించడంలో కుంకుమ పువ్వుది ప్రత్యేక స్థానం.
- రక్తంలోని కొలెస్ట్రాల్‌ను అదుపు చేయడంలో కుంకుమపువ్వు ప్రత్యేకపాత్ర పోషిస్తుంది. ప్రతి రోజు పాలల్లో కుంకుమపువ్వు వేసుకుని తాగడం వల్ల గుండెపోటు సమస్యలు తలెత్తకుండా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.
- కుంకుమపువ్వును ఆహారంలో సైతం తీసుకోవచ్చు. అధిక మోతాదులో తినకుండా రోజుకు చిటికెడు తింటే మంచిది. తరచూ ఆహారంలో కుంకుమపువ్వును తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు రాకుండా ఉంటాయి.
- చర్మ సంబంధిత మందుల్లో కూడా కుంకుమపువ్వును విరివిగా వాడుతారు. కుంకుమపువ్వు తింటే లాభం తప్ప నష్టం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇది కంటి చూపును కూడా మెరుగుపరుస్తుంది.

# భిన్నమైన 'వెదురు' వస్త్రాలు


ఖాదీ కన్నా, సున్నితమైన, పట్టు కన్నా మృదువైన వస్త్రాలను ధరించాలని ఎప్పుడైనా అనుకున్నారా? అయితే 'వెదురు'తో చేసిన వస్త్రాలను ఎంచుకోవచ్చు. పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించొద్దనే ఉద్దేశ్యంతో కాలుష్యరహిత 'వెదురు'వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నది. కేరళకు చెందిన మాదివి దాస్ అనే యువతి.



ఫ్యాషన్ ప్రపంచంలో రోజు రోజుకూ ట్రెండ్ మారుతూనే ఉంటుంది. ఓ స్థిరమైన, పర్యావరణహిత మార్పును తీసుకురావడానికి కృషి మాధవి కృషి చేస్తున్నది. 'బాంబు ట్రైబ్స్' పేరుతో స్టార్టప్ ప్రారంభించి ఈ వస్త్రాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నది. అయ్యప్ప సోమయంద అనే మిత్రుని సాయంతో తన ప్రయత్నం చేస్తున్నది.ఉత్పత్తి ఖర్చులను తగ్గించే వెదురుతో వస్త్రాలను తయారు చేయడంలో ఇద్దరూ అనుభవం సాధించారు. పత్తి ఉత్పత్తి చేయాలంటే దానికి ఎక్కువ డబ్బు, నీరు, సమయం ఉంటుంది. కానీ వెదురు, అందులోని కొన్ని జాతులను ఉత్పత్తి చేయాలంటే ఈ పరిస్థితులు అవసరం లేదు. 24 గంటల్లో 3 ఫీట్లు పెరిగే వెదురు జాతులున్నాయి. ఇలాంటి వాటి నుంచి వస్త్రాలను తయారు చేయడానికి పూనుకున్నారు. నాణ్యమైన శైలిలో, చక్కటి నాణ్యత, సున్నితంగా ఉండేలా ఈ వస్త్రాలుంటాయి. ఎక్కువగా ఉపయోగించుకోవడానికి వీలుంటుంది. అదే సమయంలో ఈ వస్త్రాలను తయారు చేయడానికి ఉపయోగించే పదార్థాలు ఎలాంటి కాలుష్యానికి కారణం కావని చెపుతున్నారు. అట్లాగే ఈ వస్త్రాలు అన్ని పనుల్లోనూ అనుకూలంగా ఉంటాయంటున్నారు.

# బాదంతో అందాన్ని పెంచుకోవచ్చిలా

**బాదం పౌడర్‌లో పాలను కలుపుకొని ఫేస్‌కు పూసుకుంటే దురద సమస్య తగ్గుతుంది. ఈ చిట్కాలన్నీ కేవలం ఆడవాళ్లు మాత్రమే పాటించాలనే రూల్ ఏమీ లేదు. మగవారూ ఈ చిట్కాలు పాటించి మీ అందాన్ని పెంచుకోండి.**



- బాదం నూనెలో కాస్త ఆముదం వేసి పెదాలపై పూసుకుంటే లిప్స్ పింక్ కలర్‌లోకి మారుతాయి.
- లిప్స్ మాత్రమే కాదు బాడీలో ఎక్కడైనా సరే నల్లగా ఉండే ప్రాంతంలో దీన్ని పూసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. నలుపు రంగు
- బాదం, ఆముదం కలిపి జుట్టుకు పూసుకోండి. జుట్టు నిగనిగలాడుతుంది. రాలిపోదు. బలంగా ఉంటుంది. కొందరు ఫేస్‌పై, కళ్ల కింద నల్లటి వలయాలు కాస్త బాదం నూనెలో తేనె కలిసి నల్లటి వలయాలపై పూసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- రోజూ రాత్రి పడుకునే ముందు బాదం నూనెను ముఖానికి రాసుకోండి. కొన్ని రోజుల్లో మీ ముఖంలో కొత్త కాంతి కనపడుతుంది.
- బాదం నూనెలో కాస్త నిమ్మరసం వేసి ఫేస్‌కు పూసుకుంటే కూడా చాలా మేలు.
- బాదం నూనె కూడా ఫేస్ అందాన్ని పెంచుతుంది. అందులో ఉంటే ఏ,ఈ విటమిన్స్ చర్మంపై ఉండే దుమ్ముధూళిని మొత్తాన్ని తొలగిస్తుంది.
- బాదంనూనె, కొబ్బరి నూనె కలుపుకుని ముఖంపై డ్రై గా ఉండే ప్రాంతంలో లేదంటే కాస్త నల్లగా ఉండే ప్రాంతంలో పూసుకోండి. మంచి ఫలితం ఉంటుంది.

II.
నమస్తే తెలంగాణ
సింగిడి
[ కరీంనగర్ ]
ఆదివారం 11 ఆగస్టు 2019

## అందమైన హంటర్!



అందమైన హంటర్‌కు వలతో పనిలేదు. చేతులనే ఆయుధంగా చేసుకొని ఎంత పెద్ద చేపలనైనా ఇట్టే పట్టేస్తుంది. అంతేనా.. వాటి ఫొటోలను తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేస్తూ క్రేజ్ సంపాదించుకుంటున్నది 23 యేండ్ల హన్నా బార్న్. పెద్ద పెద్ద చేపల్ని సైతం అమాంతం పట్టుకొని అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నది. నదులు, చెరువుల్లో దిగి చేపల్ని ఉత్తి చేతులతోనే పట్టుకోగలగడం హన్నా ప్రత్యేకత. నూడ్లింగ్ ట్రిక్ ఉపయోగించి 20 కేజీల బరువున్న చేపల్ని కూడా ఈజీగా పట్టేసుకుంటున్నది. చేపలే కాదు దట్టమైన అడవుల్లోకి వెళ్లి వన్య ప్రాణుల్ని వేటాడుతుంటుంది. కొందరు విమర్శించినా.. హన్నా వాటిని పట్టించుకోవట్లేదు. ఏది ఏమైనా ఇన్‌స్టాగ్రాంలో 5 లక్షల మంది ఫాలోయర్లను సంపాదించుకున్నది ఈ బ్యూటీ హంటర్.

# విద్యను కానుకగా ఇస్తున్నది!

**రోడ్డుపైన, ట్రాఫిక్ సిగ్నళ్ల దగ్గర భిక్షమెత్తుకునే చిన్నారులను చూస్తూనే ఉంటాం. వారిపై ఉన్న జాలితో కొందరు తోచినంత భిక్షమేస్తుంటారు. మరికొందరు ఏవైనా వస్తువులు కానుకగా ఇస్తారు. మరికొందరు వారి ఆకలిని తీర్చుతారు. ఆ వయసులో ఆ పిల్లలకు అవి సరిపోతాయి. మరి వారి భవిష్యత్? జీవితాంతం అలా అడుక్కోవడమేనా? వారికి చదువు చెప్పి ప్రయోజకులను చేస్తే.. వారే మరికొందరికి ఆదర్శమవుతారు. ఓ మంచి సమాజం ఏర్పడుతుంది. సరిగ్గా ఇదే ఆలోచన చేసింది హైమంతి.**



అది ముంబయి సమీపంలోని కండివలి రైల్వేస్టేషన్. ఆ స్టేషన్ సమీపంలోని స్కైవాక్(నడకదారి) పక్కనే ఉంది ఓ మురికివాడ. అందులోని వారంతా నిరుపేదలే. పైగా మద్యానికి బానిసలైన తల్లిదండ్రులే ఉన్నారు. పిల్లలను బడికి పంపకుండా వాళ్ల అవసరాలు తీర్చడం కోసం భిక్షగాళ్లుగా మార్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిరిగిన దుస్తులతో, ముఖానికి మట్టితో భిక్షమెత్తుకునేవారు పిల్లలు. వారిలో కొందరు గంజాయి, సిగరెట్‌కు అలవాటుపడ్డారు. మరికొందరు ఆకలి తీర్చుకోవడం కోసం దొంగతనాలు చేస్తూ బాల నేరస్థులుగా మారుతున్నారు.

అయితే అదే స్కైవాక్‌ను దాటి ప్రతిరోజూ ఆఫీస్‌కు వెళుతుంది హైమంతి సేన్. చాలాకాలం నుంచి వారిని గమనిస్తున్నది. ఆ పిల్లలు రోడ్డుపైన వచ్చిపోయేవారి వెంట పడుతూ డబ్బులు అడగడం చూసేది. కొందరు చీదరించుకుంటే కొందరు భిక్షమేసేవారు. మరికొందరు అన్నం పెట్టి ఆకలి తీర్చేవారు. ఇక రోజంతా వాళ్లు చేసే పని అదే. ఈ పరిస్థితిని గమనించిన హైమంతికి చాలా బాధ కలిగింది. ఇలాంటి హానికర, అనారోగ్యకర వాతావరణంలో పెరుగుతున్న పిల్లల్ని చూసి చలించిపోయింది. దేశంలో విద్యాహక్కును వినియోగించుకోలేని ఇలాంటి పిల్లలను ఆదుకోవాలనుకునేవారు ఎంతోమంది ఉన్నా, వారికి ఎందుకు విద్య దూరమైందోనని ఆలోచించింది. ఈ ప్రశ్నకి సమాధానం తెలుసుకోవడానికి ఆ పిల్లల కుటుంబాల్ని కలవడానికి వెళ్లింది.. తన వెంట కొందరు పిల్లల్ని తీసుకెళ్లి 'వీళ్లను స్కూళ్లలో ఎందుకు చేర్చలేదు' అనడంతో 'మేము చేర్పించాం.. వాళ్లే స్కూల్‌కి వెళ్లకుండా తిరుగుతున్నారని' చెప్పారు కుటుంబ సభ్యులు. ఆ సమాధానంతో సంతృప్తి చెందని హైమంతి అప్పుడే ఓ గొప్ప ఆలోచన చేసింది. 'అయితే రోజుమార్చి రోజు నేను ఇక్కడకు వచ్చి పిల్లలకు చదువు చెబుతాను' అన్నది. అయితే ఆ తల్లిదండ్రులు మాత్రం పిల్లలకు చదువుతోపాటు బట్టలు, భోజనం కూడా పెట్టాలని షరతు పెట్టారు. ఆ షరతును సున్నితంగా తిరస్కరించిన హైమంతి.. 'వారి చదువు చెబుతూ.. కళలు, చేతివృత్తులు, ఇతర నైపుణ్యాలు నేర్పుతాను' అని చెప్పింది. అలా.. ఒకటికి రెండుస్లారు ఆ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను బడికి పంపేందుకు సంసిద్ధులను చేసింది. స్కైవాక్ మీద, రోడ్ల పక్కన, ట్రాఫిక్ సిగ్నళ్ల దగ్గర భిక్షమెత్తుకునే చిన్నారులను చేరదీసి వారిని బడికి పంపింది.



### లక్ష్యం దిశగా హైమంతి సేన్..

హైమంతి సేన్ ఉన్నత లక్ష్యాన్ని అర్థం చేసుకున్న చిన్నారులు చక్కగా చదువు నేర్చుకుంటున్నారు. ఆయా కళల్లో బాగా రాణిస్తున్నారు. జుజూన్ ఎన్జీఓ ద్వారా చదువు నేర్చుకున్న పిల్లలంతా చక్కగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారు. అక్షరాలు, పదాలు, నంబర్లు చకచకా చెప్పేస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో రాణిస్తున్న పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చదివించేందుకు చర్యలు తీసుకుంటున్నది హైమంతి. అయితే చెడు వ్యసనాలకు బానిసలైన నలుగురైదుగురు పిల్లలు మాత్రం మళ్లీ స్టేషన్‌బాట పట్టారు. అయినా వెళ్లిన వారిలో కూడా పరిపూర్ణమైన మార్పు కోసం నిత్యం ప్రయత్నిస్తూనే ఉన్నది హైమంతి. భవిష్యత్తులో పిల్లలందరూ తన ఆశయాన్ని గెలిపిస్తారని నమ్మకంతోనే ఆమె పనిచేస్తున్నది.

### ప్లాన్ 'జునూన్'

హైమంతి సేన్ స్థానిక బడిలో చేర్పించిన పిల్లలు సరిగా బడికి వెళ్లకుండా మళ్లీ భిక్షమెత్తేవారు. స్కూల్‌కు వెళ్లి సంప్రదిస్తే.. 'పిల్లలు స్కూళ్లో సరిగా ఉండలేకపోతున్నారు. వారి వాల్ల మిగతా పిల్లలకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వారిని తీసుకెళ్లండి' అంటూ యాజమాన్యం సమాధానం ఇచ్చింది. దీంతో ఈ పిల్లల్ని తానే స్వయంగా సరిచేయాలని నిర్ణయించుకున్నది హైమంతి. పిల్లలకు శిక్షణ ఇస్తూ, క్రమక్రమంగా బడిపై ఆసక్తిని పెంచాలని నిశ్చయించుకున్నది. ఆఫీస్ ముగిశాక రోజూ గంటపాటు పిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించింది. ఇందుకోసం 'జునూన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. కండివలి రైల్వేస్టేషన్ స్కైవాక్‌నే పిల్లలకు పాఠాలు చెప్పేందుకు వేదికగా చేసుకున్నది. అలా ప్రతి రోజూ పిల్లలకు చదువు చెప్పడం ప్రారంభించింది హైమంతి.

### 'జునూన్'తో కనిపించిన మార్పు!

వీధిబాలలను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకొచ్చిన హైమంతిని చాలామంది గమనించారు. ఆ స్కైవాక్ పై వెళ్లే కొంతమంది యువతకు ఆమె సంకల్పం నచ్చింది. తన ఆశయం నచ్చిన కొందరు యువతీయువకులు ఆ ఎన్జీవోలో వలంటీర్లుగా చేరారు. అప్పటి నుంచి జునూన్ సేవలు ఒక ప్రణాళికాబద్ధంగా సాగుతున్నాయి. ప్రతి శని, ఆదివారాలు పిల్లలకు డ్యాన్స్, కళలు, ఇతర నైపుణ్యాలు, చేతివృత్తులపై శిక్షణ ఇస్తారు. మంగళ, గురు, శుక్రవారాల్లో స్కూళ్లలోని పాఠాలు చెబుతారు. బుధవారం మాత్రం పిల్లలు ఈ టీచర్లు చేసే వీధి నాటకాలను చూస్తారు. ఆసక్తి ఉన్న కొందరు పిల్లలు అందులో పాల్గొంటారు. జునూన్ వల్ల పిల్లల్లో చాలా మార్పు వచ్చింది.

... జెస్సీ తోటపల్లి



**అతనికి చిన్నప్పటి నుంచి పాటలంటే పిచ్చి. అవే అతనిలో ఎనర్జీని పెంచి, స్టెప్పులేపిస్తాయి. ఆ పాటలే ప్రేక్షకులతోనూ విజిల్స్ వేయిస్తాయి. అందుకే అతనికి పాటంటే ప్రాణం. దివంగత సంగీత దర్శకుడు చక్రీ ట్రంప్‌కార్డ్‌గా పేరొంది.. ఆ పేరును నిలబెట్టడానికి తపన పడుతున్నాడు సింగర్ సింహా. ఒకవైపు వృత్తి, మరోవైపు ప్రవృత్తిని బ్యాలెన్స్ చేస్తూ గాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. మారుమూల పల్లెలో పుట్టి.. హైదరాబాద్ మహానగరంలో పెరిగి.. 36 దేశాల్లో పాటల ప్రదర్శనలు ఇచ్చిన సింహా గురించి అతని మాటల్లోనే.**

# ఆ పాటకు 16 అవార్డులు!

నేను పుట్టింది రాజమండ్రి. పెరిగింది, చదువుకున్నదంతా హైదరాబాద్‌లోనే. అమ్మ సుబ్బలక్ష్మి, నాన్న సోమయాజులు. 30 యేండ్లుగా అంతా హైదరాబాద్‌లోనే ఉంటున్నాం. నాకు పాటలు పాడడం చాలా ఇష్టం. ఒకరకంగా పిచ్చి అని చెప్పాలి. స్కూల్‌లో ఏ ఈవెంట్ జరిగినా.. ముందుగా నేను పాట పాడాల్సిందే. బాలసుబ్రహ్మణ్యం పాటలు ఎక్కువగా వినేవాడిని. ఇంటర్ నుంచే పోటీల్లో పాల్గొనేవాడిని. వెళ్లి పాడామా? లేదా? అన్నదే ముఖ్యం. నా చుట్టుపక్కల జరిగిన ఏ పాటల పోటీని కూడా నేను వదిలిపెట్టలేదు. కిషోర్ కుమార్‌వి హిందీ పాటలు ఎక్కువగా వినేవాడిని. డిగ్రీ కాస్ట్ అకౌంటెన్స్ భవన్స్ కాలేజ్‌లో చేశా. అప్పటి నుంచే మెల్లిగా యాంకరింగ్ మొదలు పెట్టా. తర్వాత డాక్యుమెంటరీలకు వాయిస్ ఓవర్ చెప్పడం ప్రారంభించా. యాడ్స్‌కు కూడా వాయిస్ ఓవర్ ఇచ్చా. ఆ సమయంలో రవివర్మ అనే గాయకుడు, కీబోర్డు ప్లేయర్ సుధాకర్ పరిచయమయ్యారు. వీరిద్దరూ సంగీత దర్శకుడు చక్రీగారి దగ్గర పనిచేస్తున్నారు. అలా చక్రీగారిని కలిసే అవకాశం వచ్చింది.

### అనుకోకుండా ఒకరోజు..



ఒకరోజు వరంగల్‌లో చక్రీగారి పాటల కార్యక్రమం బాగా జరుగుతున్నది. పెద్ద సంఖ్యలో ఆడియన్స్ వచ్చారు. నేనూ అక్కడి వెళ్లా. చక్రిగారితో 'సర్! నేను వాళ్లతో కోరస్ అయినా పాడతా' అన్నాను. అయితే.. ఆ రోజు కార్యక్రమానికి ఉదిత్ నారాయణ గారు రావాల్సి ఉన్నది. ఆయన కొన్ని కారణాలతో రాలేకపోయారు. దీంతో నాకు పాట పాడడానికి అవకాశం ఇచ్చారు. స్టేజ్‌మీదకు వెళ్లడంతోనే జోష్‌తో ఇంగ్లిష్‌లో ఇరగదీసి.. 'లేలేత నవ్వులా పింగాణి బొమ్మలా' అంటూ కౌసల్యగారితో పాట అందుకున్నా. ఆ పాటతో నాలో ఉన్న సింగర్‌ను గుర్తించారు చక్రీగారు. ఒక్కపాట ఇస్తానన్న చక్రీగారు నాతో ఆ ప్రోగ్రాంలో మూడు పాటలు పాడించారు. ఆ తర్వాత 'రేపు ఒకసారి వచ్చి ఆఫీస్‌లో కలువ్' అన్నారు.

### ఒక్క ఛాన్స్ ప్లీజ్..

'సార్.. అందరూ ఎవరెవరి పాటలు వాళ్లు స్టేజ్‌మీద పాడుతున్నారు. నాక్కూడా ఒక్క అవకాశం ఇవ్వండి సర్' అని చక్రీగారితో అన్నాను. 'ఓకే ఇచ్చేద్దాం' అన్నారు. ఆ సమయంలో 'నేను పెళ్లికి రెడీ', 'అందరూ దొంగలే.. దొరికితే' అనే సినిమాల్లో పాడడానికి అవకాశం కల్పించారు. వాటిల్లో 'గుమ్మా గుమ్మా పండిస్తావా.. వయ్యారాలే వడ్డిస్తావా' అనేపాట హిట్ అయింది. అది కూడా ఉదిత్ గారు పాడాల్సిన పాట. ఆ సినిమా ప్రొడ్యూసర్స్, డైరెక్టర్ స్టూడియోలో ఉదిత్ నారాయణే పాడుతున్నారని అనుకున్నారు. పాట పూర్తయ్యాక నన్ను చూసి షాక్ అయ్యారు. నా వాయిస్ కూడా కొంచెం అలాగే ఉండడంతో నాకిచ్చిన మొదటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నా. అలా చక్రీగారు నాకు గురువు అయ్యారు. అప్పటి నుంచి సింగర్‌గా నేనేంటో నిరూపించుకున్నా. స్నేహానికి ప్రాణమిచ్చే చక్రీగారు తన తుదిశ్వాస వరకూ నాకు అవకాశాలు ఇచ్చారు. నాకే కాదు.. నాలాంటి ఎంతోమందికి ఆయన అవకాశాలిచ్చారు. చక్రీగారు పరిచయం చేసిన గాయకుడిగా ఆయన పేరు వమ్ముకానివ్వకూడదు అనేదే నా తపన.

### ఫిల్మ్‌ఫేర్ తెచ్చిన 'రేసుగుర్రం'



అమెరికాలో ఓ షోలో ఒకసారి తమన్‌గారితో కలిసి పాటలు పాడాను. ఆ పరిచయంతో నాకు ఎన్నో అవకాశాలు ఇస్తున్నారు తమన్. రేసుగుర్రం సినిమా సమయంలో ఓసారి డైరెక్టర్ సురేందర్ రెడ్డి గారు చెన్నైలో కలిశారు. మాటల మధ్యలో ఓ అవకాశం అడిగాను. ఆయన వెంటనే ఆలోచించకుండా 'ఇవాళ చెన్నైలో ఉండగలుగుతావా' అన్నారు. నాకు డ్యూటీ ఉంది సార్ అనగానే.. నాకొక లిరిక్ పంపి రెండ్రోజుల్లో పాడి వినిపించమన్నారు. అదే రేసుగుర్రం సినిమాలోని 'సినిమా సూపిస్త మామా నీకు..' పాట. ఆ పాటను తమన్ లేనప్పుడు సౌండ్ ఇంజినీర్ తో సహాయంతో పాడాను. ఆ పాట ఒకసారి విని సరేందర్‌రెడ్డికి పంపారు తమన్. అది ఆయనకు నచ్చకపోవడంతో పదిమంది పెద్ద సింగర్స్‌తో పాడించారు. ఏమైందో తెలియక.. మళ్లొక అవకాశం అడిగా. ఆ పాటలో తెలంగాణ యాస లేదు అందుకే రిజెక్ట్ చేశాం అన్నారు. ఆ విషయం నాకు వాళ్లు ముందే చెప్పలేదు. కాబట్టి.. ఒక్కఛాన్స్ ఇవ్వండని అడిగా. వెంటనే పాటలో మార్పులు చేసుకుంటూ పాడాను. ఆ పాట విని.. చాలా ఉత్సాహంతో రిథమ్ కొట్టారు తమన్. అల్లు అర్జున్ ఎనర్జీకి ఈ సాంగ్ ఎనర్జీ సరిపోవడంతో ఫైనల్ చేశారు సురేందర్‌రెడ్డి. అలా ఆ పాట సూపర్ హిట్ అవడం తర్వాత 'ఫిల్మ్‌ఫేర్ అవార్డు' రావడం జరిగిపోయాయి. ఆ పాట విని చక్రీగారు ప్రత్యేకంగా అభినందించారు. ఆ పాటకే 2016లో సైమా, గామా వంటివి 15 అవార్డులు వచ్చాయి. బన్నీ కూడా ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.

### చాలా అవకాశాలిచ్చారు..

రేసుగుర్రం పాట విని దేవీశ్రీ ప్రసాద్, మణిశర్మ గారు ఎంతో అభినందించారు. వారు కూడా చాలా అవకాశాలు ఇచ్చారు. బాలకృష్ణగారి సింహా సెంట్‌మెంట్‌కు నేనూ తోడయ్యా. అప్పటి నుంచి ఆయన ప్రతీ సినిమాలో 'సింహా పాట పాడాలి' అంటూ.. నాకు అవకాశాలు ఇస్తున్నారు. నేను కూడా ఉదయం ఉద్యోగం చూసుకొని, రాత్రిళ్లు పాటలు పాడేవాడిని. ప్రస్తుతం 'నోవార్టీస్' కంపెనీలో సాఫ్ట్‌వేర్ విభాగంలో ఎస్ఏపీగా పనిచేస్తున్నా. బాలీవుడ్‌లో పాడాలన్నది నా కోరిక. జక్కన్న, ధ్రువ వంటి సినిమాల్లో నటించా. 'భరత్ అనే నేను' సినిమాలో శరత్ కుమార్ గారికి డబ్బింగ్ కూడా చెప్పా. ఇప్పటి వరకు 36 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చా. నా వంతుగా కొన్ని సామాజిక కార్యక్రమాల కోసం ఉచితంగానే పాటలు పాడుతున్నా. నన్ను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు.

... డప్పు రవి

## అదిరిపోయే ఫిట్‌నెస్‌తో..

అలనాటి బుల్లితెర అందాలతార మందిరాబేడీ.. 47 యేండ్ల వయసులో కూడా సోషల్ మీడియాను షేక్ చేస్తున్నది. ఇటీవల కాలంలో వరుసగా తన ఫిట్‌నెస్ ఫొటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ.. కుర్రకారు మతులు



పోగొడుతున్నది మందిరాబేడీ. 90వ దశకంలో 'శాంతి' టీవీ సీరియల్ ద్వారా హోమ్లీ కేరెక్టర్‌తో బుల్లితెరకు పరిచయమైంది మందిరాబేడీ. ఆ తర్వాత క్రికెట్ వ్యాఖ్యాతగా మంచి పేరు సంపాదించుకున్నది. ఇటీవలే 47వ వసంతంలోకి అడుగుపెట్టింది. గతవారం ఓ వెకేషన్‌లో తీసిన బికినీ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల సూపర్ ఫిట్‌నెస్ బాడీతో జిమ్‌లో సాధన చేస్తున్న ఓ పిక్‌ను తన సోషల్ మీడియాలో ఖాతాల్లో షేర్ చేసింది. అదిరిపోయే ఫిట్‌నెస్‌తో ఉన్న ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## లోకమే ఫిదా అయింది!



ఈ ఫొటోలో ఉన్న మహిళను గుర్తుపట్టారా? మూడు ఫ్రేముల్లో ఉన్నది ఒక్కరే. ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే లైఫ్ ఎంత కలర్‌ఫుల్‌గా ఉంటుందో అనడానికి ఈమె ఒక నిదర్శనం. ఇంతకీ ఈమె ఎవరో తెలుసా? ఈ ప్లాట్‌ఫాం గాయని పేరు రానుమండల్. తను మొన్నటి వరకూ బెంగాల్‌లోని రాణాఘాట్ రైల్వే స్టేషన్‌లో భిక్షం ఎత్తుకొని బతికింది. ఇప్పుడు తన ప్రతిభతో టీవీ కార్యక్రమాల్లో పాడేందుకు సిద్ధమైంది. ఇంతకీ విషయమేంటంటే.. ఓ కొన్ని రోజుల క్రితం ప్రముఖ సీనియర్ గాయనీ, మ్యూజిక్ డైరెక్టర్ లతా మంగేష్కర్ పాడిన 'ఏక్ ప్యార్ నగ్మా' అనే పాటను మండల్ అద్భుతంగా పాడింది. ఆమె పాట వింటుంటే లతా మంగేష్కర్ పాడిందా? అన్నట్టుగా ఉన్నది. ఆమె పాడుతుండగా వీడియో తీసి కొందరు Barpeta town అనే సోషల్ మీడియా పేజీలో పోస్ట్ చేశారు. ఈ వీడియో పెట్టిన వెంటనే 20 లక్షలకుపైగా వ్యూస్ వచ్చాయి. ప్రస్తుతం 42 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. 64 వేలకు పైగా కామెంట్లు, 60వేలకు పైగా షేర్లు సొంతం చేసుకున్నది మండల్ పాట. ఇలా తన టాలెంట్‌తో సోషల్ మీడియాలో ఫేమస్ అయింది. దీంతో ఏకంగా టీవీ ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి తన పాటతో అలరించేందుకు రెడీ అయింది మండల్. ముంబైకి చెందిన ఓ ఎంటర్‌టైన్ టీవీ షోలో నిర్వహించబోయే 'మ్యూజిక్ రియాలిటీ షో'లో మండల్ తన పాటను వినిపించబోతున్నది. మేకప్ రూంలో మండల్ మేకప్ వేసుకుంటున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## సుడోకు

డైలీ సుడోకు 118 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 3 | 1 | 6 | 5 | 8 | 4 | 9 | 2 |
| 9 | 2 | 8 | 4 | 1 | 7 | 5 | 6 | 3 |
| 4 | 5 | 6 | 9 | 2 | 3 | 8 | 7 | 1 |
| 2 | 4 | 7 | 3 | 8 | 6 | 9 | 1 | 5 |
| 1 | 8 | 5 | 2 | 9 | 4 | 7 | 3 | 6 |
| 6 | 9 | 3 | 5 | 7 | 1 | 2 | 8 | 4 |
| 3 | 1 | 9 | 8 | 4 | 2 | 6 | 5 | 7 |
| 8 | 6 | 4 | 7 | 3 | 5 | 1 | 2 | 9 |
| 5 | 7 | 2 | 1 | 6 | 9 | 3 | 4 | 8 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -119

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | | | | | | | 9 | |
| | | | 4 | | | | | 7 |
| | 7 | 8 | 9 | | | | 1 | |
| | | | 2 | | 4 | | | 6 |
| | 3 | 1 | | | | 7 | 5 | |
| 4 | | | 5 | | 7 | | | |
| | 4 | | | | 2 | 5 | 6 | |
| 7 | | | | | 3 | | | |
| | 1 | | | | | | | 2 |

## ట్వీట్




సంపూర్ణేశ్.. రూపక్.. రాజేశ్.. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో సరికొత్త శైలి సృష్టించారు. మీ కష్టం వృథా కాలేదు. నమ్మకంతో చేశారు కాబట్టే కొబ్బరిమట్ట విజయాన్ని ఎంజాయ్ చేయగలుగుతున్నారు. ఈ సందర్భంగా కొబ్బరిమట్ట టీం అందరికీ అభినందనలు.

**డైరెక్టర్ మారుతి**
@DirectorMaruthi



మారుతిని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
4,00,763

## కామన్‌మ్యాన్ వాయిస్

కాళేశ్వరం నీళ్లల్ల మునిగిపోవుట్ల బీజేపీది 80% వాటా. కాంగ్రెస్‌ది 20% వాటా.
– Annaji Rajender

మానవత్వం, మంచితనం మానవ సహజలక్షణాలని మనిషి ఎంతగా మర్చిపోయాడంటే?.. ఎవరైనా మానవత్వంతో సహాయం చేస్తే 'మీరు దేవుడయ్యా' అనేంతగా!
– Siddu Reddy

రాహుల్ బాబా జాతకం మంచిగ లేనట్టుంది. అటు చూస్తే దేశంలో కాంగ్రెస్ వాషవుట్ అయ్యేట్టు కనిపిస్తుంది. ఇటుచూస్తే ఆయన ఎంపీగా ఉన్న వాయినాడ్ వరదలకు వాషవుట్ అవుతున్నది!
– Katpally Santosh Reddy

## వైరల్ వీడియో





**'కత్తులు లేవిప్పుడు.. చిందే నెత్తురు లేదిప్పుడు.. యుద్ధంచేసే పద్ధతి మొత్తం మారింది ఇప్పుడు' అంటూ ఆర్జీవీ కొత్త యుద్ధం యూట్యూబ్‌లో నంబర్ వన్ ట్రెండింగ్‌లో ఉంది!**

Kamma Rajyam Lo Kadapa Reddlu Title Song | Kamma Rajyam Lo Kadapa Reddlu Movie | RGV | Ravi Shankar

Total views : 5,67,788+

Published on Aug 9, 2019

## ఈ- ఫైలింగ్‌లో సీనియర్ సిటిజన్లకు మినహాయింపు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐటీరిటర్న్‌ల ఈ- ఫైలింగ్‌లో సీనియర్ సిటిజన్లకు మినహాయింపు కల్పించినట్టు ఆదాయపన్నుశాఖ తెలిపింది. మిగతావారందరూ ఈ నెలాఖరులోగా ఎలక్ట్రానిక్ ఫైలింగ్‌ను పూర్తిచేయాలని హైదరాబాద్ విభాగం అధికారులు పేర్కొన్నారు. గడువులోగా ఈ-ఫైలింగ్ చేయకుంటే ఐటీ 234ఎఫ్ యాక్ట్ ప్రకారం వడ్డీతోసహా మరో 5 వేల రూపాయలను అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 31వరకు ఉన్న రిటర్న్‌ల గడువును సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ ఆగస్టు 30 వరకు పొడిగించిందని తెలిపారు. ఈ- ఫైలింగ్ ద్వారా చెల్లింపులపై అవగాహన కల్పించేందుకు ఐటీశాఖ సమాచార ప్రచారరథాలను ప్రారంభించింది. ఆగస్టు 24వరకు హైదరాబాద్‌లో ప్రచారరథాలు తిరుగనున్నాయి.

## రక్షణ శాఖలో పనిచేసే పురుషులకూ పిల్లల సంరక్షణ సెలవు

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** రక్షణ శాఖలో పని చేసే పురుషులకూ ఇకపై పిల్లల సంరక్షణ సెలవులు వర్తించనున్నాయి. సిబ్బంది, శిక్షణ విభాగం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు రక్షణ శాఖలోని సర్వీసు విధులు నిర్వహించే మహిళా అధికారులకే పిల్లల సంరక్షణ సెలవు తీసుకునే వెసులుబాటు ఉండేది. సివిల్ విధులు నిర్వహించే మహిళా ఉద్యోగినులకు కూడా ఇటీవల దీన్ని వర్తింపజేశారు. తాజాగా సర్వీస్ విధులు నిర్వహించే ఒంటరి పురుషులకు కూడా పిల్లల సంరక్షణ సెలవు తీసుకునే అవకాశం కల్పించారు. 40 శాతం వైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఈ సెలవు వర్తిస్తుంది. అయితే గతంలో ఇది 15 రోజులు ఉండగా 5 రోజులకు కుదించారు. అలాగే పిల్లల గరిష్ఠ వయసు 22 ఏండ్ల నిబంధనను తొలిగించారు.

## క్రిస్టియన్లకు సబ్సిడీ రుణాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్రిస్టియన్ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ రుణాలను అందజేయనున్నది. ఈ నెల 24వరకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55 ఏండ్ల మధ్య వయస్సు ఉండి, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ. 2 లక్షల వార్షిక ఆదాయం ఉన్న క్రిస్టియన్ మైనార్టీలు సబ్సిడీరుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ. లక్షలోపు రుణానికి 80 శాతం, లక్ష నుంచి 2 లక్షల రుణానికి 70 శాతం, రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల రుణానికి 60 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. www.tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. పూర్తి వివరాల కోసం www.tscmfc.inను సంప్రదించాలని కోరారు.



# సైబర్ ముప్పును దీటుగా ఎదుర్కొంటాం

పౌరులు, దేశ రక్షణకు ప్రత్యేక సైబర్ రక్షణ వ్యవస్థ ఏర్పాటు ■ నేర పరిశోధనకు అందుబాటులోకి అధునాతన డాటాబేస్

'సైబర్ సెక్యూరిటీ, ఇమేజ్ ప్రాసెసింగ్' సదస్సులో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సైబర్ దాడుల ముప్పు నుంచి పౌరులు, దేశాన్ని కాపాడేందుకు పటిష్ఠచర్యలు తీసుకొంటున్నట్టు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి చెప్పారు. సైబర్ నేరాలు, సైబర్ దాడులపై ప్రత్యేకంగా దృష్టిసారించేందుకు ప్రత్యేక విభాగాన్ని సైతం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. 'సైబర్ సెక్యూరిటీ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్' అంశంపై ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. రెండురోజులపాటు జరుగనున్న ఈ సదస్సును శనివారం కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ టెక్నాలజీ పెరుగడంతో ఎదురవుతున్న ముప్పును, సవాళ్లను ఎదుర్కొనేలా మరిన్ని కఠినచట్టాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. నేర పరిశోధనలో ఎంతగానో ఉపయోగపడే క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్) ద్వారా అన్ని రాష్ట్రాల్లోని నేరస్థుల వివరాలతో కూడిన డాటాబేస్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. నేర పరిశోధనలో ఈ సమాచారం దర్యాప్తు సంస్థలకు ఎంతో ఉపయోగంగా ఉంటోందన్నారు. దేశ సరిహద్దుల వెంబడి భద్రత విధుల్లోనూ సాంకేతికత వినియోగం పెంచామన్నారు. ఇండో-పాకిస్థాన్ సరిహద్దులో చొరబాట్లను నివారించేందుకు కశ్మీర్‌లో స్మార్ట్ ఫెన్సింగ్ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభమైనట్టు తెలిపారు. దేశంలో లైంగికదాడులకు పాల్పడుతున్నవారి ఆటకట్టించేందుకు, వారికి ఉద్యోగాలు రాకుండా చేసేలా, బ్యాంకు రుణాలు అందకుండా చేసేందుకు వారి వివరాలతో డాటాబేస్ సిద్ధంచేస్తున్నట్టు తెలిపారు. దేశంలోని పోలీస్‌స్టేషన్లను అనుసంధానిస్తున్నామని, దీని వల్ల ఏ ప్రాంతంలో ఏ తరహా నేరాలు జరుగుతున్నాయన్నది తెలుసుకొనే వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమలో ఎమ్మెల్సీ ఎన్ రాంచందర్ రావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ సీఈవో డాక్టర్ బీ శ్రీరాం, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ జీ రామేశ్వర్‌రావు, గౌరవ కార్యదర్శి టీ అంజయ్య, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో 'సైబర్ సెక్యూరిటీ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్' సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో సీపీ అంజనీకుమార్ కూడా ఉన్నారు.

### వరంగల్ పోలీసులకు అభినందనలు

తొమ్మిది నెలల చిన్నారిపై జరిగిన లైంగికదాడి కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసి, నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన వరంగల్ పోలీసులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. 51 రోజుల్లోనే నిందితుడికి ఉరిశిక్ష పడేలా పోలీసులు సీసీటీవీలను వినియోగించి సాక్ష్యాలు సేకరించిన తీరును ప్రశంసించారు.

# సాధారణ స్థితికి జమ్ము

- జమ్ములో తెరుచుకున్న విద్యా సంస్థలు
- ఐదు జిల్లాల్లో ఆంక్షలు ఎత్తివేత
- రెండు జిల్లాల్లో కర్ఫ్యూ సడలింపు

**జమ్ము, న్యూఢిల్లీ, ఆగస్టు 10:**

ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ను రద్దు చేసిన నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇప్పుడిప్పుడే కాస్త సద్దుమణుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సెక్షన్ 144 కింద విధించిన ఆంక్షలను ఐదు జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అలాగే దోడా, కిష్త్వార్ జిల్లాల్లో కర్ఫ్యూను సడలించింది. జమ్ము రీజియన్ పరిధిలోని ఐదు జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు శాతం కూడా పెరిగింది. సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ 'జమ్ము, కతువా, సాంబా, ఉద్ధంపూర్, రేసి జిల్లాల్లో అమల్లో ఉన్న ఆంక్షలను ఎత్తివేశాం. ఈ జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, కళాశాలలు శనివారం తెరుచుకున్నాయి' అని తెలిపారు. ఆంక్షలు అమల్లోకి వచ్చిన ఈ నెల 5 నుంచి ఇప్పటి వరకు ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోలేదని, ఇప్పుడిప్పుడే పరిస్థితి సద్దుమణుగుతున్నదని చెప్పారు. దుకాణాలు, కూరగాయల మార్కెట్లు కూడా తెరుచుకున్నాయని, ప్రజల రాకపోకలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు కూడా ప్రశాంతంగా జరిగాయని వివరించారు. పూంచ్, రాజౌరీ, రాంబాన్ జిల్లాల్లో మాత్రం ఇంకా ఆంక్షలు కొనసాగుతున్నాయని అధికారి చెప్పారు.



జమ్ములో ఆంక్షల ఎత్తివేతతో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



అనంత్‌నాగ్‌లో స్థానికులతో ముచ్చటిస్తున్న అజిత్‌దోవల్

### అనంత్‌నాగ్ జిల్లాలో దోవల్ పర్యటన

జమ్ముకశ్మీర్‌లో జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ క్షేత్రస్థాయి పర్యటన కొనసాగుతూనే ఉన్నది. ఆదివారం ఆయన అనంత్‌నాగ్ జిల్లాలో గోవుల విక్రేతలు, స్థానికులతో మాట్లాడారు. గోవులు, గొర్రెలను ఎంతకు అమ్ముతుంటారని, వాటికి ఎలాంటి మేత పెడుతుంటారని విక్రేతలను అడిగి తెలుసుకున్నారు. మొత్తానికి అజిత్ దోవల్ వారిలో ఒకరిలా కలిసిపోయి బాగోగులు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆర్టికల్ 370ను రద్దు చేసినప్పటి నుంచి జమ్ముకశ్మీర్‌లో క్యాంప్ వేసిన అజిత్ దోవల్ ప్రధానంగా ఉగ్రవాద ప్రభావిత జిల్లాల్లో ఎక్కువగా పర్యటిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరించడమే కాకుండా వారిలో మనోధైర్యాన్ని నూరిపోయడానికి ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు ఆర్టికల్ 370ను రద్దు చేసిన తర్వాత కశ్మీర్‌లో అక్కడక్కడ చెదురుమదురు ఆందోళనలు మాత్రమే జరిగాయని, వాటిలో కూడా 10 నుంచి 20 మంది మాత్రమే పాల్గొన్నారని కేంద్ర హోంశాఖ శనివారం తెలిపింది. ఇంకోవైపు బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిళ్లకు ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను వేగవంతం చేయాలని జమ్ము కశ్మీర్ ఎన్నికల అధికారి (సీఈవో) శైలేంద్రకుమార్‌ను గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఆదేశించారు.

### మహాత్ముడిని ఆదర్శంగా తీసుకోవాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/మారేడుపల్లి:** జాతిపిత మహాత్మా గాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. మహాత్ముడి 150వ జయంతి సందర్భంగా శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 'మన మహాత్ముడు' పేరిట ఏర్పాటుచేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. దేశ పౌరులందరూ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో మహాత్మాగాంధీతో రైల్వేలకు ఎంతో అనుబంధం ఉన్నదని చెప్పారు. గాంధీ జీవితం, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పోరాటం, వివిధ దశలు.. ఆవిష్కరించేలా అరుదైన చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, సికింద్రాబాద్ డీఆర్ఎం ఆనంద్ భాటియా, ఎస్సీఆర్ సీపీఆర్వో సీహెచ్ రాకేశ్, రీజినల్ ఔట్‌రీచ్ బ్యూరో డైరెక్టర్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### జమ్ముకశ్మీర్‌లో అదుపులోనే పరిస్థితి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జమ్ముకశ్మీర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని, కర్ఫ్యూను అంచెలవారీగా తొలగిస్తున్నట్టు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి చెప్పారు. మరో 10, 15 రోజుల్లో పూర్తి శాంతియుత వాతావరణం నెలకొనే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. శనివారం సైబర్ సెక్యూరిటీ అంశంపై సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టికల్ 370ని రద్దుచేసిన తర్వాత కశ్మీరీయుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయన్నారు. కొన్ని దశాబ్దాలుగా కశ్మీర్‌లో కొనసాగుతున్న కుటుంబపాలనకు ప్రధాని మోదీ చరమగీతం పాడారని చెప్పారు. సాహసోపేతమైన నిర్ణయం తీసుకొన్న ప్రధాని మోదీకి దేశవ్యాప్తంగా అన్ని వర్గాల, ప్రాంతాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్నదని అన్నారు. లేహ్, లద్దాఖ్, కార్గిల్ ప్రాంతాలను బౌద్ధక్షేత్రాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీవైవోపీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్

## ఏపీలో గోవుల మృతి కారకులపై చర్య తీసుకోవాలి

టీవైవోపీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలోని తాడేపల్లి కొత్తూరు గోశాలలో వంద గోవులు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణచేసి, బాధ్యులపై చర్య తీసుకోవాలని తెలంగాణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీవో నేత ఎంబీ కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని టీవైవోపీఏ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇంకాకొన్ని గోవులు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండటం అత్యంత బాధాకరమన్నారు. గో సంరక్షణను ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సమావేశంలో టీవైఏపీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చోళ ఓంప్రకాశ్, బ్రహ్మానంద్ యాదవ్, పరమేశ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### విచారణ జరిపిస్తాం

ఏపీ మంత్రి మోపిదేవి

**అమరావతి:** విజయవాడ శివారులోని కొత్తూరు తాడేపల్లి గోశాలలో వంద ఆవులు మృతి చెందిన ఘటనపై విచారణ జరిపిస్తామని ఏపీ పశు సంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారీ సంఖ్యలో గోవులు మృతిచెందడం బాధాకరమని, విచారణ నివేదిక రాగానే కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని అన్ని గోశాలల్లో ఉన్న గోవుల పరిస్థితిపై తనిఖీలు చేపడుతామని చెప్పారు. కొత్తూరు తాడేపల్లి గోశాలలో ఇప్పటివరకు 101 గోవులు మృతిచెందగా, మరో 20 గోవుల పరిస్థితి విషమంగా ఉన్నది. శుక్రవారం గోశాలకు వచ్చిన 22 టన్నుల పశుగ్రాసం మీదే నిర్వాహకులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

# ఢిల్లీ-లాహోర్ బస్సు నిలిపివేత

- కరాచీ వెళ్లేందుకు థార్ ఎక్స్‌ప్రెస్‌కు అనుమతి
- ఇదే చివరి సర్వీస్ అన్న పాక్ మంత్రి
- భారత్‌తో వాణిజ్య సంబంధాలు అధికారికంగా బంద్
- ఆర్టికల్ 370 రద్దుకు నిరసనగా పాకిస్థాన్ చర్యలు



శనివారం అమృత్‌సర్‌కు చేరుకున్న పాకిస్థాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బస్సు


**ఇస్లామాబాద్, ఆగస్టు 10:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా పాకిస్థాన్ చర్యలను కొనసాగిస్తున్నది. ఇరు దేశాల సరిహద్దుల గుండా నడిచే రెండు రైళ్లను ఇప్పటికే నిలిపివేసిన పాక్.. తాజాగా ఢిల్లీ-లాహోర్ బస్సు సర్వీసులను కూడా సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అలాగే భారత్‌తో వాణిజ్య సంబంధాలను శనివారం అధికారికంగా తెంచేసుకున్నది. 1999 ఫిబ్రవరిలో ఢిల్లీ-లాహోర్ బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. అయితే 2001లో భారత పార్లమెంట్‌పై దాడి తర్వాత సర్వీసులు కొంత కాలం పాటు నిలిచిపోయాయి. 2003 జూలైలో తిరిగి పునరుద్ధరించారు. తాజాగా మరోసారి నిలిపివేశారు. జాతీయ భద్రతా కమిటీ సమావేశంలో నిర్ణయించిన మేరకు బస్సు సర్వీసులను నిలిపివేస్తున్నట్లు పాకిస్థాన్ మంత్రి మురాద్ సయీద్ శనివారం తెలిపారు. ఢిల్లీ గేట్ సమీపంలోని అంబేద్కర్ స్టేడియం టెర్మినల్ నుంచి ఈ బస్సు సర్వీసులు నడుస్తాయి. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(డీటీసీ)కు చెందిన బస్సులు ప్రతి సోమవారం, బుధవారం, శుక్రవారం.. పాకిస్థాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (పీటీడీసీ) బస్సులు ప్రతి మంగళవారం, గురువారం, శనివారం ఢిల్లీ నుంచి లాహోర్‌కు బయలుదేరుతాయి. తిరిగి అటునుంచి, డీటీసీ బస్సులు ప్రతి మంగళవారం, గురువారం, శనివారం.. పాక్ బస్సులు ప్రతి సోమవారం, బుధవారం, శుక్రవారం ఢిల్లీకి బయలుదేరుతాయి. భారత్‌తో సంబంధాలను కనిష్ఠ స్థాయికి తగ్గించుకోవాలన్న నిర్ణయానికి అనుగుణంగా గురువారం సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను నిలిపివేసిన పాక్.. ఆ మరునాడే థార్ ఎక్స్‌ప్రెస్ (జోధ్‌పూర్-కరాచీ) సర్వీసులను కూడా నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే 165 మంది ప్రయాణికులతో శనివారం వేకువజామున 1 గంటకు జోధ్‌పూర్ నుంచి బయలుదేరిన థార్ ఎక్స్‌ప్రెస్ కరాచీ వెళ్లేందుకు పాక్ అనుమతినిచ్చింది. ఇదే చివరి సర్వీస్ అని పాక్ మంత్రి రషీద్ వ్యాఖ్యానించారు. మరోవైపు ఇద్దరు ప్రయాణికులతో కూడిన పీటీడీసీ బస్సు శనివారం ఉదయం లాహోర్‌కు బయలుదేరిందని, అలాగే ముగ్గురు ప్రయాణికులతో కూడిన డీటీసీ బస్సు లాహోర్ నుంచి ఢిల్లీకి వస్తున్నదని డీటీసీ అధికారి ఒకరు తెలిపారు.

### పాక్ వాదనను పట్టించుకోని అంతర్జాతీయ సమాజం

జమ్ముకశ్మీర్ అంశంలో భారత్‌కు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి, అమెరికాతోపాటు అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్థాన్ చేస్తున్న లాబీయింగ్ ఫలించడం లేదు. పాక్ వాదనను ప్రపంచ అధినేతలు పట్టించుకోవడం లేదు. కశ్మీర్ అంశాన్ని సీమాంతర ఉగ్రవాదానికి, అక్రమ చొరబాట్లకు వినియోగించుకోవడానికి వీల్లేదని వారు పాక్‌కు నిర్మొహమాటంగానే చెబుతున్నట్లు దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తోపాటు ఆ దేశ మంత్రులు, ఉన్నతాధికారులు అమెరికా చట్టసభ సభ్యులకు తమ వాదనను తెలియజేస్తున్నారు. మధ్యవర్తిత్వం వహించకుంటే పరిస్థితులు యుద్ధానికి దారి తీస్తాయని చెబుతున్నారు. మరోవైపు, కశ్మీర్ అంశం తమ అంతర్గత వ్యవహారమని భారత్ తేల్చిచెప్పింది. కశ్మీర్‌లో పరిస్థితి భయానకంగా ఉన్నట్టుగా అంతర్జాతీయ సమాజాన్ని నమ్మించేందుకు పాక్ యత్నిస్తున్నదని ధ్వజమెత్తింది. అయితే ఆ దేశ వాదనలను ప్రపంచ దేశాలు విశ్వసించబోవని స్పష్టం చేసింది.

## నోయిడాలో మూక దాడి

- చనిపోయిన పశువులను తరలిస్తున్న వ్యక్తిపై దుర్మార్గం
- ఐదుగురు అరెస్ట్, యూపీలో ఘటన



**నోయిడా, ఆగస్టు 10:** చనిపోయిన పశువులను తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై మూక దాడి జరిగిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఘజియాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నివాసితులు పెంచుతున్న పశువుల్లో కొన్ని మృతి చెందాయి. చిజర్సీ నది సమీపంలోని చనిపోయిన జంతువులను ఖననం చేసే చోటుకు వీటిని తరలించేందుకు కాంట్రాక్టర్ మహేంద్రకు అధికారులు అనుమతి ఇచ్చారు. మృతి చెందిన 3 ఆవులు, రెండు దూడలు, 12 గేదె దూడల కళేబరాలను ఓ వాహనంతోపాటు దానికున్న ట్రాలీలో తరలిస్తున్నాడు. అయితే గోవులను వధించి తరలిస్తున్నారన్న అనుమానంతో ఓ మూక గౌర్ నగరం సమీపంలో ఆ వాహనాన్ని అడ్డుకున్నది. డ్రైవర్‌పై దాడి చేయడంతోపాటు వాహనాన్ని ధ్వంసం చేశారు. బాధితుడు పోలీసులకు ఫోన్ చేయగా వెంటనే సంఘటన స్థలానికి వచ్చి మూకలోని ఐదుగురిని అరెస్ట్ చేశారు. పరారిలో ఉన్న మరి కొందరి కోసం గాలిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. కాంట్రాక్టర్ తరలిస్తున్న పశువుల్లో నోయిడాకు చెందిన ఓ ఎన్జీవో సంస్థకు చెందిన చనిపోయిన ఆవు, ఢిల్లీ హైకోర్టు న్యాయవాదికి చెందిన మృతి చెందిన ఆవు కూడా ఉన్నాయని, వాటిని తరలించాలని వారు కోరడంతో ఘజియాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆ మేరకు కాంట్రాక్టర్‌కు అనుమతి ఇచ్చారని ఆయన వివరించారు. కాంట్రాక్టర్‌పై దాడికి యత్నించిన మూకపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

## పేలిన పెట్రోల్ ట్యాంకర్ 62 మంది సజీవదహనం

టాంజానియాలో ఘోర దుర్ఘటన

**దార్ ఎస్ సలామ్, ఆగస్టు 10:** తూర్పు ఆఫ్రికా దేశమైన టాంజానియాలో ఘోర దుర్ఘటన చోటుచేసుకున్నది. ప్రమాదానికి గురైన ఒక చమురు ట్యాంకర్ నుంచి లీకవుతున్న పెట్రోల్‌ను స్థానికులు సేకరిస్తుండగా ఒక్కసారిగా అది పేలిపోయింది. దీంతో 62 మంది సజీవ దహనం కాగా మరో 70 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. టాంజానియా వాణిజ్య నగరం దార్ ఎస్ సలామ్‌కు 200 కి.మీ దూరంలోని మొరగోరోలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు అధికార మీడియా సంస్థ కేబీసీ పేర్కొంది. ట్యాంకర్ నుంచి పెట్రోల్ సేకరిస్తున్న వారిలో ఒకరు సిగరెట్ కాల్చడంతో ఈ ప్రమాదం జరిగినట్లు వెల్లడించింది. తూర్పు ఆఫ్రికా దేశాల్లో ఇలాంటి ఘటనలు తరుచుగా జరుగుతున్నాయి. 2013లో ఉగాండా రాజధాని కంపాలా శివారులో జరిగిన ఈ తరహా ఘటనలో 29 మంది చనిపోయారు.



పెట్రోల్‌ట్యాంకర్ నుంచి ఎగిసిపడుతున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకసిబ్బంది

## మయన్మార్‌లో 34కు చేరిన మృతుల సంఖ్య

**మావ్లామైన్, ఆగస్టు 10:** మయన్మార్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 34కు చేరింది. కొన్ని రోజులుగా తూర్పు మయన్మార్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మన్ రాష్ట్రంలోని యే ప్యార్ కోన్ గ్రామంలో శుక్రవారం కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో సుమారు 16 ఇండ్లు నేలమట్టమై బురదలో కూరుకుపోయాయి. రంగంలోకి దిగిన సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్నవారిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం నాటికి 34 మృత దేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో 47 మంది గాయపడగా 80 మంది అదృశ్యమైనట్లు వెల్లడించారు. కాగా ప్రమాదం నుంచి బయటపడిన కొందరు తమ వారి ఆచూకీ తెలియక ఆందోళన చెందుతున్నారు.

## వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం ప్రారంభం

**అమరావతి:** గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయాన్ని శనివారం ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పార్టీ కార్యాలయం మనందరిదని పేర్కొన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవ ఫొటోలను ఆయన ట్విట్టర్‌లో షేర్‌చేశారు. కార్యక్రమంలో మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**విద్యాశాఖపై సీఎం జగన్ సమీక్ష**

ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. తొలివిడుతలో 12,918 ప్రాథమిక, 3,832 ఉన్నత పాఠశాలల రూపురేఖలు మార్చాలని నిర్ణయించారు. అదనపు తరగతి గదులు నిర్మించడంతోపాటు మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు, ఫర్నిచర్ వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి క్యాలెండర్ తయారు చేయాలని సూచించారు.

# గల్లీలో సిక్స్ ఎవడైనా కొడతాడు!


'సాహో' చిత్రంలో ప్రభాస్

'**బా**హుబలి' చిత్రంతో అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకున్నారు హీరో ప్రభాస్. ఆ సినిమా తరువాత ఆయన నుంచి వస్తున్న చిత్రం 'సాహో'. ఈ సినిమాపై దేశ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గని స్థాయిలో దర్శకుడు సుజీత్ ఈ చిత్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత భారీగా తెరకెక్కించారు. యువీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 30న తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దాదాపు 300 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ని చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. రెండు వేల కోట్ల బ్యాంకు రాబరీ నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగనుందని తెలుస్తోంది. అండర్‌కవర్ కాప్‌గా ప్రభాస్ కనిపించబోతున్నారు. ఆయన పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా అత్యంత స్టైలిష్‌గా సాగనుంది. 'ఫీల్‌గుడ్ సినిమాకు ముందొచ్చే స్మోకింగ్ యాడ్ లాంటి వాడు..కంటెంట్ కరెక్ట్‌గా వున్నా విజువల్ చాలా డిస్టర్బింగ్‌గా వుంటుంది..' అంటూ ప్రభాస్ పాత్ర ఇంట్రడక్షన్‌ని మురళీశర్మ వివరిస్తున్న తీరు... వైలెన్స్ ఎక్కువైపోయింది రొమాన్స్ కావాలి.. గల్లీలో సిక్స్ ఎవడైనా కొడతాడు.. స్టేడియంలో కొట్టేవాడికే ఒక రేంజ్ వుంటది..' అంటూ ట్రైలర్‌లో ప్రభాస్ చెబుతున్న డైలాగ్‌లు అభిమానుల్ని అమితంగా ఆకట్టుకునేలా వున్నాయి. హాలీవుడ్ యాక్షన్ చిత్రాలకు ఏ మాత్రం తీసిపోని స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రం నాలుగు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 30న విడుదలకానుంది.

# 'ట్రాప్'లో పడేదెవరు?


కాత్యాయని, ఫణీంద్ర, స్వర్ణలత, రసమయి బాలకిషన్

**మ**హేందర్, కాత్యాయనీ జంటగా నటించిన చిత్రం 'ట్రాప్'. వీఎస్ ఫణీంద్ర దర్శకుడు. అల్ల స్వర్ణలత నిర్మాత. బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర ట్రైలర్, ఆడియో బిగ్‌సీడీని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ అందరిని ట్రాప్‌లో పడేసేలా ఉంది. స్వర్ణలత, మహేంద్రగారి మీదున్న అభిమానంతో ఈ వేడుకను వచ్చాను' అన్నారు. 'క్రైమ్ థ్రిల్లర్ కథ ఇది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. కథానుగుణంగా మంచి పాటలు కుదిరాయి. అందరిని అలరించే చిత్రమవుతుంది' అని దర్శకుడు తెలిపారు. నిర్మాత స్వర్ణలత మాట్లాడుతూ 'వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. థ్రిల్లర్ ఇతివృత్తంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. త్వరలో విడుదల చేయబోతున్నాం' అని చెప్పింది. షాలు, రచ్చరవి, విఠల్, పరమేశ్వరశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కె శివ, సంగీతం: ఈశ్వర్ పెరవలి, నేపథ్యసంగీతం: హర్ష ప్రవీణ్, నిర్మాణ సంస్థ: ప్రేమ కవితాలయ ఫిలిమ్స్, కథ, దర్శకత్వం: వీఎస్ ఫణీంద్ర.

# మ్యూజికల్ హారర్

**మి**స్టర్ 7,చిత్రం చెప్పిన కథ, మామ ఓ చందమామ చిత్రాలకు సంగీతాన్ని అందించిన మున్నాకాశీ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హేజా'. 'ఎ మ్యూజికల్ హారర్' అనేది ఉపశీర్షిక. వీఎన్‌వీ క్రియేషన్స్ పతాకంపై కేవీఎస్ఎన్ మూర్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే విడుదల కానున్న ఈ చిత్రం విశేషాలను మున్నా కాశీ తెలియ


మున్నాకాశీ

జేస్తూ 'మ్యూజికల్ హారర్‌గా, డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రమిది. సంగీతంతో పాటు నేపథ్య సంగీతం ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ముమైత్‌ఖాన్ ఈ చిత్రంలో కీలకపాత్రలో కనిపిస్తారు. తప్పకుండా చిత్రం విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ఇప్పటి వరకు వచ్చిన హారర్ సినిమాలకు భిన్నంగా వుండే చిత్రమిది. సాంకేతికంగా కూడా ఎంతో అత్యున్నతంగా ఉంటుంది. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. నూతననాయిడు, లక్ష్మన్, లిజిగోపాల్, ప్రీతం నిగమ్‌లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత: వి.ఎన్.వోలెటి. ఎడిటర్: గ్యారీ బిహెచ్.











